SAPTHAGIRI (TELUGU)
ILLUSTRATED MONTHLY
Volume: 52, Issue: 4
September-2021, Price Rs.5/-

తిరుమల తిరుపతి దేవస్థానములు

# సప్తగిరి

సచిత్రమాసపత్రిక

సెప్టెంబరు 2021
వెల రూ.5/-
పుటలు - 56



నమస్తే దేవ దేవేశ వరాహ వదనాఽచ్యుత ।
క్షీరసాగర సంకాశ వజ్రశృంగ మహాభుజ ॥

తిరుమల తిరుపతి దేవస్థానములు



# తిరుమల
# శ్రీవేంకటేశ్వరస్వామివారి బ్రహ్మోత్సవాలు
## 2021 అక్టోబరు 07 నుండి 15 వరకు

**07-10-2021**
గురువారం
పగలు: ధ్వజారోహణం
రాత్రి: పెద్దశేషవాహనం

**08-10-2021**
శుక్రవారం
పగలు: చిన్నశేషవాహనం
రాత్రి: హంసవాహనం

**09-10-2021**
శనివారం
పగలు: సింహవాహనం
రాత్రి:
ముత్యపుపందిరివాహనం

**10-10-2021**
ఆదివారం
పగలు: కల్పవృక్షవాహనం
రాత్రి: సర్వభూపాలవాహనం


**11-10-2021**
సోమవారం
పగలు: పల్లకీలో
మోహినీఅవతారోత్సవం
రాత్రి: గరుడవాహనం

**12-10-2021**
మంగళవారం
పగలు:
హనుమద్వాహనం
రాత్రి: గజవాహనం

**13-10-2021**
బుధవారం
పగలు: సూర్యప్రభవాహనం
రాత్రి: చంద్రప్రభవాహనం

**14-10-2021**
గురువారం
పగలు: రథోత్సవం
రాత్రి: అశ్వవాహనం

**15-10-2021**
శుక్రవారం
పగలు: చక్రస్నానం
రాత్రి: ధ్వజావరోహణం



# గీతాశ్లోకార్థసారం

**శ్లో : శ్వశురాన్ సుహృదశ్చైవ సేనయోరుభయోరపి ।**
**తాన్ సమీక్ష్య స కౌన్తేయః సర్వాన్ బన్ధూనవస్థితాన్ ॥**

(శ్రీమద్భగవద్గీత 01వ అధ్యాయం- 27)

**ప్రతిపదార్థం:** సః కౌన్తేయః= కుంతీపుత్రుడైన అర్జునుడు; ఉభయోః= ఇరుపక్షముల; సేనయోః అపి= సేనలయందును; అవస్థితాన్= చేరియున్న; శ్వశురాన్= పిల్లనిచ్చిన మామలను; సర్వాన్ బన్ధూన్= బంధువులందరినీ; సుహృదః చ ఏవ= ఆత్మీయులందరినీ; సమీక్ష్య= పరికించి (అపశ్యత్= చూచెను)

**భావం:** సమరభూమికి వచ్చియున్న ఇరుప్రక్కల సేనలలో పిల్లనిచ్చిన మామలను, బంధువులను, ఆత్మీయులందరినీ అర్జునుడు పరిశీలనగా చూచెను.

## అనంతమహిముడవు - అనంతశక్తివి నీవే!

అనంతమహిముఁడవు - అనంతశక్తివి నీవు
ఎనలేని దైవమా ! ని - న్నేమని నుతింతును?

అన్ని లోకములు నీ - యందునున్న వందురు నీ
వున్న లోకమిట్టిదని - వూహించరాదు,
ఎన్న నీవు రక్షకుఁడ - విందరిపాలిటికి
నిన్ను రక్షించేటివారి - నే నెవ్వరి నందును.

తల్లివి దండ్రివి నీవు - తగు బ్రహ్మాదులకు
ఎల్లగా నీ తల్లిదండ్రు - లెవ్వరందును,
ఇల్లిదె వరములు నీ - విత్తు విందరికిని
చెల్లఁబో నీ కొకదాత - చెప్పఁగ జోటేది.

జీవుల కేలికవు - శ్రీవేంకటేశుఁడవు నీ
వేవలఁ జూచిన నీకే - యేలికె లేఁడు,
వేవేలు మునులును - వెదికేరు నిన్నును
నీ వెవ్వరి వెదకేవు - నిర్మలమూరితివి.

(అన్నమాచార్య ఆధ్యాత్మ సంకీర్తన 3-81)





*లోకములెల్ల పరబ్రహ్మమూర్తియైన శ్రీమన్నారాయణుని యందే లీనమైయున్నవి. సర్వవ్యాపియైన ఆ పరమాత్మను ఒకచో నున్నవానినిగా చెప్పట తగదు. ఆయన ఎల్లవారిని రక్షించువాడు గాన ఆయనకు రక్షకు డింకొకడు లేడు. జననరహితుడైన ఆ దేవునకు జననీ జనకు లెవ్వరు? అను ప్రశ్నయే తగదు. ఆయన వరప్రదాతయేగాని వరములు స్వీకరించువాడు గాడు. సర్వలోకపరిపాలకుడైన ఆ పరమాత్మునకు మరొక పరిపాలకుడెట్లుండగలడు? మునులు మున్నగువారు రక్కసులచే ఇక్కట్టులపాలైనప్పుడు లేదా మోక్షాపేక్షతో ఆయనను వెదుకుదురు, అవాప్తసమస్తకాముడైన ఆ దేవుడు మరొకరిని వెదకి వారి నుండి పొందవలసిన దేమియు లేదు. ఇట్లు ఏ విధముగ జూచినను శ్రీవేంకటేశ్వరుని ప్రభావాతిశయము మేర మీరి యున్నదని అన్నమయ్య వాక్కు.*

# శ్రీవేంకటేశ్వర
# పురాతన ఆలయ వారసత్వ పరిరక్షణ ట్రస్టు



ప్రాచీనకాలం నుంచి ఆలయాలు మన సంస్కృతికి, వైభవానికి ప్రతిబింబాలు. ఆధ్యాత్మిక భావసంపదను తరతరాలకూ తరలించుకువస్తున్న కరదీపికలు దేవాలయాలు. శిథిలావస్థలో ఉన్న పురాతన ఆలయాల పరిరక్షణధ్యేయంతో, వాటి పునరుద్ధరణ కోసం ఉదాత్తమైన, బృహత్తర ప్రణాళికా రూపకల్పనలో భాగంగా తి.తి.దే. 2006లో '**శ్రీవేంకటేశ్వర పురాతన వారసత్వ పరిరక్షణ ట్రస్టు**'కు నాంది పలికింది.

ఇటువంటి దైవకార్యాలకు తోడ్పాటునివ్వడం ధర్మవిధిగా భావించి, భక్తులు భారీగా ఆర్థికసహాయాన్ని సమకూర్చి సప్తగిరీశుని అనుగ్రహంతో సకలైశ్వర్యాలను పొందవలసిందిగా ఆహ్వానిస్తున్నాం.

**అధికరణం 80 (జి) క్రింద ఆదాయపు పన్ను మినహాయింపు వర్తిస్తుంది**

**: డిమాండు డ్రాఫ్ట్ / చెక్కులు పంపవలసిన చిరునామా :**

ముఖ్యగణాంకాధికారి, తి.తి.దే. పరిపాలనభవనం, కె.టి.రోడ్డు, తిరుపతి-517 501,
ఫోన్ నెం.0877-2264249, 2277777, 2264258

50 వసంతాల
1970-2020
తిరుమల తిరుపతి దేవస్థానముల సచిత్ర మాసపత్రిక

# సప్తగిరి

సంపుటి : 52 సెప్టెంబరు, 2021 సంచిక : 04



వేంకటాద్రి సమం స్థానం
బ్రహ్మాండే నాస్తి కించన ।
వేంకటేశ సమో దేవో
న భూతో న భవిష్యతి ॥

## ఈ నెలలో....


| | | |
|---|---|---|
| గణపతయే మనసా స్మరామి | శ్రీ అయ్యగారి శ్రీనివాసరావు | 07 |
| ఆదివరాహా... నమో నమః | శ్రీ కె. మల్లికార్జున | 09 |
| శ్రీమద్భగవద్గీత | విద్వాన్, డా॥ ఈ.జి. హేమంత కుమార్ | 11 |
| మమకారాలను తొలగించిన వామనుడు | డా॥ అనప్పిండి సూర్యనారాయణమూర్తి | 13 |
| తిరుమల సమయాచారములు | కీ.శే. డా॥ ఎన్.సి.వి.నరసింహాచార్యులు, కీ.శే. శ్రీమాన్ టి.ఏ.కృష్ణమాచార్యులు | 17 |
| "వైదిక" విష్ణు | శ్రీ ఎం.గంగిరెడ్డి | 19 |
| సకల సంపత్ప్రదం.. అనంత పద్మనాభవ్రతం | డా॥ ఎస్. లక్ష్మి | 21 |
| అరిషడ్వర్గాలు | శ్రీ "వై.వి.ఎస్." | 24 |
| కుజుడు (అంగారకుడు) | | 26 |
| యునెస్కో గుర్తింపు పొందిన రామప్ప దేవాలయం | శ్రీ అరవింద్ ఆర్య | 31 |
| లోకహితైషిణి - సత్యవతి | ఆచార్య కోలవెన్ను మలయవాసిని | 34 |
| శ్రీమద్భగవద్గీత | ఆచార్య కుప్పా విశ్వనాథశర్మ | 36 |
| అన్నమయ్య సంకీర్తనల్లో.. నారాయణ తే నమో నమో | శ్రీమతి ఎస్. మాధవీలత | 38 |
| హరిదాసవాఙ్మయంలో... శ్రీవేంకటాచలాధీశుడు | శ్రీ సుస్వరం నాగరాజాచార్యులు | 41 |
| కర్దమమహర్షి | సద్గురు డా॥ కె. శివానందమూర్తి | 43 |
| శ్రీకృష్ణామృతం | "అనంత" (కృష్ణసుందరి సత్తిరాజు) | 45 |
| నమ్మశక్యంగాని 'అద్భుతం' | శ్రీ కె.సి.లలిత | 46 |
| సంప్రదాయ వైద్యంలో శొంఠి | డా॥ చిట్టిభొట్ల మధుసూదనశర్మ | 47 |
| సంస్కృతం నేర్చుకుందాం..!! | రచన- కీ.శే. మహామహోపాధ్యాయ కె.కృష్ణాచార్య, నిర్వహణ- మహామహోపాధ్యాయ ఎస్.లక్ష్మణయ్య | 49 |
| వైకుంఠపాళి | శ్రీ కోగంటి వేంకటఅప్పలాచార్యులు | 50 |
| పెరట్లో పెన్నిధి | శ్రీమతి ఎం. సత్యవతి | 51 |
| వామనుడు (చిత్రకథ) | కథ : డా॥ అల్లాడి సంధ్య, చిత్రాలు : శ్రీ కె.తులసీప్రసాద్ | 52 |
| బాలవినోదం | నిర్వహణ: డా॥ అల్లాడి సంధ్య | 54 |


ముఖచిత్రం : శ్రీఆదివరాహస్వామి, తిరుమల
వెనుక చిత్రం : శ్రీపద్మావతీఅమ్మవారు, తిరుచానూరు

**గౌరవ సంపాదకులు**
డా॥ కే.ఎస్.జవహర్ రెడ్డి, ఐ.ఏ.ఎస్.,
కార్యనిర్వహణాధికారి, తి.తి.దేవస్థానములు.

**ప్రచురణకర్త-ప్రధాన సంపాదకులు**
డా॥ కె.రాధారమణ
ఎం.ఏ., ఎం.ఫిల్., పిహెచ్.డి.,

**సంపాదకులు**
డా॥ వి.జి.చొక్కలింగం, ఎం.ఏ., పిహెచ్.డి.,

**ఉపసంపాదకులు**
డా॥ అల్లాడి సంధ్య
ఎం.ఏ., ఎం.ఫిల్., పిహెచ్.డి., పి.జి.డిప్లొమా ఇన్ జర్నలిజం

**ముద్రాపకులు**
శ్రీ పి.రామరాజు, ఎం.ఏ.,
ప్రత్యేకాధికారి (ప్రచురణలు & ముద్రణాలయం),
తి.తి.దే., తిరుపతి.

**ఫోటోలు**
శ్రీ పి.ఎన్.శేఖర్, ఫోటోగ్రాఫర్, తి.తి.దే.
శ్రీ బి.వెంకట్రమణ, సహాయఫోటోగ్రాఫర్, తి.తి.దే.,

సప్తగిరి మాస పత్రిక
ఇతర వివరాలకు ఫోన్ నెంబర్లు
0877-2264543
0877-2264359
0877-2264360

విడి ప్రతి : రూ. 5/-
సం॥ చందా : రూ. 60/-
జీవిత చందా : రూ. 500/-
విదేశాలకు సం॥చందా : రూ. 850/-

ఇందులోని వ్యాసాలు, అభిప్రాయాలు రచయితల వ్యక్తిగతమైనవి. వాటికి తిరుమల తిరుపతి దేవస్థాన యాజమాన్యం బాధ్యత వహించదు.

24 గంటలూ పనిచేసే
తి.తి.దే. కాల్‌సెంటర్ ఫోన్ నెం.
0877 2277777 / 2233333



వెబ్‌సైట్- www.tirumala.org;
'సప్తగిరి' మాసపత్రికకు సంబంధించిన సలహాలు / సూచనలు / ఫిర్యాదులు-
sapthagiri.helpdesk@tirumala.org; ద్వారా తెలియజేయవచ్చు.

సంపాదకీయం

# “వేదోఽఖిలో ధర్మమూలమ్”

*‘అన్ని ధర్మాల మూలం వేదమే’!* – మనువు, గౌతముడు, పరాశరుడులాంటి స్మృతి కర్త లందరూ ఈ వాక్యాన్నే ఉద్ఘాటించారు. మన సనాతన ధర్మానికంతటికీ మూలం వేదమే. దానిని ఆధారం చేసుకొని ధర్మశాస్త్రాలు (స్మృతులు), పురాణాలు, ఇతిహాసాలు ఉద్భవించాయి. చివరకు కావ్య నాటక, సంగీత, నాట్య శిల్పాది కళలు, వైద్యాది విద్యలు కూడా వేదమూలాలనే ఆధారం చేసుకొని వర్ధిల్లాయి.

వేదవిద్యను అక్షరస్వరాది గ్రంథరూపంగా అధ్యయన అధ్యాపనాది పద్ధతులలో పరిరక్షించే జీవనవిధానాన్ని అవలంబిస్తూ తిరుమల తిరుపతి దేవస్థానం వేదవ్యాప్తికి వేదపాఠశాలలను స్థాపించి విద్యార్థులకు బోధిస్తూ; వేదమే జీవనంగా భావించే వేదపండితులను పోషిస్తూ, అంకితభావంతో తరతరాలుగా కృషి చేస్తున్నది. ఆ బాధ్యత వారు తీసుకున్నా– వేదం బోధించిన ధర్మాన్ని సామాన్యజను లకు సైతం అందించడానికి మహర్షులు స్మృతులనూ, పురాణాదులనూ పటిష్ఠంగా తీర్చిదిద్దారు. వీటితోపాటు ఆగమశాస్త్రాలు, మంత్ర శాస్త్రాలు కూడా వేదాల మూలాలనుండే అభివృద్ధి చెందాయి.

*‘వేదవేద్యే పరే పుంసి జాతే దశరథాత్మజే, వేదః ప్రాచేతసాదాసీత్ సాక్షాత్ రామాయణాత్మనా’*– “వేదవేద్యుడైన పరమపురుషుడు దశరథపుత్రుడిగా ఉద్భవించాడు. ప్రాచేతసుడనే పేరు కలిగిన మహర్షి (వాల్మీకి) ద్వారా వేదం నేరుగా రామాయణంగా ఆవిర్భవించింది” అనే ప్రసిద్ధశ్లోకం మనకు సుపరిచితం.

*“రామాయణం వేదసమం”*– రామాయణం వేదంతో సమానం– అని రామాయణంలోని వాక్యమే స్పష్టంగా తెలుపుతోంది.

‘మహాభారతా’న్ని ‘పంచమవేదం’ అని పేర్కొంటున్నాం.

భాగవతం *“నిగమకల్పతరోర్గలితం ఫలం”* – వేదమనే కల్పతరువునుండి రాలిపడిన ఫలం అని విశదపరచారు.

*“ఇతిహాస పురాణాభ్యాం వేదం సముపబృంహయేత్”* – ఇతిహాస పురాణాల ద్వారా వేదం చక్కగా వ్యాప్తి చెందించబడినది. వేదం సిద్ధాంతరూపంగా చెప్పిన ధర్మాలను, దృష్టాంతరూపంగా అందించడానికే పురాణేతిహాసాలు ఉద్భవించాయి.

నాట్యం, సంగీతం కూడా *“చతుర్వేదసముద్భవం”* అని చెప్పుకున్నాయి. సంగీతశాస్త్ర కోవిదులైన త్యాగరాజాదులు కూడా సంగీతాన్ని “సామవేదజనితం” అని స్పష్టపరచారు.

మన విద్యలు, శాస్త్రాలు కేవలం పుస్తకాధారాలు కావు. దేశస్వభావం, సంప్రదాయం, విజ్ఞానం వంటివి చాలా గమనించాలి. అప్పుడే ఆ విద్య ప్రస్ఫుటంగా అవగతమవుతుంది.

ఈ దేశం అనాదిగా వేదభూమి. వేదమంత్రం మొదలుకొని, జానపదుల పలుకువరకు విస్తరించిన ధర్మం మనది. ఇంత అనంతపరిధి కలది కనుకనే మన సనాతనధర్మవృక్షం అచంచలమై విస్తరిల్లింది.

ఈ వృక్షంలోని కొమ్మలకీ, రెమ్మలకీ, పువ్వులకీ, ఫలాలకీ అన్నిటికీ ఒకే ‘వేదధర్మం’ మూలం. దీనితో మేళవించుకొని చెట్టుని కబళిద్దామనే చీడపురుగుల్ని తెలివిగా గుర్తించి దూరం చేయడంలోనే మనం విజ్ఞతను కనబరచాలి.

‘వేద–శాస్త్రాలను’ పరిరక్షిద్దాం. మానవజాతిని కాపాడుదాం.

# గణపతయే మనసా స్మరామి

– శ్రీ అయ్యగారి శ్రీనివాసరావు



దక్షిణాయనం దేవతా ప్రీతికరమైనది. అందువల్లనే పండుగలు ఎక్కువగా వచ్చే కాలం ఇది. అలా వచ్చే పండుగల పరంపరలో మొదటగా వచ్చే పెద్ద పండుగ **‘వినాయకచవితి’.** వినాయకుడికి అనేకమైన నామాంతరాలు ఉన్నాయి. రూపాన్ని బట్టి, అవతారవిశేషాన్ని బట్టి, ప్రాశస్త్యాన్ని బట్టి ఆయా పేర్లు వచ్చాయి.

వినాయకుడి ఉత్పత్తి గురించి అనేకమైన కథలు ప్రచారంలో ఉన్నాయి. ఆయా పురాణ కథనాలబట్టి కాస్త తేడా ఉన్నప్పటికీ అతడి ఆవిర్భావానికి ఉన్న ప్రాశస్త్యం, అన్ని కథల సారాంశం ఒక్కటే. త్రిమూర్తులలో విష్ణువు స్థితికారకుడు. లోకంలోని పరిస్థితులను సమస్థితిలో ఉంచడం కోసం అతడు అనేక అవతారాలను ఎత్తాడు. రూపాలనూ దాల్చాడు. పెద్ద ఆపదలనుంచి లోకాలను రక్షించడానికి దాల్చినవి అవతారాలు. ఇవి మత్స్య, కూర్మ... ఆదిగాగల దశావతారాలు. చిన్న చిన్న అడ్డంకులను అధిగమించడం కోసం వేరు వేరు రూపాలను ధరించాడు. హయగ్రీవుడు, వినాయకుడులాంటివీ కోవకు చెందినవి. అలాంటి విష్ణురూపాంతరమే గణపతిరూపం. శివపార్వతులకు పుత్రుడుగా జన్మించడం వలన ఇతడు శివ, విష్ణుతత్త్వాల సంగమం. ద్వయరూపాల కలయిక అయిన రూపం అవడం వలన అత్యంత శక్తివంతమైనది.

గజాసురుడు అనే రాక్షసుడు బ్రహ్మవరబలంతో లోకాలను అల్లకల్లోలం చేస్తున్నాడు. దేవతలు భయకంపితులై శివుడికి (లయకారకుడు కాబట్టి) మొరపెట్టుకున్నారు. అతడిని సంహరించమన్నవారికి సమాధానంగా శివుడు “ఆ రాక్షసుడిని సంహరించడానికి నా శక్తి మాత్రమే చాలదు. విష్ణుతేజస్సు కూడా తోడవ్వాలి. అందువలన విష్ణువు పార్వతి గర్భాన గజముఖుడిగా జన్మిస్తాడని” అభయమిచ్చాడు. అతడి మాట ప్రకారం ఏనుగు ముఖం, మానవశరీరంతో ద్వయరూపుడిగా రూపుదాల్చాడు. ప్రసన్నమైన ఏనుగుముఖం, ఏకదంతం, ధవళవర్ణం, అంకుశం, గొడ్డలి, పద్మం, అభయహస్తాలతో నాలుగు చేతులు. ఇదీ అతడి రూపం. బ్రహ్మదేవుని కుమార్తెలు అయిన సిద్ధి, బుద్ధిలను వివాహమాడాడు. వారిద్దరి సాహచర్యబలం వలన బుద్ధికుశలతతో ప్రవర్తించి గజాసురుని సంహరించి విజయాన్ని సిద్ధింప చేసుకున్నాడు. లోకానికి రాక్షసపీడ వదిలింది. ఆ ఆనందంతో దేవతలు అతడికి అనేకమైన వరాలు ఇచ్చారు. ముందుగా తండ్రి అయిన శివుడు తన అనుయాయులైన ప్రమథగణాలకి అతడిని నాయకుడిగా చేశాడు. అందువలన **‘గణనాథుడు’** అయ్యాడు.

విష్ణువు ఆశీర్వదిస్తూ “సమస్తసిద్ధులకు అధీశ్వరుడవు కమ్ము” అని దీవించాడు. అందువలన “సిద్ధి వినాయకుడు” అయ్యాడు.

బ్రహ్మ దీవిస్తూ "అందరిచేత పూజ్యుడవు కమ్ము" అని దీవించాడు, త్రిమూర్తులలో తొలి దైవమైన బ్రహ్మవలన "తొలి పూజలందుకునే" వాడయ్యాడు. యమధర్మరాజు "ధర్మాత్ముడవు, దయాళువు" కమ్మని దీవించాడు.

లక్ష్మీదేవి అతడిని ఒడిలో కూర్చుండబెట్టుకుని "నీ దేహంలో నిరంతరం నా స్థితి ఉంటుంది" అని దీవించింది. అందువలన అతడు లక్ష్మీగణపతి అయ్యాడు.

సరస్వతి దీవిస్తూ "ధారణాశక్తి, స్మృతి, వివేచనాశక్తి నీకు కలుగుగాక" అని పలికింది. అందువల్లనే అతడు బుద్ధిప్రదాత అయ్యాడు.

గాయత్రీ మాత దీవిస్తూ "నీవు వేద విదుడవు, మంత్ర విదుడవు అగుగాక" అంది. అందువల్లనే అతడు మంత్రాధిదేవత అయ్యాడు. అందువల్లనే బీజాక్షరాలను మంత్రాలుగా ఉచ్చరించే వారికి అత్యంతశక్తిని ప్రసాదిస్తాడు గణపతి.

భూమాత "క్షమాగుణం కల వాడివి" కమ్మని దీవించింది. అందువలనే దేవతలలో ఏ మాత్రం కోపస్వభావంలేని వాడయ్యాడు వినాయకుడు. (పరిశీలించండి ఏ సందర్భంలోనూ వినాయకుడిని చూసి ఏ మానవులు భయపడరు గౌరవమే తప్ప).



ఇలా సమస్తదేవతల దీవెనలు అందుకున్న వినాయకుడు యోగ, సిద్ధ, శుభ, ఐశ్వర్యకారకుడైనాడు. మృత్యుంజయుడు, ఉచ్ఛగుణోపేతుడు అయ్యాడు, ఆదివంద్యుడైనాడు.

"అతడి ఆరాధనకు బీజాక్షరం 'గం'. అందువల్లనే గం గణపతయే నమః" అని మొదలు పెట్టాలి ఏ కార్యాన్ని అయినా. ఈ జగమంతా గణమయం (అంటే సమూహములమయం) అలాంటి అన్ని గణాలకి అధిపతి కాబట్టే గణపతి. 'గ' శబ్దం (అక్షరం కాదు) సగుణానికి సంకేతం. 'ణ' శబ్దం నిర్గుణానికి సంకేతం. ఇలా సగుణ, నిర్గుణాత్మకమైన ద్వయ స్వభావాలకీ ప్రతీక కాబట్టే లోకంలో అంతా సగుణమే (అనిపిస్తుంది). కానీ నిజానికి అంతా నిర్గుణమే (మాయే). ఈ సగుణ నిర్గుణాత్మక స్వభావాలు అందరికీ అనునిత్యం అనుభవైకవేద్యమే. కాబట్టే ఆ రెండుతత్త్వాలకీ ప్రతీక అయిన గణేశుడు ప్రతి పనికీ ప్రధాన ఆరాధకుడు అయ్యాడు.

వినాయకుడికి మంగళ, శుక్రవారాలు ఇష్టం. మోదక ప్రియుడు. ఏకవింశతి పత్రాలు అతడికి అత్యంత ప్రియమైనవి. జిల్లేడు పరమ ప్రీతికరమైన వృక్షం. ఇవన్నీ ఆరోగ్యకారకమైనవి. తాకినంతనే ఆరోగ్యం చేకూర్చేవి. వాటిలో పేర్లు తెలియని పత్రాల వివరణ ఇది.

1)మాచీపత్రం(చామంతి ఆకులా ఉండే మాచీపత్రి), 2)బృహతీ (వాకుడు), 3)దత్తూర(ఉమ్మెత్త), 4)బదరీ(రేగు), 5)అపామార్గ(ఉత్తరేణి), 6)విష్ణుక్రాంత(ఉసిరి), 7)దాడిమీ(దానిమ్మ), 8)మరువక(మరువం), 9)సింధువారం (వావిల), 10)అర్జున(మద్ది), 11)శమీ(జమ్మి), 12)అర్క(జిల్లేడు). ఇవిగాక మిగిలిన 9 పత్రాల పేర్లు వినగానే తెలిసేవి, అర్ధమయ్యేవి. కాబట్టి వివరణ అనవసరం. వీటన్నిటితో పూజించటంలోని ఆంతర్యం ఆయురారోగ్యాల వృద్ధి. తద్వారా మహాభాగ్య సమృద్ధి.

ఆంధ్ర కర్ణాటకాది దాక్షిణాత్యులు విశేషంగా పూజిస్తారు గణపతిని. ఉత్తరభారతీయులలో గణపతిని ఆరాధించేవారు మహారాష్ట్రులు. అత్యంతభక్తి శ్రద్ధలతో, పట్టుదలతో వారీ పండుగను జరుపుతారు. తాహతుని బట్టి అనుకున్న సంకల్పాన్ని బట్టి ఒకటి, మూడు, అయిదు, ఏడు, తొమ్మిది ఇలా బేసి గణన ప్రకారం పూజించాలి.

వినాయకుని ప్రతిమకు వాడే మూలపదార్థం మృత్తిక అయితేనే శ్రేష్ఠమైనది. సృష్టి, స్థితి, లయలు మూడింటికీ ప్రతీక 'మట్టి'. కాబట్టి మట్టితో చేసిన ప్రతిమే సర్వశ్రేష్ఠమైనది. ఆపైన రాయి, లోహం ఒకదానికన్నా మరొకటి అధమమైనవి. దానికి కారణం వాటికి తిరిగి ప్రకృతిలో సంపూర్ణంగా కలిసిపోయే తత్త్వం లేకపోవడమే.

ఇలా... ఆధ్యాత్మిక, సామాజిక, ఆరోగ్య, ఐశ్వర్య, విజ్ఞానాత్మక, విశ్లేషణాత్మకమైన ఎన్నో అంశాల సమాహారమే విఘ్నేశ్వరుడు. అందువలన ఎవరు ఏ కోరికతో పూజిస్తే ఆ కోరిక సిద్ధిస్తుంది. ఏ కోరికా లేనివారు పూజిస్తే మోక్షం ప్రాప్తిస్తుంది.

# ఆదివరాహా.. నమో నమః

– శ్రీ కె.మల్లికార్జున

సృష్టిలో ప్రతిప్రాణికీ ఒక్కొక్క ప్రత్యేక లక్షణం, శక్తి ఉంటాయి. అందువల్ల ఆ లక్షణాలు గల జీవి కొన్ని విషయాలలో అత్యంత బలసమన్వితమై ఉంటుంది. ఆకారణంగానే సర్వస్థితికారకుడైన శ్రీమహావిష్ణువు దుష్టశిక్షణ చేయవలసివచ్చినప్పుడు స్వస్వరూపంతో కాకుండా ఆయా ప్రాణుల రూపాల్లోనే అవతారం దాల్చుతాడు. వాటిలో ఒకటి **"వరాహావతారం".**

ఈ రూపంలో అవతారం దాల్చడానికి ఒక కారణం ఉంది. పూర్వం హిరణ్యాక్షుడు అనే రాక్షసుడు తన బలగర్వంతో భూమినంతటనీ చాపలా చుట్టి పాతాళలోకంలో దాగి ఉన్నాడు. బ్రహ్మసృష్టి అయిన ఈ విశ్వంలో ఏడు ఊర్ధ్వలోకాలు, ఏడు అధోలోకాలు ఉన్నాయంటారు. అన్నింటిలోను అత్యంత ప్రాధాన్యం ప్రాభవం కలిగినది ఊర్ధ్వలోకాల్లో చేరి ఉన్న భూలోకం మాత్రమే. దానిమీదనే మానవాది సర్వప్రాణికోటి నివసించేది. మిగిలిన లోకాలన్నింటి ఉనికికి కేంద్రస్థానంలాంటిది భూమి. అలాంటి భూలోకం ఉనికికి ప్రమాదం ఏర్పడితే మిగిలిన లోకాల మనుగడ ప్రశ్నార్థకమవుతుంది. ఈ విషయాన్నంతా విష్ణువుకు దేవతలంతా విన్నవించాలనుకున్నారు. భూదేవిసైతం తన బాధలను సమగ్రంగా విష్ణువుకు మొరపెట్టుకుంది. తనను రక్షించమని వేడుకుంది. అప్పుడు హిరణ్యాక్షుని చెరనుంచి భూమిని విడిపించడానికి అవతరించినదే ఈ వరాహావతారం.

ఈ వరాహావతారరూపం పర్వత సమానమై గంభీరమైన, బలిష్ఠమైన నల్లనిదేహం, చీకట్లను చీల్చుకొని ప్రజ్వరిల్లుతున్న జ్యోతుల్లా ప్రకాశవంతమైన కళ్లు, రెండు దౌడల నుంచి పైకి చొచ్చుకువచ్చిన తెల్లగా వాడిగావున్న కోరలు, తన పదఘట్టనతో ఎంతటి దుష్టశక్తినైనా అణగదొక్కే సమర్థత కలిగిఉన్నట్టున్న గిట్టలు, మేఘగర్జనను మించిన 'ఘుర్ఘుర' ధ్వనితో పాతాళంలో దాగిన హిరణ్యాక్షుణ్ణి ఎదుర్కోవడానికి అనువైన లక్షణాలతో ఆవిర్భవించినదే వరాహావతారం.



పాతాళలోకానికి మార్గమైన సముద్రం లోపలికి వరాహం దిగింది. పాతాళలోకం చేరాక అక్కడివరకూ వ్యాపించి ఉన్న కులపర్వతాల మొదళ్లను తన ముట్టెతో పెకలించసాగింది. ఆ చర్యతో పర్వతాలు భయపడి హిరణ్యాక్షుడు దాగినచోటును చూపించాయి.

హిరణ్యాక్షుడు వరాహరూపంలో ఉన్న విష్ణువుతో యుద్ధానికి తలపడ్డాడు. హిరణ్యాక్షుడు తనకున్న శక్తినంతా కూడ గట్టుకుని వరాహాన్ని కొట్టాడు. తిరిగి తన శరీరానికే దెబ్బ తగిలి విపరీతమైన నొప్పి పుట్టసాగింది. దానికి తోడు వరాహరూపధారి విష్ణువు అనేక రకాలుగా కొడుతున్న దెబ్బలకు తట్టుకోలేక పోతున్నాడు. హిరణ్యాక్షుడు దానిని పట్టుకుందామంటే దొరకదు. రెండుకాళ్ల సందు నుంచి దూరి తప్పించుకుని వెళుతోంది. అంతలో అన్నివైపులనుండి వచ్చి హిరణ్యాక్షుని మీద వరాహం దాడి చేస్తోంది. అల్పప్రాణిలా కనబడుతున్న, పైకి కనిపించని

శక్తులు కలిగిన వరాహంతో యుద్ధం చేసి అలసి చివరికి మరణించాడు హిరణ్యాక్షుడు.

అప్పుడు వెంటనే వరాహమూర్తి పాతాళంలో చుట్టగా పడివున్న భూమిని తన కోరలతో పైకి ఎత్తి యథాస్థానంలో ప్రతిష్ఠించాడు. అలా భూమిని ఉద్ధరించిన వరాహమూర్తిపై దేవతలందరూ పూలవర్షం కురిపించి స్తుతించారు.

విష్ణువు మరొక సందర్భంలో కూడా వరాహరూపం దాల్చవలసి వచ్చింది. అది అవతారం కాదు. రూపం మాత్రమే వరాహం. ఎప్పుడంటే అది కల్పాంతం ముగిసాక, కొత్త జగతికి ప్రారంభ సమయం. అంతవరకు జలమయమై ఉన్న బ్రహ్మాండాన్ని ఏడు ఊర్ధ్వభాగాలుగా, ఏడు అధోభాగాలుగా విభజించి ఆ యా లోకాల్లో అవసరమైన వనరులను సమకూర్చుతున్నాడు విష్ణువు. ఆ ప్రక్రియలో భాగంగా భూమిని సర్వాంగసుందరంగా తీర్చిదిద్దాలనే తలంపుతో అనేకపర్వతాలు, నదులు, సముద్రాలను సమకూర్చుతున్నాడు. ఆ భారాన్ని తాళలేక భూమి కిందికి కుంగి పోసాగింది.



ఆ దశలో శ్రీమహావిష్ణువు వరాహరూపం ధరించి తన కోరలమీద భూమిని ఉంచుకున్నాడు. ఆ స్థితిలో భూమిని స్థిరంగా నిలుపడానికి అష్టదిగ్గజాలను ఆసరాగా ఏర్పరచి, వాటి తొండాల మీద భూమిని ప్రతిష్ఠించాడు. అప్పటినుంచి ఆ దిగ్గజాలే భూమిగతి తప్పకుండా కాపాడుతున్నాయని పురాణ కథనం. అలా అవతరించినటువంటి వరాహరూపాన్ని **'యజ్ఞ వరాహరూపం'** అంటారు. రెండుసార్లు వరాహరూపం దాల్చడం వల్లనే వరాహజయంతి విషయంలో కొంత సందిగ్ధం నెలకొంది.

సృష్టి ఆదిలో భూమిని సుప్రతిష్ఠితం చేయడానికి ఎత్తిన యజ్ఞవరాహ జయంతి చైత్రబహుళ త్రయోదశినాడు, హిరణ్యాక్షుడి బారినుంచి భూమిని రక్షించడానికి ఏర్పడిన వరాహరూప జయంతి భాద్రపద శుక్ల తదియనాడు అని గ్రంథాల ఆధారంగా వెల్లడవుతోంది.

శ్రీమహావిష్ణువు రాక్షసుడైన హిరణ్యాక్షుని సంహరించి వేంకటాచలానికి వచ్చి స్వామి పుష్కరిణిలో వెలసి, శ్రీ భూ నీళాదేవులను, క్రీడాపర్వతాన్ని గరుడునిచే తెప్పించుకొని తిరుమలలో వేంచేసినట్లు పౌరాణికులవచనం.

## శ్వేతవరాహకల్పంలో...

"శ్రీమహావిష్ణో రాజ్ఞయా ప్రవర్తమానస్య
ఆద్యబ్రహ్మణః ద్వితీయ పరార్థే
శ్రీ శ్వేతవరాహకల్పే వైవస్వత
మన్వన్తరే కలియుగే ప్రథమపాదే"

ఇది నిత్యం మనం అనేది, వినేది. మనం ప్రస్తుతం "శ్వేతవరాహకల్పం"లో ఉన్నాం. శాస్త్రప్రకారం కృత, త్రేతా, ద్వాపర, కలియుగాలు అనే నాలుగుయుగాలు వెయ్యిమార్లు తిరిగివస్తే బ్రహ్మకు ఒక పగలు. ఒక పగలు, రాత్రి కలిస్తే ఒక రోజు. దానికే కల్పం అనిపేరు. ప్రస్తుతం కల్పారంభంలో శ్రీహరి వరాహఅవతారాన్ని దాల్చాడు అని ఋషివచనం. అందుకే దీన్ని **'శ్వేతవరాహకల్పం'** అని అంటున్నాం.

తిరుమలలో వరాహస్వామి ఆలయం స్వామి పుష్కరిణి వద్ద ఉంది. వరాహరూపంలో ఉన్న విష్ణువుకు ప్రత్యేకంగా ఆలయాలు లేవు. ఆ తరువాతి అవతారమైన నరసింహావతారంతో కలిసి సింహాచలంలో వరాహలక్ష్మీనరసింహస్వామిగా పూజలు అందుకొంటున్నాడు.


*ఓం వరాహలక్ష్మీ నృసింహాయ నమః*

# శ్రీమద్భగవద్గీత

10

## 10వ-అధ్యాయం (సారసంగ్రహం)

*విద్వాన్, డా॥ ఈ.జి. హేమంత కుమార్,*
*94416 45995*



### విభూతియోగం అధ్యాయ నామౌచిత్యం

విభూతి అంటే ఐశ్వర్యం. మహిమాతిశయం. అన్నీ భగవంతుని యొక్క స్వరూపాలే కనుక భగవద్విభూతి యోగం. ఈశ్వర మహిమాతిశయం, విభూతులు విస్తృతంగా ఈఅధ్యాయంలో వివరింపబడ్డాయి.

భగవంతుని యొక్క ఐశ్వర్యంను బోధించేది అనికూడా అర్థం కలదు. భగవంతుని మహిమాతిశయం తెల్సుకోవడం కూడా ఒక యోగమే. సర్వేశ్వరుని యోగశక్తి అనంతం. దీనిని సామాన్యజనులు తెలుసుకోలేరు. మానవులకే కాదు దేవతలకు సహితం తెలుసుకోవడం దుస్సాధ్యం అని భగవంతుడే తెల్పి ఉన్నాడు. ఆ యా ప్రాణి వర్గాల్లో మేలైన వారంతా తన స్వరూపమేనన్నాడు. భగవద్విభూతి అనంతమైంది. అయి నప్పటికీ సామాన్య జనులు తెల్సుకోవడానికి కొన్ని పుణ్యమైన, పవిత్రమైన విభూతులు మాత్రం ఈ అధ్యాయంలో తెలుపబడి ఉన్నాయి. ముఖ్యంగా స్త్రీలలో ఉన్న 1)కీర్తి 2)లక్ష్మి 3)మధురమైన వాక్కు 4)జ్ఞాపకశక్తి 5)సామర్థ్యం 6)ధైర్యం 7)క్షమ- ఈ ఏడుగుణాలు తన స్వరూపమే అన్నాడు. ఈ ఏడుగుణాలతో నేను స్త్రీలయందు నివాసం చేస్తున్నానని కృష్ణపరమాత్మ ప్రకటించాడు. స్త్రీల గొప్పదనాన్ని గుర్తించి వారిపై భగవంతు డెంత కరుణ కల్గి ఉన్నాడో ఇందులో తెలుస్తున్నది.

భగవంతుడే తన విభూతులను ప్రకటించుకొంటూ –

ఆదిత్యానామహం విష్ణుర్జ్యోతిషాం రవిరంశుమాన్ ।
మరీచిర్మరుతామస్మి నక్షత్రాణా మహం శశీ ॥ 21

అని పై శ్లోకంలో తెలుపుకున్నాడు. అంతే కాకుండా దైవగుణాలు ఎవరియందు కన్పడతాయో అవన్నీ భగవత్స్వ రూపానికి సంబంధించిన వనే గొప్ప రహస్యాన్ని కూడా వ్యక్తం చేశారు.

భగవద్విభూతులకు, అంతం లేదని చెబుతూ– ఏ దేది ఐశ్వర్యంతో కూడిందో, శక్తి కల్గిఉందో, శ్రేష్ఠమైందో అది అంతా భగవదంశేనని చెప్పాడు. అదే ఈ అధ్యాయంలోని సారాంశం. ఈ విధంగా భగవద్విభూతులను వివరించిన అధ్యాయం కాబట్టి ఇది విభూతియోగం అయింది. ఈ అధ్యాయం చదవటం వల్ల ఆశ్రమధర్మాలన్నీ సక్రమంగా నిర్వహిస్తే కలిగే పుణ్యం ఏర్పడి జ్ఞానం ప్రాప్తిస్తుంది.

### శ్రీకృష్ణుడంటున్నాడు-

అర్జునా! నా యందు ప్రీతిగల నీకు నీ శ్రేయస్సు కోరి నేను చెప్పే ఈ పరమోత్కృష్ట విషయాన్ని ఏకాగ్రచిత్తంతో ఆలకించు. నేను దేవ ఋషిగణాలకు ఆదిని. నాకు పుట్టుక లేదు. అంతేకాదు అసలీ బ్రహ్మాండమంతటికీ ఆధారభూతుడ్ని నేనే. నానుండే ఈ సమస్త జగత్తు ఆవిర్భవిస్తున్నది. ఈ సత్యాన్నీ, రహస్యాన్ని తెలుసుకొన్నవాడు జ్ఞానియై సకల పాపాల నుండి విముక్తుడౌతున్నాడు.

బుద్ధి, జ్ఞానం, భ్రమ లేకుండటం, ఓరిమి కల్గి ఉండటం, సత్యం, ఇంద్రియ నిగ్రహం (జ్ఞానేంద్రియ, కర్మేం ద్రియ), బాహ్యేంద్రియ నిగ్రహం (కన్ను, ముక్కు, చెవి మొదలగు వానిని అణచుట), అంతరింద్రియ నిగ్రహం (కామ, క్రోధ, లోభ, మోహ, మద, మాత్సర్యాలనే లోపలి శత్రువులను జయించుట), భయం, అభయం, అహింస, సమత్వం, సంతుష్టి, తపస్సు, దానం, కీర్తి, అపకీర్తి అనే ఈ నానావిధ మనోభావాల్ని సమస్త భూతజాలానికి నే నే కల్గిస్తున్నాను.

నా మనసునుండి పుట్టిన నలుగురు మనువులు, సప్త ఋషులు, నా మనస్సంకల్పాన్ననుసరించి ఈ సృష్టిని చేశారు.

భగవంతుని మహిమను తెలుసుకోవడం కూడా ఒక 'యోగమే'



అర్జునా! ఈ చరాచరజగత్తును సృష్టించే వాణ్ణీ, నడిపించేవాణ్ణీ నేనే అని తెలిసికొన్నవాడు నిండైన భక్తిభావంతో నన్నారాధిస్తూ మనస్సును, ప్రాణాల్ని నాకే సమర్పిస్తాడు. నా భక్తులందరూ ఒకచోట చేరినపుడు నా గురించి పరస్పరం ఒకరి కొకరు చెప్పుకుంటూ కీర్తిస్తూ గొప్ప ఆనందాన్ని పొందుతూ ఉంటారు.

మచ్చిత్తా మద్గతప్రాణా బోధయంతః పరస్పరమ్ ।
కథయంతశ్చ మాం నిత్యం తుష్యంతి చ రమంతి చ ॥ 9

ఈ విధంగా దైవచింతన కలవారై ధ్యానచిత్తంతో నన్నారాధించే వారికి నేను జ్ఞానయోగాన్ని అనుగ్రహించి అనేక జన్మల నుంచి వస్తున్న అజ్ఞాన అంధకారాన్ని తొలగించేస్తున్నాను.

## అర్జును డడుగుతున్నాడు

పరం బ్రహ్మ పరంధామ పవిత్రం పరమం భవాన్ ।
పురుషం శాశ్వతం దివ్య మాదిదేవ మజం విభుమ్ ॥ 12

కృష్ణా! నీవే పరబ్రహ్మం. పరమపదం. పరమ పావనం. దేవర్షి నారదుడు, అసితుడు, దేవలుడు, వ్యాసుడు మొదలైన మహర్షులు కూడా నిన్ను పురాణ పురుషుడు, పురుషోత్తముడు, నిత్యుడు, స్వయంభువు, దేవతలకు దేవుడు, సర్వవ్యాపి అని అంటున్నారు. నువ్వు కూడా అదే చెబుతున్నావు. నీ విపుడు పలికిన మాటలన్నీ సత్యాలనే విశ్వాసం కలిగింది. నీ దివ్యస్వరూపం నీకే తెలుస్తుంది. అన్యు లెఱుగలేరు. కనుక ఓ స్వామీ! కృష్ణా! నీ విభూతి ఎటువంటిదో ఏఏ పదార్థాల్లో నీవు చక్కగా అభివ్యక్తమై ఉన్నావో తెలుపమని వినయపూర్వకంగా అడిగాడు.

## కృష్ణుడు చెబుతున్నాడు :

అర్జునా! నా విభూతు లనంతములు. నేను సమస్త ప్రాణులందు, పదార్థములందు వ్యాపించి ఉన్నాను. ఆది మధ్యాంతర రూపుణ్ణి. సృష్టి స్థితి లయకారకుణ్ణి నేనే. పన్నెండు మంది ఆదిత్యుల్లో విష్ణువని పిలువబడేవాణ్ణీ నేనే. ప్రకాశింపచేయగల కిరణములు గల సూర్యుణ్ణి, సప్తమరుత్తులలో మరీచిని నేనే. నక్షత్రాలలో చంద్రుడను. వేదాలలో సామ వేదాన్ని, దేవతల్లో ఇంద్రుడను. ఇంద్రియాల్లో మనస్సును, పర్వతాల్లో మేరువును. సేనాపతుల్లో సుబ్రహ్మణ్యుడను. మహర్షుల్లో భృగుమహర్షిని. వాక్కుల్లో ప్రణవాన్ని. గుర్రాల్లో ఉచ్చైశ్రవమును. ఏనుగులలో ఐరావతాన్ని. ఆయుధాల్లో వజ్రాయుధాన్ని. నాగులలో అనంతుడను. దైత్యుల్లో ప్రహ్లాదుడ్ని. మృగాల్లో సింహాన్ని, పక్షుల్లో గరుత్మంతుణ్ణి. విద్యలలో అధ్యాత్మ విద్యను, సమాసాల్లో ద్వంద్వాన్ని నేనే.

కాలమును నేనే. విరాట్స్వరూపం నేనే. సామవేదంలో బృహత్సామగానం నేను. ఛందస్సులలో గాయత్రీ ఛందస్సును. మాసాల్లో మార్గశీర్షం. ఋతువుల్లో వసంతం. యాదవులలో వాసుదేవుడను. పాండవులలో అర్జునుడను. మునులలో వ్యాసుడను. కవులలో శుక్రాచార్యుడను. బ్రహ్మాండ మంతటికీ ఆధారభూతుణ్ణి నేనే. నా నుండే ఈ సమస్త జగత్తు ఆవిర్భవిస్తున్నది. నేను లేకుండా ఏదీ లేదు. దివ్యమైన నా విభూతులు అన్నీ ఇన్నీ అని ఎవరూ చెప్పలేరు. వాటికి అంతులేదు. ఇపుడు నీకు తెలిపినవి కొన్ని మాత్రమే. ఒక్కమాటలో చెబుతాను విను.

యద్యద్విభూతిమత్సత్త్వం శ్రీమదూర్జిత మేవ వా ।
తత్త దేవావగచ్ఛ త్వం మమ తేజోఽంశ సంభవమ్ ॥ 41

ఏది ఐశ్వర్యయుతమో, శోభగా ఉందో, శక్తి మంతమో, కాంతివంతమైందో, అవన్నీ నా తేజస్సు యొక్క అంశములే గ్రహించు అని విభూతియోగాన్ని ముగించాడు కృష్ణపరమాత్మ.

శ్రీకృష్ణార్పణమస్తు.

# మమకారాలను తొలగించిన వామనుడు

– డా॥ అనప్పిండి
సూర్యనారాయణమూర్తి


*నారాయణం నమస్కృత్య నరం చైవ నరోత్తమమ్ ।*
*దేవీం సరస్వతీం వ్యాసం తతో జయ ముదీరయేత్ ॥*

పురాణాలను అనుసరించి శ్రీమహావిష్ణువు అవతారాల్లో మొట్టమొదటి యోనిజమైన అవతారం వామనం. అందమైన శరీరం కలవాడని, పొట్టిగా ఉండేవాడని, కుటిలత్వం కలవాడనే అర్థాలున్నాయి. శ్రీమహావిష్ణువు దేవ మాత అయిన అదితిగర్భంనుంచి పుట్టాడు. అద్భుతచేష్ట చేసినట్లుగా అందరూ చూస్తూ ఉండగానే వటువుగా అయ్యాడట. అంతేకాక సాక్షాత్తు విష్ణురూపం తోనే పుట్టాడు.

ఆరోజు శ్రవణద్వాదశిగా పిలిచే భాద్రపదశుక్ల ద్వాదశి సూర్యుడు మధ్యందినగతుడై ఉన్నాడు. అభిజిల్లగ్నంలో గ్రహాలన్నీ అనేక ఉత్తమగుణాల్ని కలిగి ఉన్నాయి. అటువంటి ద్వాదశిని విజయ అని చెపుతారు. అలా వామనుడైన వటువుగా జన్మించినస్వామికి, కశ్యపప్రజాపతిని ముందు పెట్టుకుని మహర్షులు జాతకర్మాదులను ఆచరించారు. ఆ బాలునికి నామ కరణం చెయ్యలేదు. వామనుడికి ఉపనయన కర్మని ఆచరించారు. సూర్యుడు గాయత్రీమంత్రాన్ని ఉపదేశించాడు. బృహస్పతి బ్రహ్మసూత్రాన్నిచ్చాడు. కశ్యపుడు మొలనూలు నిచ్చాడు. భూమి కృష్ణాజినాన్ని ఇచ్చింది. వనస్పతి అయిన చంద్రుడు దండాన్ని ఇచ్చాడు. తల్లి ఆచ్ఛాదనం కోసం కౌపీనాన్ని ఇచ్చింది. ఆకాశం ఛత్రాన్నిచ్చింది. బ్రహ్మ కమండలాన్ని ఇచ్చాడు. సప్త మహర్షులు దర్భలను ఇచ్చారు. సరస్వతి అక్షమాలను ఇచ్చింది. కుబేరుడు భిక్షాపాత్రను ఇచ్చాడు. సాక్షాత్తు పార్వతీదేవి భిక్షపెట్టింది. **"స బ్రహ్మ వర్చసేనైవం సభాం సంభావితో వటుః"** ఆ వటువు బ్రహ్మవర్చస్సుతో ప్రకాశిస్తున్నాడు. **"అణోరణీయాన్ మహతో మహీయాన్" "అంగుష్ఠ మాత్రః పురుషః"** ఇత్యాది శ్రుతివాక్యాలకి ప్రమాణమే ఈ వామనావతారమని చెప్పవచ్చును.

**'అవ్యక్తచిద్వ్యక్తమధారయన్హరిః'** – అవ్యక్తమైన చైతన్యమైన శ్రీహరి వ్యక్తరూపమయ్యాడు. సుదర్శనావతారంలోను, నృసింహావతారంలోను, వామనావతారంలోను, శ్రీకృష్ణావతారంలోను మాత్రమే మనకి శ్రీమహా విష్ణువు విరాడ్రూపం కనిపిస్తుంది. అలాగే విష్ణుమాయా విలాసం కూడా ఈ మూడు అవతారాల్లోనే కనిపిస్తుంది.

శ్రీహరి యోగమాయచేత దేహాన్ని ధరించాడని కశ్యపప్రజాపతికి తెలుసు. అందుకే ఆయన జయ శబ్దంతో తన కొడుకు రూపంలో ఉన్న శ్రీహరిని స్వాగతించాడు. అదితి తన గర్భసంజాతుడైన ఆ పురుషోత్తముణ్ణి చూసి ఆశ్చర్యపడింది. అదితి గర్భంలోనే పుట్టడానికి కారణం – ఎనిమిదవ మన్వంతరంలో ఇంద్రసేనుడు అనే పేరు గలిగిన సార్వభౌముడు తన బలాతిశయంచేత బలి అని ప్రసిద్ధిని పొందాడు. అతడు ప్రహ్లాదుని



మనుమడు విరోచనుడనే రాజు కొడుకు. దేవాసుర యుద్ధంలో ఇంద్రుడు బలిని ఓడించాడు. అప్పుడు శుక్రాచార్యుడు భృగువంశ సంజాతులైన బ్రాహ్మణులు అతనిచేత విశ్వజిద్యాగాన్ని మహాభిషేకాన్ని చేయించారు. ఆ యాగంలో హోమాగ్ని నుంచి బంగారురథం ఆవిర్భవించింది. ఇంద్రుని గుర్రాల్లాంటి గుర్రాలు, సింహకేతనమైన ధ్వజస్తంభం, దివ్యము లైన ధనుర్బాణాలు లభించాయి. బ్రహ్మదేవుడు శాశ్వతమైన మాలను ఇచ్చాడు. శుక్రాచార్యుడు శంఖాన్ని ఇచ్చాడు. బ్రాహ్మణుల అనుగ్రహంచేత బలి యుద్ధపరికరాల్ని పొందాడు. ఈ బలంతో బలి ఇంద్రుడి మీదికి దండెత్తి వెళ్ళాడు. బలి చేస్తున్న దండయాత్రని, వాని బలాన్ని తెలుసుకుని దేవేంద్రుడు పదవిని విడిచి పారిపోయాడు.

దేవమాత అయిన అదితి తన కుమారుల దుఃస్థితి తెలుసుకుని, తన భర్త దగ్గరికి వెళ్ళి దేవతల దురవస్థల్ని చెప్పింది. దేవతలకి మేలు చెయ్యమని వేడుకుంది. అప్పుడు కశ్యపుడు జగత్తంతా విష్ణుమాయచేత బంధితమై ఉంది. భౌతికమైన దేహాన్నే ఆత్మ అని భ్రాంతి పొంది భార్యా పుత్రవ్యామోహంలో పడి సర్వవ్యాపకమైన పరమాత్మని తెలుసుకోలేకపోతున్నారని, దీనానుకంపితులైన వాళ్ళకి విష్ణుసేవ తప్ప వేరు మార్గం లేదని చెప్పాడు. ఆయన్ని సేవించే మార్గం చెప్పమని అదితి అడిగింది.

అప్పుడు కశ్యపప్రజాపతి పయోవ్రత విధానాన్ని చెప్పి దాన్ని ఆచరించమన్నాడు. కశ్యపుడు తెలిపిన మంత్రాన్ని పఠిస్తూ స్నానంచేసి ఉపవాసముండి రాత్రి జాగరణచేసి పాడ్యమి నాటినుంచి ఫాల్గుణశుక్ల ద్వాదశివరకు పాలతో విష్ణువుని అభిషేకం చేస్తూ ఈ వ్రతాన్ని ఆచరించాలి.

భర్త చెప్పిన విధంగా అదితి పయోవ్రతాన్ని శ్రద్ధతో ఆచరించింది. అప్పుడు సాక్షాత్తు శ్రీమహావిష్ణువే ఆమె గర్భంలో ప్రవేశించాడు. తన సహజ మాయాచ్ఛాదితమైన రూపంతోనే జన్మించాడు. నర్మదానది ఉత్తరతీరంలో భృగువత్సమనే క్షేత్రంలో బలిచక్రవర్తి యజ్ఞం చేస్తున్నాడు. వామనుడు ఆ యజ్ఞానికి వెళ్ళాడు. సూర్యుడో లేక అగ్నిదేవుడో లేక సనత్కుమారుడో వస్తున్నాడని యజ్ఞవాటిలో ఉన్నవాళ్ళందరు అనుకున్నారు. వామనుడు అక్కడికి చేరగా యజమాని అయిన బలి తేజస్సు, ఋత్విక్కులైన భార్గవుల తేజస్సుకూడా తగ్గిపోయింది.

వచ్చినవాడు బ్రహ్మచారి– పదహారేళ్ళలోపు వాడు. బ్రాహ్మణ బాలుడు. భార్గవులతణ్ణి గురించి శిష్యులతో చర్చిస్తుండగా అతడు ప్రవేశించాడు. దండాన్ని, గొడుగుని, నీళ్ళు నింపిన కమండలాన్ని ధరించి ప్రవేశించాడు.

ముంజత్రాటిని మొలకు కట్టుకున్నాడు, యజ్ఞోప వీతధారుడయ్యాడు, కృష్ణాజినాన్ని ఉత్తరీయంగా వేసుకున్నాడు. అతడు సామాన్య వటువు కాడు. బలిచక్రవర్తితో పాటుగా ఋత్విక్కులు ఎదురువచ్చి స్వాగతం చెప్పారు.

బలి చేసిన ఈ యజ్ఞం వేరు వేరు పురాణాల్లో వేరు వేరు ప్రదేశాలలో జరిగినట్లు కనిపిస్తున్నది. వామనపురాణంలో కురుక్షేత్రంలోను, పద్మపురాణంలో పుష్కరతీర్థంలోను, స్కాంద పురాణంలో ప్రభాసక్షేత్రంలోను, అగ్నిపురాణంలో హరి ద్వారం లోను, శ్రీమద్భాగవతంలో నర్మదానదీతీరంలో భృగువత్సంలోను జరిగినట్లుగా కనిపిస్తున్నాయి. బలిచక్రవర్తి బ్రాహ్మణభక్తుడు, ఇప్పుడు యజ్ఞదీక్షలో ఉన్నాడు. బ్రహ్మచారి పాదాల్ని కడిగి ఆ నీళ్ళని తన నెత్తిమీద చల్లుకున్నాడు. ఆ కాళ్ళు కూడా సామాన్య మైనవి కావు. మంగళప్రదములైనవి. ఎంతో వినయంగా భక్తితో స్వాగతం పలికి తన పితృదేవతలు, తన యజ్ఞం, హోమాగ్నులు ధన్యములయ్యాయని సంతోషాన్ని తెలిపి గో, కాంచన, వస్తు, స్త్రీ, గ్రామ, రాజ్యాల్లో కావలసినది కోరుకోమన్నాడు. విష్ణువునకా మాటలు ధర్మయుక్తాలుగా, సుసూనృతాలుగా అనిపించాయి. అతడు యాచకునిగా వచ్చాడు. బలి పూర్వీకుల ఔన్నత్యాన్ని ప్రశంసించాడు. నీవు గృహస్థ ధర్మాన్ని చక్కగా నిర్వర్తిస్తున్నావని అన్నాడు.

తన పాదాలతో సమానమైన మూడడుగుల భూమిని కోరుతున్నానన్నాడు. ఆ పాదాలకొలత ఆయనకి మాత్రమే తెలుసు. బలి అజ్ఞానంలోనే ఉన్నాడు. అహంకారంతో ఉన్నాడు. ఆ వచ్చిన వటువుని అజ్ఞానిగా భావించాడు. మూఢత్వంతో అడగడం తెలియక అడుగుతున్నావని హేళన చేశాడు. తన దగ్గరికి యాచనకి వచ్చినవాడు మరివేరొకణ్ణి యాచించకూడదని చెప్పాడు. అంతా తనదే అన్నాడు.

కానీ వామనుడు ఎంతవరకు సంపాదించాలో చెప్పాడు. ఇంద్రియాలు సంతృప్తిని పొందవు. ఎంత పొందినా ఇంకా కావాలంటాయి. అసంతృప్తాలైన ఇంద్రియాలకి సప్తద్వీపాల్ని ఇచ్చినప్పటకీ సంతృప్తిని పొందవు. లభించినదానితో తృప్తిపడే వాడే సుఖాన్ని అనుభవిస్తాడు. నాకు మూడడుగుల నేల సరిపోతుందన్నాడు. బలిచక్రవర్తి మూడడుగుల నేలని దానం



లభించిన దానితో తృప్తి పడే వాడే సుఖాన్ని పొందగలడు

చెయ్యడానికి జలపాత్రని తీసుకున్నాడు. లోకంలో దానగుణాన్ని మించిన మంచిగుణం మరొకటి లేదు. దాన్ని ఆచరించడం చాలా కష్టం. అనేక ఆటంకాలు కలుగుతాయి. ముందుగా లోభం అడ్డువస్తుంది. దాన్ని అతిక్రమించాలి.

అలాగే, బలిచక్రవర్తి చేసే దానానికి శుక్రాచార్యుడు అడ్డు పెట్టాడు. వచ్చినవాడు విష్ణువే అని చెప్పాడు. అతడు చేసే దానం వలన పాలితులైన రాక్షసులకు ప్రమాదం సంభవిస్తుందన్నాడు. అతని స్థానం, ఐశ్వర్యం తేజస్సు, కీర్తి అంతా దేవేంద్రుని వశమైపోతుందని చెప్పాడు. ధనాన్ని అయిదు విధాలుగా విభజించి ఖర్చు చెయ్యాలని చెపుతూ ధర్మానికి, అర్థానికి, కామానికి, బంధువులకి, కీర్తివ్యాపించడానికి అనే అయిదు విభాగాలు చెప్పాడు.

యాచకుడు అడిగినప్పుడు ఓమ్‌- సరే అనడం అనృతం కాదన్నాడు. లేదనడమే అనృత మవుతుందని చెప్పాడు. అయితే అసత్యానికి బలి అంగీకరించలేదు. మేరుపర్వతభారాన్నైనా సహిస్తానుగాని అసత్యభారాన్ని సహించలేనని భూమి చెప్పింది. అందుచేత భూమికి తాను భారంకాకూడదన్నాడు. బ్రాహ్మణ శక్తి అతణ్ణి ప్రలోభానికి లొంగనీయలేదు. వచ్చినవాడు విష్ణువే అని గురువు చెప్పిన మాటని సంతోషంగ స్వీకరించాడు. అత డడిగిన భూమిని దానం చెయ్యాలనే దీక్ష మరింత పటిష్ఠమైంది. యజ్ఞాలచేత, క్రతువులచేత మహాపురుషులు ఆరాధించగా పొందే శ్రీమహావిష్ణువు తనకి కేవలం మూడు అడుగుల భూమి నివ్వడం ద్వారా మాత్రమే లభిస్తున్నాడని చెప్పి, ఆయన తనని రక్షించినా, శిక్షించినా బాధపడనని చెప్పాడు. నేను చావుకి భయపడను, దారిద్ర్యానికి భయపడను, దుఃఖసముద్రానికి కూడా భయపడను అని నిశ్చయబుద్ధితో చెప్పాడు.



గురువైన శుక్రాచార్యునికి కోపం వచ్చింది. నువ్వు పండితుణ్ణని అనుకుంటున్నావు. అజ్ఞానం నీలో పూర్తిగా నిండిపోయింది. గర్వం పెరిగింది. నా ఆజ్ఞని ధిక్కరించావు కాబట్టి ఐశ్వర్యం నుంచి భ్రష్టుడవుతావని శపించాడు. అయినా బలి భయపడ లేదు. దానమివ్వడానికే సిద్ధపడ్డాడు.

బలి భార్య వింధ్యావళి బంగారపు కలశంతో నీళ్ళు తెచ్చింది. ఆమె నీళ్ళని పోస్తుండగా బలి వామనుని పాదాలు కడిగాడు. ధారాపూర్వకంగా దానం చేస్తున్నాడు. తీసుకునేవాడు విష్ణువే అని తెలిసినప్పటికి ఎంతైనా ఇస్తాననే అహంకారం ఇంకా బలిలో తగ్గలేదు. వామనుడు పెరిగిపోయాడు. మొదటి అడుగు భూమిని ధారాదత్తం చేశాడు. ఆ అడుగు ప్రమాణాన్ని వామనుడు చూపించాడు. త్రిగుణాత్మకమైన పరిణామశీలమైన జగత్తునంతా తన శరీరంచేత వ్యాపించాడు. భూమి, ఆకాశం, దిక్కులు, ద్యులోకము, సముద్రాలు, సుర, నర, తిర్యక్కులు, అతని శరీరంలో ఇమిడి ఉన్నారు.

విశ్వమంతా నిండిపోయిన విరాడ్రూపాన్ని బలి దర్శించాడు. ఆయన శంఖ, చక్ర, గదా, ఖడ్గాల్ని ధరించాడు. లోకపాలకులందరూ ఆయనను స్తోత్రం చేస్తున్నారు. ఒక అడుగును భూమండలానికీ, రెండవ అడుగుతో ఊర్ధ్వలోకాలైన భువర్లోక, స్వర్లోక, మహర్లోక, జనోలోక, తపోలోక, సత్య లోకాలకి వ్యాపింప చేశాడు. రాక్షస సమూహమంతా ఇది విష్ణుమాయ తప్ప వచ్చిన యాచకుడు సాధారణ యాచకుడు కాడని, తమ సర్వస్వాన్ని దేవేంద్రునికి ఇవ్వడానికే విష్ణువీ రూపంలో వచ్చాడని ఆయుధాల్ని ధరించి త్రివిక్రమునిపైకి

యుద్ధానికి సిద్ధపడ్డారు. విష్వక్సేనాది విష్ణుసైన్యం కూడా ఆయుధాల్ని ధరించారు. బలి తమ సైన్యాన్ని నివారించాడు. తమ ప్రభువు మాటని విని రాక్షసులందరు రసాతలానికి వెళ్ళిపోయారు. గరుడుడు బలిని వారుణపాశాలతో బంధించాడు. అప్పుడా వటువు బలిని అడిగాడు. నువ్వు మూడు అడుగుల భూమిని ఇస్తానన్నావు. ఒక పాదంతో భూమ్యంతరిక్షాల్ని ఆక్రమించాను. రెండవ పాదంతో సత్యలోకపర్యంతం ఆక్రమించాను. మరి మూడవదాన్ని ఇమ్మన్నాడు.

ఇంక నీదగ్గరేమీలేదు. నీకు అసత్యదోషం తగులుతుంది. దాని ఫలితాన్ని అనుభవిస్తావని చెపుతుండగా, బలి బాధపడలేదు, సరిగదా తాను అసత్య మాడాడనే మాటని సహించ లేనన్నాడు.

అప్పుడతనిలో కొంత జ్ఞానం కలిగింది. లోకాలు, రాజ్యాలు ఏవీ తనవి కావని తెలుసుకున్నాడు. నా అహంకారం నశించిందని అంగీకరించాడు. కానీ శరీరం తనదికాదనే జ్ఞానం అతనిలో కలగలేదు. తనవే అనుకున్న భూమ్యాది ఊర్ధ్వలోకాలన్నింటినీ నేనే ఆక్రమించానని చెప్పిన వామనుని మాటలచేత మమకారాన్ని కూడా విడిచిపెట్టమని వామనుడే పరోక్షంగా చెప్పాడు. మూడవ అడుగుని తనపై ఉంచమన్నాడు.


ఆ సమయంలో మహాభక్తుడు, బలి పితామహుడైన ప్రహ్లాదుడు వచ్చి శ్రీమహావిష్ణువుని ప్రార్థించాడు. విష్ణువు ప్రసన్నుడయ్యాడు. ప్రహ్లాదుని ప్రార్థనచేత బలిని వారుణ పాశాల నుంచి విముక్తుణ్ణి చేశాడు. అంటే ఐహికమైన సంసారబంధాల నుంచి విముక్తి కలిగించాడని భావించవచ్చు. అయితే అతనిలో స్వాభిమానం, దేహాభిమానం నశించలేదు. బంధాలు, నరకం, పదచ్యుతులకు కూడా భయపడని తాను అపకీర్తికి భయపడతానని చెప్పాడు. ఇంకా కీర్తిమీద మమకారం చావలేదు. అన్నీ విష్ణువే ఆక్రమించి ఉన్నప్పుడు అతడే అంతర్యామి అని గ్రహించలేకపోయాడు. ఇంకా శిరసు తనదే అనే భ్రాంతితో ఉన్నాడు. అందుచేతనే మూడవ అడుగుని తనశిరసుపై ఉంచమన్నాడు.

అన్నీ నేనే ఇస్తాను. నా దగ్గరికి వచ్చినవాడు మరొకణ్ణి యాచించడానికి వీలులేదని చెప్పే బలి అహంకారాన్ని భూమ్యాకాశాలను ఒక పాదంతో ఆక్రమించడం ద్వారా నేను అనుకోవడం అజ్ఞానమే అని, దానినుంచి జీవుడు బయటపడాలని సూచించాడు. ఇంద్రాది సత్యలోకపర్యంతం తన ఆధీనంలోనే ఉన్నాయి. వాటినన్నింటినీ తనవే అనే మమకారాన్ని రెండవ పాదంతో పరమాత్మ ఆక్రమించాడు. సర్వవ్యాపకుడని తెలిసినప్పటికి అపకీర్తికి భయపడతాను. నా ప్రాణం పోయినా నాకు భయం లేదు. నా శిరస్సుపై మూడవపాదాన్ని ఉంచమని చెప్పి తనదేహాభిమానాన్ని విడిచిపెట్టని అజ్ఞానం నుంచి విముక్తుణ్ణి చెయ్యడమే మూడవపాదం. ఈ దృక్పథంతో వామన చరిత్రని పరిశీలిస్తే మూడడుగుల ఆంతర్యాన్ని గ్రహించవచ్చును. పరమాత్మ ముముక్షువైన వానికి మోక్షాన్ని ఇస్తాడు.

బలి ఆంతర్యాన్ని గ్రహించినవాడై సుతలానికి ఆధిపత్యాన్ని వహించమన్నాడు. అది విశ్వకర్మ నిర్మితమైనది. అక్కడ తాను స్వయంగా ద్వారపాలకునిగా ఉంటానన్నాడు. అంటే జీవుడు తానుగా ఉన్నంతవరకు పరమాత్ముడు రక్షిస్తూనే ఉంటాడని తెలుస్తున్నది. గరుడుడు నాగపాశబద్ధుణ్ణి చెయ్యడంలో ఆంతర్యంకూడ ఇదే కావచ్చును. భ్రాంతిమంతమైన శరీరాన్ని విడిచినప్పటికి నాగబంధంతో బలి ఇంకా భోగాల్ని అనుభవించాలని పరమాత్మ నిర్ణయం. జీవు దేరూపంలో ఉన్నప్పటికి పరమాత్మ అంతర్యామిగానే ఉంటాడు. ఆత్మతత్త్వజ్ఞానాన్ని పొందేవరకు ఆ జీవరక్షణభారాన్ని తాను వహిస్తాడు. అందుకే దుర్గరక్షకునిగా ఉంటానని చెప్పాడు. బలి భౌతికశరీరం భూమిపైనే ఉంటుందికానీ రసాతలంలో ఉండడం సాధ్యం కాదుకదా. అతని రసాతలదేహమనే దుర్గానికి పరమాత్మ రక్షకుడయ్యాడు. అంతేకాక ఊర్ధ్వగతిని కల్పించడానికి సావర్ణి మన్వంతరంలో ఇంద్రపదవిని పొందిన తరువాత మోక్షం లభిస్తుందని పరమాత్మ ఆదేశించాడు. ధ్రువుడు, ప్రహ్లాదుడు వంటి మహాభక్తుల వరుసలో నిలిపాడు.

పరమాత్మ ఎవణ్ణి అనుగ్రహిస్తాడో వాడి సంపదల్ని ఆయనే తీసుకుంటాడట. ఎందుకంటే సంపదలచేత వినయం నశిస్తుంది. వినయాన్ని కోల్పోయిన వ్యక్తి లోకాన్ని అవమానిస్తాడు. చివరికి పరమాత్ముని కూడా అవమానిస్తాడట.

నేను, నాది అనే భావాలు తగ్గి జ్ఞానవైరాగ్య సిద్ధ్యర్థం చేస్తున్నాను అనుకుని జ్ఞానంతో విహితములైన కర్మల్ని ఆచరిస్తూ బంధవిముక్తికి సాధనాలను అన్వేషించడమే వామనావతార కథా సారాంశము.



# తిరుమల సమయాచారములు

## (తిరుమల-తిరుపతి ఐతిహ్యమాల)

తెనుగు అనువాదకులు:
కీ.శే. డా|| ఎన్.సి.వి.నరసింహాచార్యులు,
కీ.శే. శ్రీమాన్ టి.ఏ.కృష్ణమాచార్యులు

*(గత సంచిక తరువాయి....)*

పిమ్మట ప్రభువిది విని భీతుడై ఇకమీదట గోపురము కట్టవలదని చెప్పి అసంపూర్ణముగా (బోడిగా) నిలిపి శ్రీవేంకటా చలపతికి ఇంత మాత్రపు కైంకర్యము హృదయసమ్మతమని సంతోషించెను. శేషుడియెడ అపచారపడితి మని భయపడి ఇందులకై శ్రీశేషాచలపతికి ఒక నాగాభరణము చేయించి సన్నిధిలో సమర్పించి, దీనిని ధరింపజేసి యను గ్రహింపవలెను అని వేడెను. పిదప సన్నిధి కైంకర్యపరులు దీనినెక్కడ సమ ర్పించుటయా యని సందేహించుచుండ అప్పుడు శ్రీనివాసుడు ఒక భక్తునిపై ఆవేశించి 'పూర్వకాలమున ఆదిదేవునకును వాయు దేవునకును వివాద మేర్పడినపుడు-

"ఏవం వృత్తే వివాదే తు తత్రాగా ద్ధరిరీశ్వరః,
కిమేతదితి పృష్ట్వా శేషేణోక్తో౽ తివిస్తరాత్.
ప్రాహోద్వృత్తం తదా శేషం భావికార్యం చ చింతయన్.."

(ఇట్లు వివాద మేర్పడగా పరమేశ్వరుడగు శ్రీహరి యటకు పోయెను. 'ఇది యేమి?' అని వారి నిరువురి నడిగెను. శేషుడు విస్తరించి చెప్పెను. భావికార్యమును తలపోసి శేష దుద్ధతు డనెను.)

శేషో గతమదః పశ్చాత్తస్మిన్నేవ నగోత్తమే,
వాయవ్యే స్వామిసరసో నాగతీర్థే మనోరమే.

ఉత్తరే శిఖరే పుణ్యే సాన్నిధ్యే జగతీపతేః,
తపస్తేపే మహాఘోరం దివ్యం వర్షసహస్రకమ్.

(అటు పిమ్మట మదమువీడిన శేషుడు ఆ పర్వత శ్రేష్ఠమునకై స్వామి పుష్కరిణికి వాయువ్యమూల మనోహరమగు నాగతీర్థమందు పావనమైన ఉత్తరశిఖరమున నిఖిలలోకాధీశుని సన్నిధానమున దివ్యమానమున వెయ్యేండ్లు ఘోరతప మొనర్చెను.)

అనెడు రీతిగ ఇటకువచ్చి నాగతీర్థముపై నుండి మమ్ముగురించి తపము చేయుచున్నాడు. అతనిపై మాకు ఇప్పుడు పరిపూర్ణస్నేహ మేర్పడినందున లోకమున తండ్రియైన వాడు తన పుత్త్రునిచేతులతో నెత్తి యుపలాలించునట్లు మేమును చేత ధరింతుము' అనగ పిమ్మట కైంకర్య పరులెల్లరును సంతోషించి వైకుంఠహస్తమున నాగాభరణమును సమర్పించిరి. ఆనాడు మొదలు భగవద్రామానుజాచార్యులు మంగళాశాసనము చేయునంతవరకు ఒక శ్రీహస్తముననే నాగాభరణ ముండగా పిమ్మట శ్రీరామానుజాచార్యులు రాజు గాంచిన కల చొప్పుననే దానిని తిలకించి రెండవ శ్రీహస్తమునకును ఉండవలయునని ఒకనాగాభరణము చేయించి చుట్టుకొనియుండునట్లు అంగ దముల (బాహుపురుల)తోడ ఒక్కటిగా చేర్చి సేవాసక్తులగు ఆశ్రితజనులకు మనోనయనములకు భోగ్యమగునట్లుగా సమర్పింపజేసిరి.

పుణ్యే స్వామిసరస్తీరే పశ్చిమే నృహరిం హరిమ్,
భక్త్యా పరమయా యుక్తః పూజయామాస శంకరః

(పరమభక్తియుక్తుడగు శంకరుడు పవిత్రమైన స్వామి పుష్కరిణీ పశ్చిమతీరమున నరసింహరూపుడగు విష్ణువు నారాధించెను.)

అని స్కాందపురాణమున స్వామిపుష్కరిణీ మాహాత్మ్యము నందును,

విశ్వేశ్వరుడగు నీలకంఠుడు (శివుడు) పార్వతీసమేతుడై కోనేటి గట్టున నరసింహస్వామిని శ్రద్ధతో ధ్యానించుచు కొలది కాలము వసించెను అని వామన పురాణమునందును,

"సద్భక్త నీలకంఠార్చ్య నృసింహాయ నమో నమః."

(సద్భక్తుడగు నీలకంఠునిచే అర్చింపబడు నరసింహునకు పెక్కు నమస్కారములు.)

అని వరాహపురాణమున అష్టోత్తరశత నామమునందు ఉన్న చందాన తిరుమలగిరిపై పరమశివునికై స్వామిపుష్కరిణి పశ్చిమతీరమున ఆవిర్భవించిన వేంకటాద్రిసింహమగు సుందర నరసింహస్వామి ఆదికాలమునుండియు ప్రతిదినమునను వైఖానసాగమోక్త విధానమున ఆరాధింపబడుచుండెను.

ఇట్లుండ, నడుమ నొక కాలవిశేషమున శైవజనులు వచ్చి 'తమ ఆరాధ్య దేవతయగు శివునకు ప్రత్యక్షమైన సుందర నారసింహునకు సమీపమున మేము శివుని ప్రతిష్ఠించు కొందుము' అనిరి. అప్పుడాస్థలమున వసించుచున్న శ్రీవైష్ణవులు, అర్చకులు ఎల్లరును చేరి రాజాస్థానమున కేగి 'శ్రీవైకుంఠము నందలి క్రీడాచలవే ఈ పర్వతమని వరాహ వామన మార్కండేయ బ్రహ్మాండాది పురాణములందు స్పష్టముగ చెప్పబడిన ఈ విష్ణుక్షేత్రమున శివప్రతిష్ఠ తగదని నివారింపగ ఆ శైవులును రాజశాసనముచే తొలగిపోయిరి.

పిమ్మట స్థలవాసులగు పెద్దలు, ఈ విధముగ దేవతాంతరములకు సాధకుడగు ఈ నరసింహస్వామి మునుపటివలె ప్రసిద్ధుడై ఆరాధ్యుడై యున్నయెడల, ఇది కలియుగము కావున ఒక పాపాత్మునకు పాపపు తలంపు కలిగినచో దేవతాంతర స్థలముగను కనుపించును కాబట్టియు ఈ నరసింహమూర్తి లక్ష్మీ సహితుడు కానందున ఉగ్రమూర్తి యగుటచేత ఈ దేవునకు నిత్యారాధనమును లోపింపజేసి ప్రసిద్ధికొరవగునట్లు చేసిన సమాచారమును శ్రీభగవద్రామానుజాచార్యులవారు ఆలకించిరి. మనమున చింతించి 'ఈ స్వామి పురాణప్రసిద్ధు డగుటచేత ఆళ్వారు స్తోత్రములకు పాత్రమై యుండుటచేతను ఆరాధనమున లోప మేర్పడుచో స్థలమునకే అనిష్టము సంభవించునని' తలచిరి. 'ఈ దేవునకు ప్రత్యేకాలయ ముండుటచేత గదా మునుపు అమర్యాద పొసగిన'దని నిర్ణయించిరి. వీరు వేంకటేశ్వరుని గుడియందే యుండునట్లు నిర్ణయించి స్వామికి ఈశాన్య దిగ్భాగముగ ఉగ్రవేష ముపశమించునట్లు విమానాభిముఖముగ ప్రతిష్ఠ చేయించి, నరసింహార్చన యొనర్చిన స్థలమున పరాభిభవము కలుగ నేరదను శాస్త్రమునుగూడ తలపున గొని నిత్యారాధనము జరుగులాగున కట్టడచేసిరి.

మార్కండేయ మహాముని వేంకటాచలయాత్ర చేయునపుడు తిరుమల మార్గమధ్యమున –

ఆరుహ్యం వేంకటం శైలం మధ్యేమార్గం దదర్శ హ
నరసింహగుహాస్థానం లోకవిఖ్యాతవైభవమ్.

లక్ష్మీనృసింహ ప్రహ్లాదవరదానంతవైభవ,
దాసానుదాసం దేవేశ మాం పాహి మధుసూదన.

ఇతి ప్రణమ్య శుద్ధేన స్వామిపుష్కరిణీం గతః.

(తిరుమలకొండ యెక్కి మార్గమునడుమ లోకప్రఖ్యాత వైభవముగల నృసింహగుహాస్థలమును జూచెను. 'లక్ష్మీనృసింహా ప్రహ్లాదవరదా! అపారవైభవా! మధుసూదనా! దేవదేవా! దాసానుదాసుడనగు నన్నుకాపాడుము' అనుచు ప్రణమిల్లి శిష్యుని తోడ స్వామి పుష్కరిణికి జనెను.)

అన్నట్లు మార్కండేయమహర్షికి శ్రీనృసింహస్వామి ప్రత్యక్షమయినాడని మార్కండేయపురాణమున నున్నట్లు, స్వామి యావిర్భవించిన గుహాప్రదేశమున ఒక కోవెలకట్టి శ్రీనృసింహస్వామిని శ్రీవైఖానసాగమ ప్రోక్తముగ ప్రతిష్ఠ చేయించి నిత్యపూజ జరిపించిరి.

*(ఇంకా ఉంది)*

## ఎడమచేతితో కరోనాను ఓడించవచ్చు

**బయటికి వెళ్లినప్పుడు ఏ పనైన గానీ ఎడమ చేతితో మాత్రమే చేయండి. నోట్లు తీసుకోవడం, లిఫ్ట్ డోరు తెరవడం ఇలా ఏ పనైన ఎడమ చేతితో చేస్తే పొరపాటుననైన మనం కుడిచేతితో కళ్లు, ముక్కు, ముఖం, తాకడం లాంటివి చేస్తే వైరస్ సోకే ప్రమాదం చాలా తక్కువ.**



శ్రీవైఖానసాగమ ప్రోక్తముగ ప్రతిష్ఠ చేయించిన నిత్యపూజ తిరుమల సంప్రదాయంలో ప్రముఖమైంది

# "వైదిక" విష్ణు

- శ్రీ ఎం. గంగిరెడ్డి

వ్యాకరణానుసారము "విష్ణు" శబ్దము 'విష్'లు ధాతువు నుండి వచ్చినది. అనగా వ్యాపించ బడినదని యర్థము.

**"వ్యాప్నోతి ఇతి విష్ణుః"** అనగా సర్వత్ర వ్యాపించినది విష్ణువనబడును. పరాత్పరుడు సర్వ వ్యాపకుడైనందున విష్ణువని పిలువబడు చున్నాడు. ఈ సర్వవ్యాపక భావుకత్వమువలన అన్యశక్తులకు కూడ విష్ణునామధేయము సార్థకమైనది.

సూర్యుడు తన కిరణముల ద్వారా లోక లోకాంతరముల యందు వ్యాపించి సర్వులకు



తన ప్రకాశము కలుగజేయును. అందువలన సూర్యునకు కూడ విష్ణు నామధేయము గలదు. "శతపథ బ్రాహ్మణము" నందు యజ్ఞము కూడ విష్ణువని చెప్పబడినది. "యజ్ఞో వై విష్ణుః" యజ్ఞకుండమునందు వచ్చు ఆహుతులు అగ్ని, వాయు సంసర్గమువలన వాయుమండలమునందు వ్యాపించును. ఆ యజ్ఞఫలము చాలదూరము వ్యాపించి అనేక రోగములను ఉపశమింపజేయును. ప్రజలలో స్వాస్థ్యసంచారము కలుగజేయును.

మరియు గృహయజమానుని కూడ సమృద్ధము గావించును. యజ్ఞములు అనేకములు గలవు. మరియు యజ్ఞములు చేయుట కనేక మంత్రములు గలవు. వాజపేయములో చదువబడు మంత్రములు అశ్వ మేధమునందు చదువబడవు. అశ్వమేధమునకుపయోగపడు యజ్ఞసామగ్రి సౌత్రావణి యజ్ఞమునకుపయోగపడదు. గృహస్థున కే కామితముగలదో తదనుకూలముగ యజ్ఞసామగ్రి, మంత్రపఠనం కూడ నుండవలెను. యజ్ఞసామగ్రి మరియు మంత్రములయందు శక్తిగలదు. ఈ విధముగ యజ్ఞములు అనేకవిధములుగా, యజమానుడికి మరియు ప్రజలకనేక విధములుగ లాభింపజేయును. ఈ సర్వవ్యాప్తి కారణమువలన యజ్ఞమునకు విష్ణునామధేయము గలదు.

విష్ణుః "గోపా"గా పిలువబడుచున్నది. 'గో' అను పదమునకొక యర్థము భూమి. రెండవది ఆవు(గోవు), మూడవది కిరణము లేక ఇంద్రియము. విష్ణువు పృథ్వీ పాలనముజేయును. 'పృథ్వి'కి అర్థము భూమి; అనగా బ్రహ్మాండము. పరమప్రభువైన విష్ణువు నిఖిలబ్రహ్మాండమును పాలిం చును గనుక గోపాయని పిలువబడుచున్నాడు. బృహస్పతి శబ్దార్థమునకు కూడ ఇదే విధమైనయర్థము గలదు.

"బృహ తాం- జగతాం పతి; ఇతి బృహస్పతిః" బ్రహ్మాండము నందు బ్రహ్మశబ్దార్థము బృహత్. అనగా గొప్పది. బ్రహ్మాండమును ధరించి పాలించువారిని కూడ బృహస్పతి యందురు. వాయువు విష్ణునిర్దేశనము వలననే సర్వత్ర వ్యాపించియున్నది. సూర్యచంద్రులకు కూడ ఆయనయే కాంతినిచ్చుచున్నాడు. జీవుడు ఆయన ఆజ్ఞకు శాసనబద్ధుడై వివిధ యోనులందు జననమరణములు పొందుచున్నాడు. జీవక్లేశము, కర్మ విపాకము, మరియు ఆశయములందు బద్ధుడై తన స్వాధీనతను పోగొట్టు కొని పరిభ్రమించుచున్నాడు. కాని భగవంతునకిటువంటి క్లేశకర్మాది

బంధనములు ఏమీ చేయజాలవు. ఆయన క్లేశ, వాసనలక తీతుడు. అందువలననే ఆయన సర్వధర్మములను రక్షించ గల్గు చున్నాడు. సృష్టి స్థితి లయలకు కారణము ఆయన స్వరూపములే. భక్తులను, ఆయన కాపాడుచుండును.

ఇంద్రుడు ఇంద్రియముల కధిష్ఠాతయైన జీవాత్మ. ఆయనకుపయుక్తసఖుడు విష్ణువు. సూర్యుడు నియమాను సారము ఉదయాస్తమయములు జరుగుచుండును. చంద్ర గమనము కూడ నియమానుసారము కృష్ణ శుక్ల పక్షములు క్రమముగా వచ్చుచుండును. మానవులందరు సదాచారవ్రత పరాయణులై పురుషార్థశీలురుగావలయును.

"శ్రద్ధామయోఽయం పురుషః" మానవులందరు శ్రద్ధా సక్తులతో విష్ణ్వర్చన గావించవలెను. విష్ణుపురాణమునందు దుర్వాసుని శాపమువలన ఇంద్రుడు శ్రీవైభవ వంచితుడగును. శ్రీమద్భాగవతమునందు విష్ణ్వవతారమైన శ్రీకృష్ణుడు ఇంద్రుణ్ణి జయించి పారిజాతవృక్షమును భూలోకమునకు దెచ్చును. ఇంద్రపూజకు బదులు గోవర్ధనపూజ గావించుమనెను.

"స్వర్గకామో యజేత" ప్రకారం భక్తికి స్వర్గ, మోక్షముల కంటె ఉన్నత స్థానమివ్వబడినది. భాగవతమునందు శివకేశవు లొకటే యను భావము గలదు. పద్మపురాణమునందలి భూమి ఖండము-71 యందు క్రింది శ్లోకము ఈ సత్యమును తెలియ జేయును.

*శివాయ విష్ణురూపాయ విష్ణవే శివరూపిణే ।*
*శివస్య హృదయే విష్ణోర్విష్ణోశ్చ హృదయే శివః ॥*

శ్రీవిష్ణురూపధారి శివ, శ్రీశివరూపధారియైన విష్ణువుకు నమస్కారములు. శివహృదయమున విష్ణువు, విష్ణుహృద యమున శివుడు విరాజిల్లుచున్నారు. బ్రహ్మ, విష్ణు, మహేశ్వరులే సృష్టిస్థితిలయకారకులు.

విష్ణుపురాణము 5-33-49 యందీ క్రింది విధముగా చ్పెబడినది.

*అవిద్యామోహితాత్మానః పురుషా భిన్నదర్శినః ।*
*వదంతి భేదం పశ్యంతి చావయోరంతరం హర ॥*

హే హరా! అవిద్య లేక అజ్ఞానముచేత ఆవరించ బడినవారు శివకేశవులయందు భేదభావమును తెలియజేయు దురని భావము. బ్రహ్మవైవర్తము శ్రీకృష్ణజన్మఖండము ఉత్తరా ర్ధమునందు ప్రకారం..

**చతుర్భుజోఽహం వైకుంఠే**
**శివలోకే శివః స్వయం**

శివ, విష్ణువులొకటే. వారియందు భేదము లేదని తెలియజేయుచున్నది.

అనంతకల్యాణగుణనిధియు, మహామంగళమయుడైన శ్రీవిష్ణుభగవానుని విగ్రహము నయనాభిరామ, భువనమనో హరముగా ప్రసిద్ధి చెందినది.

*సశంఖచక్రం సకిరీటకుండలం సపీతవస్త్రం సరసీరుహేక్షణమ్ ।*
*సహార వక్షః స్థల కౌస్తుభశ్రియం నమామి విష్ణుం శిరసా చతుర్భుజమ్॥*

చతుర్భుజ విష్ణు భగవానునికి శిరస్సుతో ప్రణామము చేయుచున్నాము. సశంఖచక్రధారియు, కిరీటకుండల విభూషి తుడును- పీతాంబరధరుడును, సుందరకమలలోచనుడు, వనమాలసహిత కౌస్తుభమణిధారియునైన విష్ణుభగవానునికి వందనములు.

*స్తుత్వా విష్ణుం వాసుదేవం విపాపో జాయతే నరః ।*
*విష్ణోః సంపూజనాన్నిత్యం సర్వపాపం ప్రణశ్యతి ॥*
*- స్కందపురాణము*

సర్వవ్యాపక విష్ణు భగవానుని స్తుతించిన మానవునకు ప్రతినిత్యము పూజించుటవలన సమస్త పాపములు నశించును.

*సర్వదా సర్వకార్యేషు నాస్తి తేషామమంగళమ్ ।*
*యేషాం హృదిస్థో భగవాన్ మంగళాయతనం హరిః ॥*

శ్రీహరి హృదయమునందు సమస్తమంగళములు విరా జిల్లుచుండును. ఆయనకే సమయమైనా, ఏ కార్యములందైనను శుభము కలుగును.

*నారాయణః పరో జ్యోతిరాత్మా నారాయణః పరః ।*
*నారాయణః పరం బ్రహ్మ తత్త్వం నారాయణం పరమ్ ॥*
*- నారాయణోపనిషత్ 9-8*

నారాయణుడే పరమజ్యోతిస్వరూపుడు, పరమాత్మ, పరబ్రహ్మ, పరమతత్త్వము.

*నారాయణః పరో చింత్యః సశేషామపి స ప్రభుః ।*
*బ్రహ్మస్వరూపీ భగవాననాది సర్వసంభవః ॥*
*- విష్ణుపురాణము- 414*


మనం ఇతరులకు చేసే మంచి మనకు మేలును కలిగిస్తుంది

## సకల సంపత్ప్రదం...

# అనంతపద్మనాభవ్రతం

– డా॥ ఎస్.లక్ష్మి

భూలోకంలో మానవులు దారిద్ర్యంతో కుమిలిపోతూ వుండగా, అట్టి దారిద్ర్యాన్నుండి విముక్తిని పొందవచ్చుని, సూతుడు శౌనకాది మహర్షులకు తెలియచేయుటకు ఈక్రింది వృత్తాంతాలను తెలియచేశాడు. పూర్వం ధర్మరాజు తమ్ములతో కూడి అరణ్యావాసం చేసి, అనేక కష్టాలు ఎదుర్కొన్నాడు. ఒకనాడు అతడు శ్రీకృష్ణపరమాత్మతో దేవా! మేము అరణ్యావాసం చేస్తూ దుఃఖంలో ఉన్నాం. ఈ దుఃఖం నుండి కడతేరడానికి ఉపాయాన్ని తెలుపమని కోరాడు. అందుకు గోపాలుడు ధర్మరాజా! జీవులందరి సర్వ చింతలను పోగొట్టి వారికి శాంతిని యశస్సును కలిగించే వ్రత ముంది. అది **'అనంతపద్మనాభవ్రతం'**. ఈ వ్రతాన్ని భాద్రపద శుక్లపక్ష చతుర్దశినాడు పాటించాలి. ఈ వ్రతాన్ని ఆచరించిన వారికి సుఖసౌఖ్యాలు యశస్సు సంతానప్రాప్తి కలుగుతాయని అన్నాడు.

ఇది విన్న కుంతీపుత్రుడు ఓ దేవదేవ! అనంత పద్మనాభుడు ఎవరు? శ్రీహరా? పరమేశ్వరుడా? బ్రహ్మా? అని ప్రశ్నించగా శ్రీకృష్ణుడు అనంతుడనగా నేనే! సూర్యగమనం వల్ల ఏర్పడే తిథులు, నక్షత్రాలు, పగలు, రాత్రి, ఋతువులు, మాసాలు, దినములు, అన్నీ నా స్వరూపమే. నేనే కాలస్వరూపుడను, భూభారం తగ్గించడానికి, అనంతుని పేర, దేవకీ, వసుదేవుల ఇంట జన్మించాను. నన్ను విష్ణువుగాను, కృష్ణుడుగాను, హరిహరుడు గాను, బ్రహ్మగాను, అనంతపద్మనాభుడు గాను సృష్టి స్థితి లయకారుడుగా తెలుసుకోమని వివరిస్తూ నా హృదయంలో పదునాల్గుమంది ఇంద్రులు, అష్టవసువులు, ఏకా దశ రుద్రులు, ద్వాదశాదిత్యులు, సప్తఋషులు త్రిలోకాలు ఉన్నాయి.

అప్పుడు ధర్మరాజు శ్రీకృష్ణునితో, ఈ అనంతపద్మనాభ వ్రతము ఎలా ఆచరించాలి? ఈ వ్రతఫలం ఏమిటి? ఏదైవాన్ని పూజించాలి? పూర్వం ఎవరెవరు ఈ వ్రతాన్ని ఆచరించి సుఖ పడ్డారు? అని తెలియచేయమని కోరుతాడు.

కృతయుగంలో సుమంతుడు అనే సద్బ్రాహ్మణుడు ఉండేవాడు, అతని భార్య దీక్షాదేవి, భృగుమహర్షి పుత్రిక. వారికి శీల అనే కుమార్తె కల్గింది. అయితే శీల జన్మించిన తర్వాత దీక్షాదేవి మరణించింది. సుమంతుడు వైదిక కర్మలను విధులను నిర్వహించేందుకు అర్హతను పొందడానికి, కర్కశ అనే కన్యను పునర్వివాహమాడాడు. ఆమె కఠిన హృదయురాలు, గయ్యాళి. సుమంతుని పుత్రిక శీల పెరిగి పెద్దదవుతూ జ్ఞానబుద్ధులతో దైవభక్తి పరాయణురాలై శ్రీహరిని నిష్ఠతో కొలుస్తూ ఉండేది. ఒకరోజు కౌండిన్యమహాముని దేశాటన చేస్తూ సుమంతుని గృహానికి వెళ్లాడు. అక్కడ శీలాదేవిని వివాహం చేసుకున్నాడు. కొన్నిరోజుల తర్వాత కౌండిన్యుడు భార్యా సమేతంగా స్వగృహానికి బయలు దేరాడు.

అత్తగారింటికి వెళ్లే కుమార్తెకు ఏదైనా బహుమానం ఇవ్వాలని సుమంతుడు భార్యను కోరగా ఇంట్లో ఏమీ లేదు అన్నది. విధిలేక పెండ్లికై మిగిలిన, సత్తుపిండిని మూట గట్టి కుమార్తెకు ఇచ్చి సాగనంపాడు. మార్గమధ్యంలో సంధ్యావందనం తీర్చుకోడానికి, కౌండిన్యుడు నదికి వెళ్లాడు.

ఆ రోజు అనంత పద్మనాభచతుర్దశి. ఒకచోట స్త్రీలు ఎర్రని చీరలు కట్టి పద్మనాభస్వామిని కొలుస్తూవుండగా, శీలాదేవి వారివద్దకు వెళ్లి, మీరు ఏ వ్రతాన్ని ఆచరిస్తున్నారు ఏదేవుని ప్రీతికి చేస్తున్నారు? ఏ విధంగా అచరించాలి? ఆచరించే దాని వలన కల్గే ఫలితమేమని ప్రశ్నిస్తుంది.

అప్పుడు ఆ స్త్రీలు అనంత పద్మనాభవ్రతం ఆచరిస్తే విలువ కట్టలేనంత ఫలం కల్గుతుంది. భాద్రపదశుక్ల చతుర్దశి నాడు, నదీతీరానికి వెళ్లి స్నానంచేసి, శుచితో, వస్త్రాలు ధరించి

ఒక ప్రదేశాన్ని అలికి తామరపుష్పమువంటి మండపం నిర్మించాలి, మండపాన్ని ముగ్గులతో, తోరణాలతో అలంకరించి, వేదికపై దక్షిణవైపున కలశాన్ని ప్రతిష్ఠించి, వేదిక నడుమ దర్భతో తీర్చి...


కృత్వా దర్భమయం దేవం శ్వేతద్వీపే స్థిరం హరిమ్ ।
సమన్వితం సప్తఫణైః పింగలాక్షం చతుర్భుజమ్ ॥

అనే శ్లోకాన్ని పఠించి దేవుని పూజించి ప్రదక్షిణం చేసి 14 ముళ్ళు కలిగిన, పసుపు కుంకుమలతో తడిసిన దారాన్ని స్వామి ముంగిట ఉంచి, 28 అరిసెలు స్వామికి నైవేద్యంగా పెట్టి స్వామి ముందు ఉంచిన దారాన్ని చేతికి కట్టుకొని, బ్రాహ్మణులకు దానధర్మాలు చేయాలి. తర్వాత మిగిలిన ప్రసాదాన్ని గృహస్థులు భుజించాలి అంతేకాక, వ్రతసామగ్రి పద్నాలుగు సంఖ్యలో ఉండాలి అని తెలియచేశారు.

పుణ్యస్త్రీలు చెప్పిన వ్రతవిధానాలు విన్న కౌండిన్యమహర్షి భార్య శీలాదేవి, వెంటనే నదిలోకి పోయి, స్నానం చేసి, వ్రతసూత్రాన్ని ధరించి స్త్రీల సహాయంతో వ్రతాన్ని ఆచరించింది. తండ్రి ఇచ్చిన సత్తుపిండిని బ్రాహ్మణులకు వాయనంగ సమర్పించింది. తరువాత ఆశ్రమానికి చేరుకుంది. వ్రత ప్రభావం వల్ల కౌండిన్యుని ఆశ్రమం ధన ధాన్యాలతో తులతూగింది. ఆ దంపతులు సుఖసంతోషాలతో ప్రతియేట నియమం తప్పక, అనంత పద్మనాభవ్రతాన్ని ఆచరిస్తూ ఉండేవారు.

అయితే ఒకరోజు కౌండిన్యుడు శీలాదేవి ధరించిన నోము దారాన్ని చూసి, ఇది ఎప్పుడు కట్టుకొన్నావు, ఎవరినైనా వశపరచుకోవడానికా అని భర్త దూషించాడు! స్వామి అనంత పద్మనాభ స్వామిని అర్చించినందువలన మనకు ఈ సిరిసంపద లన్నీ కల్గాయి అన్నది. అప్పుడు భర్త దుర్బుద్ధితో అనంతుడు ఎవరు అంటూ దూషించి ఆ దారాన్ని తెంచి, దూరంలో మండుతూఉన్న అగ్నిలో వేశాడు.

అంతే కొంతకాలానికి, అతని సంపద, హరించి పోయింది, ఇల్లు అగ్నికి ఆహుతి అయ్యింది. అతడు అడవుల పాలౌతాడు. స్వామి జ్ఞాపకము వచ్చి ఆ దేవుణ్ణి చూడాలని తిరుగుతూ పిందెలు, కాయలు నిండిన ఒకమామిడిచెట్టును



చూచి, దానిపై ఒక పక్షి కూడ లేకుండా పోవడంతో ఆశ్చర్యం చెందుతాడు.

ఆ చెట్టుతో ఓ వృక్షమా! అనంతపద్మనాభుని చూశావా అనగా, ఆ చెట్టు నేను చూడలేదు అన్నది. అలాగే పచ్చగడ్డిలో ఊరికే నిలుచుని ఉన్న దూడతో ఉన్న ఆవును, ఒక ఎద్దుని, పుష్కలంగా నీటితో నిండిన రెండు సరస్సులను, ఒక గాడిదను, ఏనుగును, మీరు అనంతపద్మనాభుణ్ణి చూశారా అని ప్రశ్నిస్తాడు, ఆయన ఎవరో మీకు తెలుసా? అని అడిగాడు.


అవన్నీ ఆయన ఎవరో మాకు తెలియదని అన్నాయి. కౌండిన్యుడు అలసి ఒకచోట సొమ్మసిల్లి పడిపోయాడు. దయాళువు ఐన స్వామి భక్తునిపై కృప కల్గి వృద్ధ బ్రాహ్మణుని రూపంలో వచ్చి, అతన్ని లేపి, చేయి పట్టుకుని ఒక ఆశ్రమానికి తీసుకెళ్లాడు. ఆ ఆశ్రమం నవరత్న ఖచితమై, ధన, ధాన్యాలతో దేవనర్తకిలతో కూడి ఉంది.

అక్కడ శ్రీహరి శంఖ చక్ర గదాధరియై, కౌండిన్యునికి అనంతపద్మనాభ రూపాన్ని దర్శనమిస్తాడు, కౌండిన్యుడు సంతోషంతో ఉక్కిరిబిక్కిరై శ్రీహరిని వేనోళ్ల స్తుతిస్తాడు. అనంత స్వామి తృప్తిచెంది ఓ బ్రాహ్మణోత్తమా నీభక్తికి మెచ్చాను, నీకు శాశ్వతంగా వైకుంఠప్రాప్తి కల్గిస్తున్నాను అని దీవిస్తాడు.

అప్పుడు కౌండిన్యుడు అడవిలో తాను చూచిన మామిడిచెట్టు, ఆవు, ఎద్దు, సరస్సులను, గాడిద, ఏనుగు, ఎవరు అని అడుగగా, మామిడిచెట్టు పూర్వమొక విద్యావంతుడైన బ్రాహ్మణుడు, ఎవ్వరికీ విద్యను బోధించనందువల్ల ఎవరికి ఉపయోగంలేని చెట్టుగాను, ఒక ధనవంతుడు బ్రాహ్మణులకు దానం చేయనందువల్ల, గడ్డితినడానికి నోరు రాని ఆవు గాను, చౌడు భూములను బ్రాహ్మణులకు దానమిచ్చిన రాజు వృషభంగాను, రెండు సరస్సులు ఒకటి 'ధర్మం' రెండవది 'అధర్మం' ఒక మనిషి సదా, సాటివారిని దూషించడం వలన గాడిదగా మరొకవ్యక్తి తన పూర్వీకులు చేసిన ధర్మాలను విస్మరించినందువల్ల ఏనుగుగాను ఈ రూపంలో జన్మించారని తెలియచేస్తాడు.

ఆకలితో క్రుంగి సొమ్మసిల్లిన నీకు నేను బ్రాహ్మణ రూపంలో కనబడి దారి చూపించాను అని చెప్పాడు. నీవు 14 సంవత్సరాలు అనంతపద్మనాభవ్రతాన్ని ఆచరిస్తే నీకు ఆకాశంలో నక్షత్ర స్థానాన్ని కల్పిస్తానని చెప్పి శ్రీహరి అంతర్ధాన మయ్యాడు.

కౌండిన్యుడు వరప్రభావంతో ఆశ్రమం చేరి జరిగిన విషయాన్ని భార్యతో చెప్పి 14 సంవత్సరాలు నిష్ఠతో అనంత పద్మనాభ వ్రతాన్ని ఆచరించి అంత్యకాలంలో నక్షత్రమండలాన్ని చేరాడు. శ్రీకృష్ణుడు ధర్మరాజుతో, "కౌండిన్యుడు నక్షత్ర మండలంలో కనబడుతూ ఉంటాడు. అంతేగాక అగస్త్య మహర్షి ఈ వ్రతాన్ని ఆచరించి జగత్ప్రసిద్ధుడయ్యాడు. అలాగే పూర్వం సగర, దిలీప, భరత, హరిశ్చంద్ర జనకమహా రాజులు ఈ వ్రతాన్ని ఆచరించి స్వర్గసౌఖ్యాలు పొందారని" అన్నాడు. రండి.. ఈ వ్రతాన్ని ఆచరించి స్వామివారి కృపకు పాత్రులవుదాం.



# అరిషడ్వర్గాలు

- శ్రీ "వై.వి.ఎస్."

కామ, క్రోధ, లోభ, మోహ, మద, మాత్సర్యాల నారింటిని అరిషడ్వర్గాలని అంటారు. అరి అనగా శత్రువు. షట్ అనగా ఆరు. అరిషడ్వర్గమనగా ఆర్గురు శత్రువుల సమూహం అని అర్థము.

## కామం

ఇది అరిషడ్వర్గములలో మొదటిది. దీనిని కోరిక అనే అర్థంలో గ్రహించవచ్చు. మానవుడు కోరికల వల్లే దుఃఖితుడై నాశనమౌతాడు. ఎవరైతే ధర్మార్థములను విడనాడి కామార్థ ములను అనుసరించునో అట్టివారు ఆపదలకు గురికాక తప్పదు.

*'కామాతురాణాం న భయం న లజ్జా'.*

కామంతో కళ్ళు మూసుకొని పోయినవాడికి భయం గాని, సిగ్గుగాని ఉండదు. పూర్వాపరాలు స్ఫురణకు రావు. మంచీ చెడులను ఆలోచింపడు. ఈ కామం పశుత్వాన్ని ఆపా దించి క్రూరత్వాన్ని కల్గిస్తుంది.

వానరశ్రేష్ఠుడు వాలి తమ్ముడైన సుగ్రీవుడు జీవించి యుండగనే రుమ యందు కామమోహంతో పాపాచారుడై ప్రవర్తించి, చివరకు పాపం పండి రాముడి చేతిలో హతు డయ్యాడు. గౌతమముని భార్యయైన అహల్యను కోరి కదా ఇంద్రునికి ఒడలెల్ల హీనమైనది. పతివ్రతా సాధ్వీమతల్లి సీతా దేవిని కోరికదా రావణుడు సమూలంగా సర్వనాశనమయ్యాడు. ఇలాంటి సంఘటనలు మనకావ్యాలలో, గ్రంథాలలో కోకొల్లలు. అందుకే ప్రప్రథమశత్రువైన ఈ కామాన్ని జయించినవాడే యోగ్యుడు.

## క్రోధం

ఇది అరిషడ్వర్గాలలో రెండవది. క్రోధం సర్వానర్థ హేతువు. తన కోపమె తన శత్రువు. తన శాంతమే తనకు రక్ష. ఇది వాస్తవము.

*ఉత్తమే తు క్షణం కోపో*
*మధ్యమే ఘటికా ద్వయమ్ ।*
*అధమే స్యాదహోరాత్రం*
*పాపిష్ఠే మరణాంతకః ॥*

ఉత్తములకు క్షణమే కోపం ఉంటుందనీ, మధ్యములకు ఒకటి రెండు ఘటికల కాలం కోపం ఉంటుందనీ, అధములకు ఒక రాత్రి ఒక పగలు కోపం ఉంటుందనీ, పాపిష్ఠునికి మాత్రం మరణించేదాక కోపం ఉంటుందనీ పై శ్లోకం తెల్పుతుంది.

*క్రోధాద్భవతి సమ్మోహః*
*సమ్మోహాత్స్మృతి విభ్రమః ।*
*స్మృతిభ్రంశాద్బుద్ధినాశః*
*బుద్ధినాశాత్ప్రణశ్యతి ॥*

క్రోధంవలన అవివేకం కల్గును. దానివల్ల మతి భ్రమి స్తుంది. తద్వారా బుద్ధినాశం కల్గుతుంది. తర్వాత తానే నాశనమగును అని భగవద్గీత తెల్పుతుంది కదా! అందుకే కోపం తగ్గించుకొని శాంతముతో జీవించడం ఉత్తమోత్తమము.

## లోభం

అరిషడ్వర్గాలలో మూడవదియైన లోభం కూడా చాలా చెడ్డగుణం. లోభగుణమున్నవారికి తృప్తి యుండదు, తృప్తి లేని వారి మనస్సును ఆశ ఆక్రమించుకొని, అది అత్యాశగా పరిణ మించి, అనర్థాలకు దారి తీసి, సంతృప్తిని హరించి వేస్తుంది. లోభి తాను ఎంతో కష్టించి పోగు చేసిన ధనాన్ని తాననుభవిం పక, ఇతరులకు దానం చేయక దాచిననూ అది పరుల పాలు కాక తప్పదు.

*ధనము కూడబెట్టి ధర్మంబు సేయక*
*తాను తినక లెస్స దాచుగాక!*
*తేనెటీగ గూర్చి తెరువరి కియ్యదా*
*విశ్వదాభిరామ వినురవేమ!*

తేనెటీగ తాను త్రాగక పోగు చేసిన తేనెను బాటసారుల పాలు చేస్తున్నది కదా!

లోభి తన ధనమును పేదలకు పెట్టడు. చుట్టములకు వినియోగించడు. కడకు నేలపాలు చేస్తున్నాడు.

లోభి ధనికుడైననూ దరిద్రునితో సమానమే.

## మోహం


ఇది అరిషడ్వర్గాలలో నాల్గవది. మోహమనగా వలపు యని అర్థము. ఈ మోహం పలువిధాలుగా ఉంటుంది. మోహం ఎక్కువైతే ముప్పు వాటిల్లక తప్పదు.



తన కోపమె తన శత్రువు

రావణుని చెల్లెలు శూర్పణఖ అప్రతిమాన సౌందర్యంగల రాముని గాంచగానే ఆమెలో దుష్ట భావం ప్రబలింది. మోహభావం ఆమెలో అంకురించింది. రాముని ఎదుట శృంగారచేష్టలతో మితిమీరి ప్రవర్తించింది. అంచేతనే రాముడు ఆమె నాసికా కర్ణచ్ఛేదం చేశాడు.

సీతారాములు వనవాసం చేయు సమయంలో ఒకనాడు సీతాదేవి మాయా బంగరులేడిని చూచి మోహించింది. భర్తను తెచ్చివ్వమని కోరింది. ఆ మోహమే కదా రావణుడు సీతను అపహరించుటకు ఆస్కారం కల్గించింది. కావున మోహం అనేది ప్రబలితే కీడు వాటిల్లక తప్పదు.



## మదం

అరిషడ్వర్గములో ఐదవది మదం, దీనిని ధనమదం, అధికారమదం, విద్యామదం అంటూ విభజించుకోవచ్చు. మదించినవారు వయోవృద్ధుల్ని, మేధావుల్నీ సైతం లెక్కించరు. అధికారమదం కల్గినవాడికే మాత్రం అర్హత లేకున్నా, అనుభవం లేకున్నా తన క్రిందివారిపై పెత్తనం చెలాయిస్తాడు.

విద్యాగర్వంచే విర్రవీగిన గౌఢ డిండిమభట్టు శ్రీనాథుని చేతిలో ఓడిపోయి అవమానం పొందాడు కదా!

ధనమును, విద్యయు, వంశం
బును దుర్మతులకు మదంబొనరించును, స
జ్జనులైన వారి కణకువ
యును వినయమునివియు తెచ్చునుర్వీనాథా॥
– తిక్కన భారతం

ధనం, విద్య, అధికారాలనేవి దుర్మతులకు మాత్రమే మదం కల్గించును. కాని అదే ధనం, విద్య, అధికారాలు సజ్జనులకు వినయాన్ని, వివేకాన్ని కల్గిస్తాయి. అందువల్ల మనం సజ్జనులమైతే మన జోలికి ఈ శత్రువు రాదు.

## మాత్సర్యం

అరిషడ్వర్గాలలో ఇది చిట్ట చివరిది. మాత్సర్యం అనగా మాత్సర్యం (మచ్చరం). అనగా ఈర్ష్య అని అర్థం. తన ఎదుటివారు బాగుపడుతుంటే చూడలేక, వారికి కీడు తలపెట్టడమే అసూయ, అసూయాబీజాలు మొలకెత్తాయంటే అనర్థాలు ఆగవు.

మహాభారతకథలో కురుక్షేత్రసంగ్రామానికి కారణం ఈ ఈర్ష్యయే. పాండవులు, కౌరవులు విద్యాభ్యాసం చేయు సమయంలో భీముడు తన బలంతో కౌరవులను అల్లరి పెట్టేవాడు. ఇవన్నీ భీముడు చిన్నతనం ఆటగానే చేశాడు. కాని, దుర్యోధనుని గుండెల్లో ఈర్ష్యాద్వేషాలకు అంకురార్పణ జరిగింది.

అర్జునుడు సకల విద్యాపారంగతుడై, రాజ్యం నలు దిక్కులా విజయయాత్ర సాగించాడు. ఇదంతా వింటున్న ధృతరాష్ట్రుడికి "తన కొడుకులకేమీ లేకుండా పోతుందే" అని బెంగపట్టుకుంది. అందుకే పాండవులపై అసూయచేత దుర్యోధనుడు ఎన్ని తప్పులు చేసినా, పాండవులను చంపుటకు ప్రయత్నించినా, వారిని మాయాజూదంలో ఓడించి అరణ్య అజ్ఞాతవాసాలకు పంపించినా, రాజ్యభాగం ఇవ్వకపోయినా ధృతరాష్ట్రుడు తన కుమారుని దుష్ప్రవర్తనకు అడ్డు చెప్పలేదు. ఇన్ని చేసినా కడకు ఆ దైవకృపవల్ల కురుక్షేత్రసంగ్రామంలో పాండవులకు విజయం చేకూరింది. కౌరవులు ఈర్ష్యాద్వేషాలచే సర్వనాశనమయ్యారు. కనుకనే ఈర్ష్యాద్వేషాలు విడనాడి సఖ్యతతో మెలగాలి.

మనిషి తన జీవనకాలంలో కామ, క్రోధ, లోభ, మోహ, మద, మాత్సర్యాలనే అరిషడ్వర్గాలకి బద్ధుడైతే సప్తవ్యసనాలకి దాసుడై లోకంలోని అల్పసుఖాలకోసం స్వార్థం పెరిగి అధర్మవర్తనుడౌతాడు. అందుకే అరిషడ్వర్గాలను జయించి, భగవంతుని సేవిస్తే స్వార్థపరత్వంనుండి విముక్తుడై తద్వారా మోక్షాన్ని పొందగలడు.

# కుజుడు (అంగారకుడు)



కుజుడు ఉగ్రస్వభావుడు. అధిపతి కుమారస్వామి. పురుషగ్రహం, రుచి చేదు, జాతి క్షత్రియ, అధిదేవత పృథ్వి, దిక్కు దక్షిణం, తత్త్వం అగ్ని, ప్రకృతి పిత్తము, ఋతువు గ్రీష్మం, లోహములలో ఇనుము, ఉక్కు, రత్నము, పగడము, గ్రహ సంఖ్య ఆరు, భావరీత్యా దశమస్థానంలో స్థానబలం కలిగి ఉంటాడు. గుణం తమో గుణం, ప్రదేశం కృష్ణానది మొదలు లంక వరకు. కుజుడు మృగశిర, చిత్త, ధనిష్ఠనక్షత్రాలకు అధిపతి. శరీరావయవాలలో.. ఎముకలలో– మజ్జ, కండరాలు; బాహ్యంలో– జ్ఞానేంద్రియాలు. అంగారకునికి సూర్యుడు, చంద్రుడు, గురువు మిత్రులు, శత్రువు బుధుడు, సములు శుక్రుడు, శని.

### కుజుని ప్రభావం

కుజ ప్రభావితులు పొడుగుగా దృఢంగా ఉంటారు. అదుపు చేయలేని ఆవేశపరులు. విపరీత బంధుప్రీతి కలిగి ఉంటారు. అధికారం, పదవి, సేవకులను కలిగి ఉంటారు. యంత్రములు, ఆయుధములు మొదలైన వాటిలో శిక్షణ పొందుటలో ఆసక్తులు. అధిక దానధర్మములు కలిగి ఉంటారు.

### కుజుని రూపురేఖలు

కుజుడు ఎర్రని మేని ఛాయ కలవాడు. సన్నని నడుము, కండలు తిరిగిన శరీరం, వంకీల జుట్టు కలవాడు. వయసు పదహారు. ఎర్రని వస్త్రధారణ, శంఖం వంటి మెడ, వాహనం పొట్టేలు, ఆయుధం గద, మంగళప్రదమైన రూపము. కుజుని పుట్టుక గురించి హిందూ పురాణాల్లో మూడు కథలు వాడుకలో ఉన్నాయి.

01) భూదేవికి విష్ణుమూర్తికి పుట్టిన కొడుకే కుజుడని బ్రహ్మ వైవర్త పురాణం చెబుతుంది.




02) ఒకసారి, నేల మీద పడ్డ విష్ణువు చెమట బొట్టు నుండి ఒక పురుషుడు పుట్టాడు. అతను తపస్సు చేసి బ్రహ్మను మెప్పించి ఒక గ్రహంగా మారాడు. ఆ గ్రహమే 'కుజ గ్రహం' అని పద్మపురాణం చెబుతుంది.

03) దాక్షాయణి దూరమై ఎడబాటులో ఉన్న శివుడి శరీరంలోంచి రాలిన ఓ చెమట బొట్టు నుండి ఒక పురుషుడు పుడితే, భూదేవి అతన్ని తన సొంత కొడుకుగా చేర దీసిందనీ, అతనే కుజుడని మరోకథ కూడా నానుడిలో ఉంది.

### కుజ గ్రహస్తోత్రం

**ధరణీగర్భ సంభూతం, విద్యుత్కాంచన సన్నిభం ।**
**కుమారం శక్తి హస్తం తం మంగళం ప్రణమామ్యహం ॥**



# ధన్వంతరి ధ్యానం

అచ్యుతానంత గోవింద,
విష్ణో నారాయణామృత ।
రోగాన్మే నాశయాశేషాన్,
ఆశు ధన్వన్తరే హరే ॥ 1

ఆరోగ్యం దీర్ఘమాయుష్యం,
బలం తేజో ధియం శ్రియమ్ ।
స్వభక్తేభ్యః అనుగృహ్ణన్తం,
వందే ధన్వన్తరిం హరిమ్ ॥ 2

ధన్వన్తరేరిమం శ్లోకం,
భక్త్యా నిత్యం పఠన్తి యే ।
అనారోగ్యం న తేషాం స్యాత్,
సుఖం జీవన్తి తే చిరమ్ ॥ 3

ఓం, నమో భగవతే వాసుదేవాయ,
ధన్వంతరయే, అమృతకలశహస్తాయ,
వజ్రజలౌకహస్తాయ,
సర్వామయవినాశనాయ,
త్రైలోక్యనాథాయ మహావిష్ణవే స్వాహా ॥

ఓం, వాసుదేవాయ విద్మహే,
సుధాహస్తాయ ధీమహి!!
తన్నో ధన్వన్తరిః ప్రచోదయాత్ ।

# శ్రీవరాహాష్టోత్తరశతనామావళిః

ఓం శ్రీవరాహాయ నమః
ఓం మహీనాథాయ నమః
ఓం పూర్ణానన్దాయ నమః
ఓం జగత్పతయే నమః
ఓం నిర్గుణాయ నమః
ఓం నిష్కలాయ నమః
ఓం అనన్తాయ నమః
ఓం దణ్డకాన్తకృతే నమః
ఓం అవ్యయాయ నమః
ఓం హిరణ్యాక్షాన్తకృతే నమః 10

ఓం దేవాయ నమః
ఓం పూర్ణషాడ్గుణ్యవిగ్రహాయ నమః
ఓం లయోదధివిహారిణే నమః
ఓం సర్వప్రాణిహితేరతాయ నమః
ఓం అనన్తరూపాయ నమః
ఓం అనన్తశ్రియే నమః
ఓం జితమన్యవే నమః
ఓం భయాపహాయ నమః
ఓం వేదాన్తవేద్యాయ నమః
ఓం వేదినే నమః 20

ఓం వేదగర్భాయ నమః
ఓం సనాతనాయ నమః
ఓం సహస్రాక్షాయ నమః
ఓం పుణ్యగన్ధాయ నమః
ఓం కల్పకృతే నమః
ఓం క్షితిభృతే నమః
ఓం హరయే నమః
ఓం పద్మనాభాయ నమః
ఓం సురాధ్యక్షాయ నమః
ఓం హేమాంగాయ నమః 30

ఓం దక్షిణాముఖాయ నమః
ఓం మహాకోలాయ నమః
ఓం మహాబాహవే నమః
ఓం సర్వదేవనమస్కృతాయ నమః
ఓం హృషీకేశాయ నమః
ఓం ప్రసన్నాత్మనే నమః
ఓం సర్వభక్తభయాపహాయ నమః
ఓం యజ్ఞభృతే నమః
ఓం యజ్ఞకృతే నమః
ఓం సాక్షిణే నమః 40

ఓం యజ్ఞాయ నమః
ఓం యజ్ఞవాహనాయ నమః
ఓం హవ్యభుజే నమః
ఓం హవ్యదేవాయ నమః
ఓం సదావ్యక్తాయ నమః
ఓం కృపాకరాయ నమః
ఓం దేవభూమిగురవే నమః
ఓం కాన్తాయ నమః
ఓం ధర్మగుహ్యాయ నమః
ఓం వృషాకపయే నమః 50

ఓం స్రవత్తుణ్డాయ నమః
ఓం వక్రదంష్ట్రాయ నమః
ఓం నీలకేశాయ నమః
ఓం మహాబలాయ నమః
ఓం పూతాత్మనే నమః
ఓం వేదనేత్రే నమః
ఓం వేదహర్తృశిరోహరాయ నమః
ఓం వేదాన్తవిదే నమః
ఓం వేదగుహ్యాయ నమః
ఓం సర్వవేదప్రవర్తకాయ నమః 60

ఓం గభీరాక్షాయ నమః
ఓం త్రిధామ్నే నమః
ఓం గభీరాత్మనే నమః
ఓం అమరేశ్వరాయ నమః
ఓం ఆనన్దవనగాయ నమః
ఓం దివ్యాయ నమః
ఓం బ్రహ్మనాసాసముద్భవాయ నమః
ఓం సిన్ధుతీరనివాసినే నమః
ఓం క్షేమకృతే నమః
ఓం సాత్త్వతాం పతయే నమః 70

ఓం ఇన్ద్రత్రాత్రే నమః
ఓం జగత్త్రాత్రే నమః
ఓం ఇంద్రదోర్దండగర్వఘ్నే నమః
ఓం భక్తవశ్యాయ నమః
ఓం సదోద్యుక్తాయ నమః
ఓం నిజానన్దాయ నమః
ఓం రమాపతయే నమః
ఓం శ్రుతిప్రియాయ నమః
ఓం శుభాంగాయ నమః
ఓం పుణ్యశ్రవణకీర్తనాయ నమః 80

ఓం సత్యకృతే నమః
ఓం సత్యసంకల్పాయ నమః
ఓం సత్యవాచే నమః
ఓం సత్యవిక్రమాయ నమః
ఓం సత్యేనిగూఢాయ నమః
ఓం సత్యాత్మనే నమః
ఓం కాలాతీతాయ నమః
ఓం గుణాధికాయ నమః
ఓం పరస్మై జ్యోతిషే నమః
ఓం పరస్మై ధామ్నే నమః 90

ఓం పరమపురుషాయ నమః
ఓం పరాయ నమః
ఓం కల్యాణకృతే నమః
ఓం కవయే నమః
ఓం కర్త్రే నమః
ఓం కర్మసాక్షిణే నమః
ఓం జితేన్ద్రియాయ నమః
ఓం కర్మకృతే నమః
ఓం కర్మకాణ్డస్య సమ్ప్రదాయప్రవర్తకాయ నమః
ఓం సర్వాన్తకాయ నమః 100

ఓం సర్వగాయ నమః
ఓం సర్వార్థాయ నమః
ఓం సర్వభక్షకాయ నమః
ఓం సర్వలోకపతయే నమః
ఓం శ్రీమతే శ్రీముష్ణేశాయ నమః
ఓం శుభేక్షణాయ నమః
ఓం సర్వదేవప్రియాయ నమః
ఓం సాక్షిణే నమః 108

॥ ఇతి శ్రీవరాహాష్టోత్తరశతనామావళిః ॥







22 ఆగష్టు, 2021న తిరుపతి శ్రీగోవిందరాజస్వామివారి ఆలయంలో ఆధునీకరించిన ఐనామహల్ (అద్దాల మహల్) ను
తిరుమల శ్రీశ్రీశ్రీ పెద్దజీయరుస్వామి, తి.తి.దే. కార్యనిర్వహణాధికారి డా॥ కే.యస్. జవహర్ రెడ్డి, ఐ.ఏ.ఎస్., గారలు ప్రారంభించిన దృశ్యం.
సంయుక్త కార్యనిర్వహణాధికారిణి శ్రీమతి సదా భార్గవి, ఐ.ఏ.ఎస్., గారు,
ఆర్థిక సలహాదారుడు & ముఖ్యగణాంకాధికారి శ్రీ బాలాజీ మరియు ఇతర అధికారులు పాల్గొన్న దృశ్యం.





20 ఆగష్టు, 2021న తిరుమల శ్రీవారి ఆలయంలో జరిగిన పవిత్రోత్సవాల ముగింపు సందర్భంగా పూర్ణాహుతిలో పాల్గొన్న
తి.తి.దే. కార్యనిర్వహణాధికారి డా॥ కే.యస్. జవహర్ రెడ్డి, ఐ.ఏ.ఎస్., గారు,
అదనపు కార్యనిర్వహణాధికారి శ్రీ ఏ.వి.ధర్మారెడ్డి, ఐ.డి.ఈ.ఎస్., దంపతులు మరియు ఇతర అధికారులు



30 ఆగష్టు, 2021న తిరుపతి శ్రీవేంకటేశ్వరగోశాలలో
స్వామివారి 'నిర్మాల్యం'తో తయారయ్యే
అగరబత్తుల తయారీని పరిశీలిస్తున్న
తి.తి.దే. కార్యనిర్వహణాధికారి
డా॥ కే.యస్. జవహర్ రెడ్డి, ఐ.ఏ.ఎస్., గారు



30 ఆగష్టు, 2021 శ్రీకృష్ణాష్టమి పర్వదినాన్ని పురస్కరించుకుని
శ్రీవారికి 'నవనీత సేవ'లో పెరుగు నుంచి వెన్నతీస్తున్న
తి.తి.దే. కార్యనిర్వహణాధికారి డా॥ కే.యస్. జవహర్ రెడ్డి, ఐ.ఏ.ఎస్., గారు.
ఈ కార్యక్రమాన్ని తిలకిస్తున్న తి.తి.దే. అధ్యక్షులు శ్రీ వై.వి.సుబ్బారెడ్డి గారు
మరియు ఇతర అధికారులు.

మన దేవాలయాలు

గత సంచిక తరువాయి భాగం....

## సంగీతాన్ని వినిపించే రాతి శిల్పం

ప్రధాన ఆలయానికి కుడి ప్రక్కన ఉన్న ఈ శిల్పం చాలా ప్రత్యేకమైనది. బయటకు చూడటానికి రాతిలో ఎటువంటి బోలుదనం ఉన్నట్లు అనిపించదు. ఒక స్త్రీ అరటిచెట్టుని తన ఎడమ చేతితో వంచి పట్టుకున్నట్లు ఈ శిల్పం ఉంటుంది. మొత్తం శిల్పాన్ని ఏకశిల (ఒకే రాయి)ని చెక్కారు. చేతివేళ్ళతో తట్టినట్లు తాకితే ఆ రాతి నుంచి సంగీత స్వరాలవంటి శబ్దం మనకు స్పష్టంగా వినిపిస్తుంది.తాకితే సప్తస్వరాలు పలికే రాతి చెట్టును శిల్పించడం శిల్పి అనన్య సామాన్య ప్రతిభకు తార్కాణం.

## రంగమండపం

రామప్ప ఆలయంలో మధ్య భాగంలో ఉండే రంగమంటపం ఆలయానికే ప్రత్యేక ఆకర్షణ. దీన్నే నాట్య మంటపం అని కూడా అంటారు. ఈ వేదికపైన ఆనాడు కాకతీయ సామ్రాజ్యంలో పేరొందిన మాచల్దేవిలాంటి నాట్యకత్తెలు నృత్యం చేసేవారు. రంగమంటపంలో జరిగే నాట్యం, ఇతర సాంస్కృతిక కార్యక్రమాలను తిలకించేందుకు వీలుగా కూర్చునేందుకు మంటపం మూడు పక్కలా అరుగులున్నాయి. ఇది కూడా కాకతీయ వాస్తుప్రత్యేకత. రంగమంటపం నైరుతిస్తంభానికి చెక్కిన పాలసముద్ర మథనం, వాయవ్యస్తంభానికి చెక్కిన గోపికలు, కృష్ణుల శిల్పాలు నాలుగు అంగుళాల ఎత్తులోనే చెక్కబడి శిల్పుల నైపుణ్యతను తెలుపుతాయి. నైరుతి, ఈశాన్య స్తంభాల శిల్పాల మధ్య సూది మాత్రమే దూరేటంత సన్నని రంధ్రాలను తొలవడం శిల్పి నైపుణ్యానికి ప్రతీక. మంటపం కప్పులో పది చేతులతో నర్తిస్తున్న నటరాజ శిల్పం అత్యద్భుతంగా చెక్కబడింది.

## కుడ్య శిల్పాలు

దేవతామూర్తుల శిల్పాలు దేవాలయ అంతర్భాగాల్లో ఉండగా, ఆలయానికి సపోర్టుగా నిలిపిన ఊత శిల్పాలు దేవాలయం చుట్టూ గోడలు, స్తంభాల పైనున్న చూరుని ఎత్తి పట్టుకున్నట్లుగా ఉన్నాయి. ఇలాంటివి ఆలయ మూడు ప్రవేశ ద్వారాలకు రెండు వైపులా రెండేసి ద్వారానికి నాలుగు చొప్పున మొత్తం పన్నెండు నిలువెత్తు శిల్పాలున్నాయి. నృత్య భంగిమల్లో ఉన్న ఈ స్త్రీ శిల్పాలను మదనికలు, సాలభంజికలు, నర్తకీమణులు తదితర పేర్లతో పిలుస్తున్నారు. కాకతీయ శిల్పరీతికే ఇవి తలమానికాలు.

# యునెస్కో గుర్తింపు పొందిన... రామప్ప దేవాలయం

- శ్రీ అరవింద్ ఆర్య



## నంది మండపం



రామప్ప ఆలయంలోని నంది కాకతీయ శైలికే తలమానికంగా పేరొందింది. ప్రధానాలయానికి ఎదురుగా, ఆలయ తూర్పుముఖద్వారం ఎదురుగా ఎత్తైన నంది మంటపంలో మెడపట్టెలు, చిరుగంటలు మొదలు అందమైన ఆహార్యం, బలిష్ఠ శరీర సౌష్టవంతో ఉన్న నందీశ్వరుని చూడటానికి రెండుకళ్లు చాలవు.

ఇదే నందికి మరో ప్రత్యేకత కూడా ఉంది. ఒక కాలు కొంచెంపైకి ఎత్తి పట్టు కొని, చెవులు రిక్కించి యజమాని అయిన శివుడు ఎప్పుడు ఆజ్ఞాపిస్తాడా? అన్నట్లు ఎదురు చూస్తున్నట్లు ఉంటుంది. అలాగే ముందు నుంచి ఏ దిశనుంచి చూసినా నంది మన వైపే చూస్తున్నట్లుంటుంది.

## ప్రదక్షిణా పథం

ఆలయానికి చుట్టూ విశాలమైన ప్రదక్షిణపథం ఉంది. దానిమీద నడుస్తూ ఉంటే ఆలయం వెలుపల చెక్కిన ఎన్నో కుడ్యశిల్పాలు కన్పిస్తాయి. వాటిలో- శృంగార శిల్పాలు, క్రీడా వినోదాలు, వాద్యకారులు, మల్లయుద్ధాలు, భైరవమూర్తులు, తదితర అంశాలను వ్యక్తపరిచే జానపద శిల్పాలు, మహిషాసుర మర్దిని, వీరభద్రుడు, సప్తమాతృకలు వంటి శిల్పాలు కూడా ఆలయ ప్రాంగణంలో ఉన్నాయి.

## కామేశ్వరాలయం

రామప్ప దేవాలయానికి నైరుతి దిక్కులో నిర్మితమైన కామేశ్వరాలయం చిన్న ఉపపీఠం, సాదాగోడలు, దానిపై చిన్న కపోతం, వ్యాళ వర్గాలున్నాయి. ముందుభాగంలో అటూ ఇటూ రెండు కక్షాసనాలుండటం గమనించదగ్గ విషయం. ద్వార బంధాలు కాకతీయ శిల్ప వైశిష్ట్యాన్ని తెలియజేస్తున్నాయి.

## సాలభంజికలు

ప్రతి ద్వారానికి నాలుగు చొప్పున మొత్తం మూడు వైపులా ఉన్న ద్వారాలకు మొత్తం పన్నెండు సాలభంజికలు ఉన్నాయి.

## ప్రాకారం

రామలింగేశ్వర, కామేశ్వర, కాటేశ్వర ఆలయాలను అపురూప శిల్పసౌందర్యంతో కట్టించిన రుద్రుడు వాటి భద్రతను గురించి కూడా ఆలోచించాడు. ఆలయాల భద్రతతో పాటు పచ్చటి పరిసరాలనడుమ అందం ఇనుమడించేటట్లు చుట్టూ ఎత్తైన విశాలమైన ప్రాకారాన్ని నిర్మించాడు. తూర్పు, పడమర, దక్షిణ దిక్కుల్లో ప్రవేశద్వారాలను కల్పించాడు. ప్రాకారం దృఢంగా ఉండటానికి రెండు వరుసలతో గోడకట్టి, ఆ వరుసల మధ్య మట్టితో నింపి, పైన కప్పునూ, దానిపై అందం కోసం కలశాలను శిల్పకళాకృతులను నిర్మించాడు.




## యునెస్కో వారసత్వ సంపదగా గుర్తింపు..

తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావం తరువాత రామప్ప ఆలయానికి ప్రపంచ వ్యాప్త గుర్తింపును తీసుకురావడానికి తెలంగాణ ప్రభుత్వం నడుంకట్టింది. రామప్పను వారసత్వ సంపదగా గుర్తించాలని కోరుతూ తెలంగాణ ప్రభుత్వం చేసిన విజ్ఞప్తి మేరకు భారత ప్రభుత్వం యునైటెడ్ నేషన్స్ ఎడ్యుకేషనల్ అండ్ సైంటిఫిక్ కల్చరల్ ఆర్గనైజేషన్ (యునెస్కో)కు దరఖాస్తు చేసింది. రామప్ప ఆలయ నిర్మాణం ప్రపంచస్థాయిలో ఎలా ప్రత్యేకతను సంతరించుకుందో వివరిస్తూ నివేదిక పంపారు. అనంతరం యునెస్కో అనుబంధ సంస్థ ఇంటర్నేషనల్ కౌన్సిల్ ఆన్ మాన్యు మెంట్ అండ్ సైట్స్ (ఐకోమాస్) ప్రతినిధిగా వాసుపోశానందన్ 2019 సెప్టెంబరు 25న సందర్శించారు. దేవాలయాన్ని అణువణువు పరిశీలించారు. రమణీయమైన శిల్పకళతో అలరారే రామప్పదేవాలయానికి ప్రపంచ వారసత్వ హోదా రావడానికి కావాల్సిన అన్ని అర్హతలున్నాయని కితాబిచ్చారు. 2020 జులైలో యునెస్కో హెరిటేజ్ ప్రతినిధులు సమావేశం కావాల్సి ఉండగా కరోనా కారణంగా వాయిదాపడింది. ఈసారి 2020, 21 రెండు సంవత్సరాలకు ఒకేసారి గుర్తింపు ఇచ్చేందుకు ఈ నెల 16 నుంచి 26 వరకు ఓటింగ్ నిర్వహించింది. ఈ సమావేశంలో రామప్ప దేవాలయానికి ప్రపంచ వారసత్వ కట్టడంగా ప్రకటిస్తూ యునెస్కో ప్రకటన విడుదల చేసింది. తెలుగు రాష్ట్రాల్లో ప్రపంచ వారసత్వ హోదా దక్కించుకున్న ఏకైక కట్టడంగా రామప్ప చరిత్ర సృష్టించింది.

అపురూపమే కాక ఎంతో అరుదైన రామప్ప దేవాలయం మధ్యయుగపు రాజవంశ ఠీవిని, అప్పటి వాస్తు శిల్ప వైవిధ్యాన్నీ, నాటి శిల్పుల హస్తకళా నైపుణ్యాన్ని ఆవిష్కరిస్తూ, ప్రపంచ వారసత్వ కట్టడాల జాబితాలో రామప్ప చేరింది. ఎన్నో ఏళ్ళు కష్టపడి ఇంతటి రమణీయ శిల్ప కళాకేంద్రాన్ని మనకందించిన ఆనాటి శిల్పుల ప్రతిభకు తగిన గుర్తింపు వచ్చింది. వారి కళాసృష్టి ఖ్యాతి ఖండాతరాలు దాటింది.









గృహలక్ష్మి

# లోకహితైషిణి-సత్యవతి

- ఆచార్య కోలవెన్ను మలయవాసిని

*సా తు సత్యవతీ పుణ్యా సత్యే ధర్మే ప్రతిష్ఠితా ।*
*పతివ్రతా మహాభాగా కౌశికీ సరితాం వరా ॥*

*బాలకాండ - 34-11*

విశ్వామిత్రుడు రామలక్ష్మణులను తోడు తెచ్చుకుని తాను చేయదలచిన యజ్ఞాన్ని సర్వతోభద్రంగా పూర్తి చేశాడు. ఆ తరువాత ప్రయాణంలో విశ్వామిత్రుడు రామలక్ష్మణులకు కుశనాభుడు అనే రాజు కథ చెబుతాడు.

కుశనాభుడుకి నూరుగురు కుమార్తెలు. వీరి వివాహాలు జరిగిపోయాక- పుత్రసంతానం లేదే అనే చింతలో పుత్రప్రద మైన పుత్రకామేష్టిని శ్రద్ధతో నిర్వ హించాడు.


తన కొడుకు శ్రద్ధాభక్తు లతో చేస్తున్న యజ్ఞాన్ని చూసిన కుశుడు, నాయనా! ధార్మికుడవైన నీకు- తగినట్లుగా ధార్మికుడైన వాడు పుత్రుడుగా పుడతాడు. అతడి పేరు గాధి అతనివల్ల నీకు శాశ్వతమైన కీర్తి కలుగుతుంది అని చెప్పాడు. ఆదరంగా తన కుమారుణ్ణి మనసారా ఆశీర్వ దించి ఆకాశమార్గాన బ్రహ్మ లోకానికి వెళ్ళిపోయాడు కుశుడు.

ఆశీర్వచనఫలంగా గాధి కుశనాభుడి కొడుకుగా పుట్టాడు. రామా! పరమధార్మికుడైన ఆ గాధి మహారాజే మా తండ్రి. గాధి కొడుకును కనుక నన్ను గాధేయు డంటారు. కుశికవంశంలో పుట్టాను కనుక కౌశికుడని కూడా వ్యవహరిస్తారు.

మరి అసలు విషయం ఏమిటంటే నాకు ఒక అక్కయ్య ఉండేది. ఆమె పేరు సత్యవతి. నన్ను ఎంతో ప్రేమగా లాలించేది. ఎన్నో విషయాలు వివరించి చెప్పేది. పరోపకార పరాయణమే జీవితలక్ష్యంగా పెట్టుకుంది ఆమె. మా అక్క అంటే నాకు ఎంతో ఇష్టం. ఆమె గుణశీలాలు నన్ను ప్రభావి తుణ్ణి చేశాయి.

ఆమె నిత్యవ్రతపరాయణ. ఋచీకుడు అనే మహర్షిని వివాహమాడింది. భర్తను అన్ని విధాలా అనుసరిస్తూ సశరీరంగా స్వర్గానికి వెళ్ళింది. కానీ ఆమెకు స్వర్గంలో ఉండాలనిపించలేదు. భూలోకంలో ఏదైనా సర్వోపయోగమైన పని చెయ్యాలని ఆలో చించింది. మానవులకు ఐహికమూ, ఆముష్మికమూ అయిన లాభాలను ధర్మాలనూ చేకూర్చడానికి వీలుగా పరమోదారమైన ప్రవృత్తి గలిగిన మా అక్క దివ్యమూ, రమ్యమూ అయిన పుణ్యో దకంగా మారి హిమాలయ పర్వతాన్ని ఆశ్రయించి మహానదిగా అవతరించింది.

ఆమె కౌశికీనది అను పేర ప్రఖ్యాతి గాంచింది. స్వర్గాన్ని కాదని మానవసేవకోసం ఆమె మళ్ళీ భూలోకానికి



నదీరూపంగా తరలివచ్చింది. ఆమె మీద గల స్నేహంతో గౌరవంతో నేను కూడా మా అక్క ప్రక్కనే ఆశ్రమం కట్టుకుని కౌశికీ నది వొడ్డున ఆనందంగా హాయిగా ఉంటున్నాను.

మా అక్క సత్యవతి ఎంతో పుణ్యవంతురాలు. లోకానికి జీవనాన్ని అంటే జలాలు అందించడానికి నదిగా మారి పోయింది. సత్యము, ధర్మములు ప్రతిష్ఠించిన ఇల్లాలు. పతివ్రత, మహా భాగ్యురాలు. "కౌశికీ సరితాం వరా!" అనిపించుకుంది. నదులలో కౌశికి శ్రేష్ఠమైనది అని పేరుపడింది. ఇదుగో ఇప్పుడు యజ్ఞం చేయడానికి మా అక్కను వదిలి నదీతీరాన్ని వదిలి సిద్ధా శ్రమానికి వచ్చాను.

అక్కడ యజ్ఞం చేశాను. నీ పరాక్రమంవల్ల యజ్ఞం నిర్విఘ్నంగా సాగిపోయింది. సిద్ధి పొందాను. మా అక్కను వదిలి వచ్చి చాలా కాలమయింది. లోకానికి రాక్షసులవల్ల బెడద లేకుండా చేయాలనే ఆలోచన మా అక్క ఆలోచనలలోదే. ఆమె నడవడిక చూశాక పరోపకారం చెయ్యడం మానవుడికి జీవలక్షణం కావాలనిపించింది.

రామా! మా అక్కవల్ల నేను ఎంతగానో ప్రభావితుణ్ణ య్యాను. ఏవేవో విషయాలు చెబుతూ చెబుతూ నా కథలోకి, మా అక్క కథలోకి వచ్చేశాను. నా వంశచరిత్ర, నా చరిత్ర కూడా కొంత చెప్పాను. మన కథలతో చాలా రాత్రయింది అన్నాడు. ఇక నిద్రపో! నీకు శుభం కలగాలి. మనకు దారిలో ఏ అంతరాయమూ రాకుండా ఉండాలి. చెట్లన్నీ ప్రశాంతంగా నిశ్శబ్దంగా ఉన్నాయి. ఒక్క పిట్టయినా కదలడం గాని మెదలడం గాని లేదు. జంతువులన్నీ చడీచప్పుడు లేకుండా ఆదమరిచి హాయిగా నిద్రపోతున్నాయి. దిక్కులన్నిటా చీకట్లు పరచు కున్నాయి. అంతా చీకటి చీకటిగా ఉంది. చాలా రాత్రి అయింది. ఆకాశంలో చుక్కలు ప్రకాశిస్తున్నాయి. ఆ దృశ్యం వేల వేల కళ్ళతో ఆకాశం భూలోకాన్ని దర్శిస్తోందా అన్నట్లు చుక్కలతో మిలమిలలాడుతోంది. అదిగో చంద్రుడు ఉదయిస్తు న్నాడు. చీకట్లు పారద్రోలుతున్నాడు. చల్లని వెన్నెలతో సమస్త ప్రాణులకీ సేదదీర్చి సంతోషం కలిగిస్తున్నాడు. రాత్రిళ్ళు సంచరించే జంతువులూ, మాంసభక్షకులైన రాక్షసులు మాత్రం అక్కడక్కడ మసలుతున్నారు. ఇక నిద్రపోదామా అన్నాడు విశ్వామిత్రుడు.

ఈ వివరాలన్నీ వింటున్న మునిగణం కూడా ఆనందంతో పరవశించింది.

## జీవితసార్థకత

మనమున్న సమాజంలో మంచిపనిచేసి యశస్వి అయిన వ్యక్తిని అభినందించడానికి ఎటువంటి పెట్టుబడి అవసరం లేదు. కావలసినదల్లా, హృదయవైశాల్యం. ప్రశంసకు పాత్రుడైన వ్యక్తి మిత్రుడు కావచ్చు. పొరుగింటి వాడు కావచ్చు. అతని ప్రతిభను మెచ్చుకొని రెండు మాటల్లో అభినందించడంవల్ల మనవ్యక్తిత్వానికేలోటు ఉండదు. ప్రతిష్ఠ, వయస్సు, పదవి మొదలైన పరిమితులను మరచి అభినందించడం మనధర్మం. తన ప్రత్యేకతను ప్రశంసించా లని, గుర్తించాలని ప్రతి మనిషీ కోరుకుంటాడు.

'ప్రాయః ప్రత్యయమాదత్తే స్వగుణేషోత్తమాదరః'- ఇది ప్రసిద్ధ సూక్తి. తనలోని ప్రత్యేక గుణానికి ప్రశంస లభించి నపుడు సాధకుని ఆత్మవిశ్వాసం పెరుగుతుంది. ఇతరుల సద్గుణాలను లేదా ప్రతిభను గుర్తించి అది కొద్దిదైనా గొప్పదిగా భావించి ప్రశంసిచేవారెందరున్నారు? అరుదుగా ఉండవచ్చు.

మన ధార్మిక ఆధ్యాత్మిక భావాలకు ఒక్కొక్క అధి దేవత ఉన్నట్లు భారతీయ సంస్కృతి నిరూపించింది. మానవదేహం విశిష్టమైనది. దీనిని భోగమయంగావించి, రోగమయం చేసుకోరాదు. తర్వాత, చింతించి ప్రయో జనం లేదు. దివ్యత్వాన్ని ప్రకటించే ఉత్తమసాధనంగా మార్చుకోవాలి. మనసుపోకడలు, చిత్రవిచిత్రంగా ఉంటాయి. అందుకు ప్రధానకారణం మన ఆశలు. అందులోనూ ప్రముఖమైనది కీర్తికాంక్ష. నిగ్రహంలేని మనసు నరకకూపంలో పడవేస్తుంది. నిగ్రహంకల మనస్సు మనలను దైవసన్నిధికి తీసుకువెళ్ళుతుంది. ఇటువంటి మార్గాలు తెలుసుకొని మెలకువతో అనుసరించడం వలన జీవనం సార్థకమౌతుంది. ఇవే మహాత్ములు, భక్తులు నామ స్మరణతో దైవానుగ్రహం సాధించవచ్చుననే పరమసత్యాన్ని లోకానికి చాటి చెప్పారు.

ధారావాహిక - 6

# శ్రీమద్భగవద్గీత

- ఆచార్య కుప్పా విశ్వనాథశర్మ

*గత సంచిక తరువాయి భాగం...*

ప్రతిజ్ఞ చేసుకున్నాడే చేశాడు. భీష్మాచార్యుడు పాండవులకి కౌరవులకి గురువును వెతుకుతున్నాడు అని తెలుసుకున్నాడు. ఇక్కడకు వచ్చి భీష్మాచార్యుణ్ణి ఆకర్షించాడు. ఆకర్షించి పాండవులకు కౌరవులకు గురువయ్యాడు. గురువెందుకయ్యాడు? అంటే ప్రత్యేకించి ఎట్లాగైనా ద్రుపద మహారాజును ఓడించే శిష్యుణ్ణి తయారు చేయాలి. అలా బాగా విద్యాబుద్ధులు నేర్పించాడు. ఎవరు ముందుకొస్తారా అని చూశాడు. అందరిలో కంటే తన పిల్లవాడు అశ్వత్థామ కంటే కూడ అర్జునుడు ముందున్నాడు అని గమనించాడు. అర్జునుడు ఇంద్రుని యొక్క అంశతో జన్మించినవాడు సాత్త్వికుడు. పరమవివేకవంతుడు. అతి వినయం అంటే ధూర్తలక్షణమైన అతివినయం కాదు, పరిపూర్ణమైనటువంటి వినయం. అట్లాంటి సద్గుణాలు కలిగినటువంటి అర్జునుడికి తన దగ్గర ఉండే శస్త్రాస్త్రాలన్నీ ఇచ్చేశాడు. ఇచ్చి గురుదక్షిణ ఇవ్వండి అని కౌరవులను, పాండవులను అడిగాడు. ఏమిటి గురుదక్షిణ అంటే- ద్రుపద మహారాజును ఓడించి నాకాళ్ళ దగ్గర పడేయాలి. ఇది గురుదక్షిణ. ఈ గురుదక్షిణ వ్యవహారం చాలా పెద్ద వ్యవహారం. కౌరవులు వెళ్లారు వాళ్ళవల్ల కాలేదు. పాండవులు వెళ్ళారు వాళ్ళు తీసుకొచ్చారు. ద్రుపద మహారాజుని తీసుకొచ్చి ద్రోణాచార్యుడి కాళ్ళమీద పడేశారు. అప్పుడు ద్రోణాచార్యుడేంచేశాడంటే 'నాయనా! ఇప్పుడేమయిందంటే నీ రాజ్యం నీకు పోయింది. నీవిప్పుడు రాజువికావు. నీరాజ్యం నాశిష్యుడు తీసుకొచ్చి నాకాళ్ళమీద పడేసాడు నీరాజ్యం ఇప్పుడు నాది. నేనేం చేస్తానంటే నేను నీతో స్నేహం చేయాలి. అందుకని సగం రాజ్యం ఇస్తున్నాను నీవు తీసుకో. సగం రాజ్యం ఇస్తే నీవు సగం రాజువి. నేను సగం రాజుని. మనిద్దరం ఇప్పుడు సమఉజ్జీలం. మనిద్దరం స్నేహితులమవుదాం, అన్నాడు ఇంతవరకే. పాపం ఆ తరువాత ఆ సగం రాజ్యం తీసుకున్నది లేదు. ఆయన వెళ్ళి ఆ పాంచాల రాజ్యాన్ని పాలించింది లేదు. ఇక్కడే ఉన్నాడు. కేవలం పంతం కోసం. ఇది జరిగిన తరువాత ద్రుపద మహారాజుకి చాలా అవమానం వేసింది. కానీ ఒక్క విషయం మనం గమనించు కోవాలి. మహాభారతంలో ఉండే ప్రతి పాత్ర చాలా విశేషంగా ఉంటుంది. ప్రతి పాత్రలోను ప్రతి వ్యక్తిలోను తెలియనటువంటి మనం ఊహించనటువంటి ఒక యోగబలము, ఆ మహర్షుల యొక్క వాళ్ళ పితృదేవతల యొక్క ఆశీర్వాదం పరిపూర్ణంగా ఉంటుంది. ఈ ద్రుపద మహారాజుకి మళ్ళీ ద్రోణుడి మీద కోపం వచ్చింది. ఆయనేం చేశాడంటే ద్రోణుణ్ణి చంపే పిల్లవాడు పుట్టాలి. అర్జునుడు అంటే ఎవరిప్పుడు ఈయన తలపట్టుకొని కాళ్ళ మీద పడేసినాడో, అంతటి మహావీరుడు నాకు అల్లుడవ్వాల్సిందే. ఎలాగూ పిల్లవాడవటానికి వీలులేదు. కాబట్టి నాకల్లుడు అవ్వాల్సిందే. కాని ఈ పని చేయించిన ద్రోణుడున్నాడే ఆయన్ను చంపటానికి మాత్రం పిల్లవాడు పుట్టాల్సిందే. తపస్సు చేశాడు. అదో పెద్దగాథ. అందులో ఆ తపస్సుకు ఫలంగా ఇటు ద్రౌపది, అటు దృష్టద్యుమ్నుడు ఇద్దరు పుట్టారు. ఆ దృష్టద్యుమ్నుడు ఎదురుగ నిలుచుని ఉన్నాడు. దృష్టద్యుమ్నుడు అని చెప్పకండి అని ద్రుపదుడు చెప్పటం ద్వారా ఏం చూపిస్తున్నాడు? నిన్ను చంపటానికి పుట్టినవాడు ఎదురుగుండా ఉన్నాడు. నీ యిష్టం. ఇది కడుపులో కెలుకుతున్నట్లు లేదూ? ఎవరైనా యుద్ధానికి వస్తే ఇటైనా అటైనా పోవలసిందే. అలా కాకుండ నిన్ను చంపుతాడు నిన్ను చంపుతాడు, నిన్ను చంపుతాడు. అని చెప్పటం ఎందుకు? ఎంత అసహ్యమైన మాట ఇది. ఇంతటితో కూడ అపలేదు. "తవ శిష్యేణ' ద్రుపదమహారాజు ఏం చేశాడు? ఆదృష్టద్యుమ్నుణ్ణి తీసుకొచ్చి ద్రోణాచార్యుని దగ్గర శిష్యుడుగా చేర్చాడు. ద్రోణుడిని చంపాలీ అంటే మంచి విలు విద్యరావాలి. ధనుర్విద్య రావాలి. లేదా శస్త్రాస్త్రాలు కావాలి. అవన్నీ ఇక్కడ ఉన్నాయి. అవన్నీ ద్రోణాచార్యుడెలాంటివాడో చూడండి. తనను చంపటానికి పుట్టాడు అని తెలిసినా సరే పరిపూర్ణమైన విద్యలు నేర్పాడు. దృష్టద్యుమ్నుడు ఎలాంటి వాడు అని ఒక్కమాటలో చెబుతాను. కౌరవుల పక్షాన సేనాధిపతులు మారిపోతూనే ఉన్నారు. భీష్ముడు మొదటి సేనాధిపతి, తరువాత ద్రోణుడు, తరువాత కర్ణుడు, శల్యుడు చాలామంది సేనాధిపతులుగా ఉన్నారు. కాని పద్దెనిమిది రోజులపాటు దృష్టద్యుమ్నుడు ఒక్కడే



ఆ పన్నులను రక్షించువాడు శ్రీవేంకటేశ్వరుడు

పాండవుల పక్షాన సేనాధిపతి. ఇప్పుడు వీటి ప్రభావ మేమిటో చూడండి ఇటువంటి దృష్టద్యుమ్నుణ్ణి నీవు మొదట్లోనే తుంచివేసుంటే? నీ తెలివితేటల గురించి మాట్లాడుకోవాలా? తెలివియెవరికి ఉంది? 'ధీమతా' దృష్టద్యుమ్నుడికుంది. నిన్ను చంపటానికి నీదగ్గరే విద్యనేర్చుకున్న దృష్టద్యుమ్నుడు తెలివైనవాడు. నీవు తెలివి తక్కువవాడివి. ఇలాంటి తెలివి తక్కువవాడివి ఇప్పుడు యుద్ధంలో నిలుచుని నా ప్రాణం మీదకు తెచ్చావు అంటున్నాడు. ఇదా గురువులు దగ్గర మాట్లాడాల్సిన మాట. కాని ఇంతపని చేస్తున్నాడు. గురువుని ఒక పుల్ల తీసుకొని కడుపులో కెలికినట్లు మాట్లాడుతున్నాడు. ఇది మనం ఏదశలోను చేయరాదు. గురువుల వద్దకు వెళ్ళునపుడు వినయంగా కాకుండ మరోరకంగా మాట్లాడనే మాట్లాడరాదు. అనే విషయాన్ని స్పష్టంగా తెలియజేయటం కోసం పరమాత్మ ఈ శ్లోకాన్ని ప్రత్యేకించి ఇక్కడ పెట్టాడు. గురువుల నాశ్రయించటం గురువుల వద్దకెళ్ళటం పెద్ద విషయంకాదు. వారిదగ్గర వెళ్ళిన తరువాత వారి పట్ల మన వ్యవహారమెలా ఉన్నది? వినయంగా ఉందా లేకపోతే మరోరకంగ ఉందా? అనే దాని మీద మన భవిష్యత్తు ఉంటుంది. దుర్యోధనుని యొక్క భవిష్యత్తు ఇప్పుడు తేలిపోయిందిగదా! ఇంక దుర్యోధనునికి భవిష్యత్తు అను మాటలేదు. దుర్యోధనుడు ఎందుకు ఓడిపోయాడు. ఎందుకనంటే గురువును అనుమానించాడు కాబట్టి ఓడిపోయాడు. ఎక్కడ అనుమానించాడు? యుద్ధం ప్రారంభం కావలసినప్పుడే అనుమానించాడు అంటే గణపతి పూజ చేసుకోవలసిన సందర్భంలో ఆ గణపతి నవమానిస్తే ఏమవుతుందో అదే అయింది. గురువంటే యెవరు? సాక్షాత్తు పరమాత్మ. భగవంతుడు అటువంటి భగవంతుణ్ణి అనుమానించాడు కాబట్టి ఏరకమైన ఫలితముదక్కలేదు. ఇప్పుడు ప్రస్తుతమున్న పరిస్థితులలో యుద్ధంలో విజయం కనీస ఫలం. ఈ కనీస ఫలితం కూడ ఈయనకు దక్కలేదు. అర్జునుడికి దక్కింది. ఆయన జగద్గురువైన శ్రీకృష్ణపరమాత్మని ఆశ్రయించాడు. ఆశ్రయించి వినయంగా అడుగుతున్నాడు. ఏం చేయాలో నాకు తెలియడం లేదు. నన్ను నువ్వు ఎలాగైనా ఉపదేశించి కడతేర్చు అని అడుగుతున్నాడు, కాబట్టి అర్జునుడికి దుర్యోధనుడుకి ఉండే తేడాని మనం స్పష్టంగా గమనించుకోవాలి. ఏ సందర్భంలోను మనం దుర్యోధనుడిలాగా ఉండకూడదు, అర్జునుడిలాగానే ఉండాలి. ఇదే కదా భగవద్గీత మాత పరమాత్మ యొక్క వాక్కు చెబుతున్నది. ఇంతే కాదా గురువుల దగ్గరకే కాదు ఎవరి దగ్గరికైనా వెళ్ళేటప్పుడు మన మనసులో ఉండేటటు వంటి భావాల్ని ఎలా వ్యక్త పరచాలి? వాళ్ళకి మన మనసులో ఉంటే భావాల్ని స్పష్టంగా తెలిసేట్లుగ వ్యక్తపరచాలి. దుర్యోధనుడు తన మనసులో ఉండేటటువంటి అసూయను సాధారణమైన వాక్యాలతో కప్పిపుచ్చి మాట్లాడుతున్నాడు. ఇలా ద్వంద్వార్థాలతో మాట్లాడటం చాలా అసహ్యమైన పని. ఇలాంటి పని చేయరాదు. ఇది గురువులు వద్ద మాత్రమేకాదు ఎవరి దగ్గరైనా సరే ఒకే అర్థం ఉండాలి. ఒకమాటకి ఒకే అర్థం ఉండాలి. ఒక మాటకి ఒకవేళ రెండో అర్థం ఉండేటట్లుయితే, ఆ అర్థం ఎదుటివాణ్ణి సంతోషింప చేసేట్లుగ ఉండాలి. అంతే తప్ప ఎదుటివాణ్ణి బాధపెట్టేటట్లుగ రెండో అర్థం ఉండకూడదు. అది చాలా అసహ్యమైన పని. దుర్యోధనునివంటి దుర్మార్గులు చేసే పని అనే విషయాన్ని మనకిక్కడ మన భగవద్గీత తల్లి భగవద్గీతామృతం బోధిస్తున్నది, కాబట్టి మనమందరం చాలా శ్రద్ధగా ఈ విషయాన్ని దృష్టిలో ఉంచుకొని గురువులను ఆశ్రయించినపుడు, గురువులు కనిపించినపుడు, వారికి వినయంగా నమస్కరించి వారియందు జాగ్రత్తగ వ్యవహరించుకొని మనకు కావలసిన ప్రయోజనాన్ని పొందుదాం.

దుర్యోధనుని లాగా ఉన్నట్లయితే మనం ఫలితం పొందలేము. అర్జునుని లాగా ఉంటే పరిపూర్ణమైన సత్ఫలితాన్ని అఖిలాండకోటి బ్రహ్మాండనాయకుడైన దేవదేవుడు, శ్రీకృష్ణపరమాత్మ అనుగ్రహిస్తాడు అనే విషయాన్ని మాత్రమే మన మనసుల్లో ఉంచుకోవాలి అనేది ఈ శ్లోకంలో తెలుసుకోవలసిన విషయం. ఇది కేవలం ఒక్కసారి విన్న వెంటనే మనసుకెక్కేది కాదు. ఇలాంటివి మనం చాలా జాగ్రత్తగ మనసుకి బోధించుకోవాలంటే ఆ శబ్దాలు కూడ మనకు వినిపించాలి. వాటిని ఉచ్చరించాలి. అలా ఉచ్చరించినపుడు మాత్రం ఈ భావం, ఈ గురుభక్తి అనేవి మన మనసుల్లోకి పరిపూర్ణంగా ఎక్కుతుంది. గురుభక్తి లేనిదే ఏ కార్యము సఫలము కాదు. గురువు యొక్క అనుగ్రహం లేనిదే ఏ ప్రయోజనం సిద్ధించదు. గురువును అవమానించి యెవ్వరు బాగుపడలేదు. ఈ విషయాన్ని మనం నిరంతరం దృష్టిలో పెట్టుకొని, మన జీవితంలో ఈ విషయం ఒక అలవాటుగా మారాలి.

(ఇంకా ఉంది)

# అన్నమయ్య సంకీర్తనల్లో...

# నారాయణ తే నమో నమో!!

– శ్రీమతి ఎస్.మాధవీలత

మహాపురుషుల కోవకు చెందినవాడు అన్నమయ్య. చిన్నతనంలోనే జీవిత పరమార్థాన్ని తెలుసుకున్న ధన్యాత్ముడాయన. సర్వపాప ప్రణాశకమైన భగవన్నామ సంకీర్తనమే ఆయనకు తరణోపాయం. ఆ సంకీర్తనాచార్యుడు వేంకటగిరినాథుని వైభవాన్ని 32 వేల కీర్తనలతో కీర్తించాడు. తన కీర్తనలను స్వామివారిపాదాలకు చేసే 'పూజలు'గా పేర్కొన్నాడు. అందులో ఒక సంకీర్తనే తనను రక్షించటానికి చాలన్నాడు.

"నిన్ను నమ్మి విశ్వాసము-నీపై నిలుపుకొని
ఉన్నవాడనిక వేరే-ఉపాయమేమిటికి"?

అని తిరుమల శ్రీనివాసునితో చెప్పుకొన్నాడు. పరమ పదప్రాప్తికి భగవద్విశ్వాసాన్ని మించిన ఉపాయం వేరేది లేదనేది ఆయన సిద్ధాంతం.

ఆ సంపూర్ణ విశ్వాసమే ఆయనచేత ఆడించింది. పాడించింది. అత్యద్భుతమైన పదకవితా వాఙ్మయాన్ని ఆయనచే సృష్టింపజేసింది. భక్తిభావంతో ఆయన పాడినపదాలు ఆయనకే కాక ఇతరులకు కూడా తారక మంత్రాలయ్యాయి.

అన్నమయ్యది నేటి కడపమండలంలోని రాజంపేటకు చెందిన తాళ్లపాక గ్రామం. లక్కమాంబ, నారాయణసూరులనే పుణ్యదంపతులకు శ్రీవేంకటేశ్వరస్వామి వరప్రసాదంగా అన్నమయ్య 1408లో జన్మించి, 1503 దాకా జీవించిన ఆయుష్మంతుడు. వేదాలను అధ్యయనం చేసినవాడయినా, ప్రాచీన సాహిత్యాన్ని తరచిచూసినవాడయినా, అన్నమయ్య శిష్టసాహిత్య పంథాను వదలిపెట్టి ప్రజాసంక్షేమమే పరమార్థంగా, పామర జనోద్ధరణే పరమకర్తవ్యంగా, తాను నమ్ముకున్న భక్తిసిద్ధాంతాల ప్రచారమే స్వధర్మంగా భావించి, పరిశ్రమించి పదసంకీర్తనా యజ్ఞాన్ని జీవితాంతం కొనసాగించాడు.

అన్నమయ్య పండిత పామరకవి. అంచేత పామరుల్ని మెప్పించేలా జానపద గేయవరుసల్ని ఎన్నుకున్నాడు. జానపదుల భాషను వాడుకున్నాడు. గ్రామీణుల వ్యక్తీకరణ ధోరణిని కవితలో ప్రదర్శించాడు.

"సకల వేదములు – సంకీర్తనలు చేసి
ప్రకటించి నిను బాడిc-పావనుడైన
అకలంకుడు తాళ్ళపా-కన్నమాచార్యుల
వెకలియై యేలిన శ్రీ-వేంకటనిలయ"-

ఇది అన్నమయ్య సంతతివారు శ్రీవేంకటేశ్వర స్వామిని ఉద్దేశించి పాడినపాట.

అన్నమయ్య శ్రీరామానుజులవారి ప్రపత్తి సిద్ధాంతాన్నే అనుసరించాడు. అన్నమయ్య కీర్తనలు శరణాగతిని విస్తృతంగా ప్రబోధిస్తున్నాయి. గీతలో శ్రీకృష్ణ భగవానుడు చివర "సర్వ ధర్మాన్ పరిత్యజ్య..." శ్లోకంలో ఉపదేశించిన తత్త్వం కూడా అదే!





కీర్తనలు వినడం వేరు. పాడడంవేరు. కీర్తనల్ని అర్థం చేసుకొని ఆనందించడం అంతకు మించిన అంశం!

తాళ్లపాక అన్నమయ్య సంకీర్తనల్లో ఎన్నో ప్రత్యేకాంశాలున్నాయి. మొదటిది: అన్నమయ్య సంస్కృతాంధ్రాల్లో కీర్తనలు వ్రాయడం. రెండవది: ఆయన రచనల్లో ప్రబంధకవులకు భిక్ష పెట్టిన ఎన్నో ఉహాచిత్రాలు కనిపించడం. మూడవది: సాహిత్యానికీ, సంగీతానికీ సమప్రాధాన్యం ఇవ్వడం. నాల్గవది: తనకాలం నాటి జానపదగేయ ఫణితుల్ని ఆసరాగా తీసుకుని మాండలిక భాషకు ఆస్కారం కలిగించడం.

ఇలాంటి విశిష్టతలున్న అన్నమయ్య కీర్తనలను వ్యాఖ్యానించడం మామూలు విషయం కాదు. ఇందుకు ఉభయభాషా పాండిత్యం, వేదపురాణేతిహాస పరిజ్ఞానం, సంగీత, సాహిత్యాల్లో చొరవ ఎంతో అవసరం.

కీర్తనలన్ని వ్యాఖ్యానించడమంటే కఠినపదాలకు అర్థ వివరణ ఇవ్వడం, తాత్పర్యం సంగ్రహంగా వ్రాయడం. కీర్తనలకు మూలభూతంగా ఉండే వేద పురాణోపనిషద్వాక్యాలను చూపడం. అలాగే కీర్తనలకు దీటయిన పద్యాలు, శ్లోకాలు ఉదహరించి ఇవ్వడమే ఇందులోని విశేషాంశాలు.

కీర్తనలను ఎందరో వ్యాఖ్యానించారు. కీర్తనల అర్థం తెలిస్తే చాలనుకునే సామాన్యులు, అన్నమయ్య వేదాంతం పట్ల మొగ్గుచూపే ముముక్షువులు, అన్నమయ్య పదప్రయోగవివరణ తెలుసుకొనగోరే పరిశోధకులు కోకొల్లలుగా కనిపిస్తారు.

అన్నమయ్య తిక్కనలాగా తెలుగు పదాలను విరివిగా వాడుకున్న కవి. సహజసుందరమైన జాతీయాలతో, నానుడులతో కవితను సుసంపన్నం చేసిన మహాకవి. అందుకే రాళ్ళపల్లి అనంతకృష్ణ శర్మగారు అన్నమయ్య కీర్తనలనుగూర్చి "అదొక సారస్వత క్షీరసాగరం. భావార్ణవంలో, శైలిలో, భావ వైవిధ్యంలో, రాశిలో అన్నమాచార్యుని రచనను మించినది ఆంధ్రవాఙ్మయంలో ఇంకొక్కటి లేదు" అని తేల్చి చెప్పాడు.


అన్నమయ్య పదకవితా సౌందర్య దర్శనం అతిలోక రమణీయం, అనంత రససాగరం, అనుభవోపేతం, ఆస్వాద యోగ్యం.

అన్నమయ్య మరియు పురందరదాసు 15వ శతాబ్దం ఉత్తరార్ధంలో సమకాలికులైనభక్తులు. శ్రీఅన్నమాచార్యుల వారి భాష తెలుగు. భక్తి– శృంగార రసభరితం. ఇష్టదైవం– శ్రీవేంకటేశ్వరస్వామి. శ్రీ పురందరదాసులవారి భాష– కన్నడం. భక్తి– వాత్సల్యపూరితం. ఇష్టదైవం– బాలకృష్ణుడు. శ్రీపురందరదాసు శ్రీవేంకటేశ్వరస్వామి దర్శనార్థమై తిరుమలకు వచ్చినపుడు శ్రీఅన్నమాచార్యులను కలుసుకుని భక్తితత్పరతతో తమతమ కీర్తనలను పరస్పరం గానం చేసినట్లు వదంతి! 'నారాయణతే నమో నమో' కీర్తనను అన్నమాచార్యులు పాడగా పురందరదాసు భక్తిపారవశ్యంతో తానూ ఆ కీర్తనను పాడారట!

ఈ కీర్తన అన్నమాచార్యుల కీర్తనల 11వ సంపుటం లోని 2వ భాగంలో 32వ కీర్తనగా ఉంది. పురందరదాసులవారి కీర్తనలు మొదటిభాగంలో 70వ కీర్తనగా చిన్న చిన్న మార్పులతో ఉంది.

ఈ కీర్తనలో అన్నమయ్య 'నారదసన్నుత' అంటే పురందర దాసు 'భవనారద సన్నుత' అనీ, అన్నమయ్య 'మురహర భవహర' అంటే పురందరదాసు 'మురహర నగధర' అనీ, అన్నమయ్య 'భవబంధ విమోచన', అంటే పురందరదాసు, బలి భవభంజన అనీ, అన్నమయ్య 'నరమృగ శరీర' అంటే పురందర దాసు 'నరహరి శరీర' అనీ, అన్నమయ్య 'బలిబంధన గోపవధూ వల్లభ' అంటే పురందరదాసు 'బలిభంజన గోవర్ధన వల్లభ' అనీ అన్నమయ్య 'వేదోద్ధర తిరు' అంటే పురందరదాసు 'వేదోద్ధారశ్రీ' అనీ, అన్నమయ్య 'నాదప్రియ' అంటే పురందర దాసు 'పురందర విఠల' అని చిన్న చిన్న మార్పులతో పాడారు.

ఈ పాటను గురించి 11వ సంపుటం పీఠికలో రాళ్ళపల్లి అనంతకృష్ణశర్మ "నేటికి దక్షిణదేశంలో కనిపించే హరిభజన సంప్రదాయంలో 'తోడయమంగళం' అనబడే లాలిపాటలలో ఒక్కటిగా సర్వత్రావ్యాప్తిలో ఉన్న 'నారాయణతే నమో నమో' అనే సంకీర్తన మనకీనాడు రాగిరేకులలో దొరికింది. రాగం మాత్రం మారింది. రేకులలో దీనిది పాడిరాగం. వ్యవహారంలో ఇప్పుడది మధ్యమావతి రాగంలో ఉంది.



నారాయణ తే నమో నమో
నారద సన్నుత నమో నమో॥

మురహర భవహర ముకుంద మాధవ
గరుడ గమన పంకజనాభ
పరమపురుష భవబంధ విమోచన
నరమృగ శరీర నమో నమో॥

జలధిశయన రవిచంద్రవిలోచన
జలరుహ భవనుత చరణయుగ
బలిబంధన గోపవధూవల్లభ
నలినోదర తే నమో నమో॥

ఆదిదేవ సకలాగమ పూజిత
యాదవకుల మోహనరూప
వేదోద్ధర తిరువేంకటనాయక
నాదప్రియ తే నమో నమో॥

పై కీర్తనలో, 'నారాయణ తే నమో నమో' అంటే జలములే అయనంగా కలిగిన ఓ విష్ణుమూర్తీ! నీకు నమస్కారం. నిత్యం నారదమునిచే కీర్తించబడేవాడా! నీకు నమస్కారం అని అర్థం.

మురాసురుని వధించినవాడా! పాపాలను పోగొట్టేవాడా! మోక్షాన్ని ప్రసాదించేవాడా! లక్ష్మీదేవికి పతి అయిన వాడా! గరుడవాహనంపై పయనించేవాడా! పద్మమునాభియందు కలవాడా! పురుషులలో ఉత్తమమైనవాడా! సంసార బంధాలనుంచి విముక్తి కలిగించే నరసింహావతారా! నీకు నమస్కారం.

నీటిమీద పవళించేవాడా! సూర్యచంద్రుల దృష్టికలవాడా! బ్రహ్మచేత పొగడబడిన పాదములు కలవాడా! బలిచక్రవర్తిని బంధించినవాడా! గోపికావల్లభా! పద్మం ఉదరమునందు కలిగిన వాడా! నీకు నమస్కారం.

సకల వేదాలచేత పూజించబడే ఆదిదేవా! యదు వంశంలో పుట్టిన అందమైన రూపం కలవాడా! వేదాలను ఉద్ధరించిన వాడా! సంగీతంపట్ల మక్కువగల శ్రీవేంకటేశ్వరా! నీకు నమస్కారం.



హరిదాస వాఙ్మయంలో...

# శ్రీవేంకటాచలాధీశుడు

- శ్రీ సుస్వరం నాగరాజాచార్యులు

12

*గత సంచిక తరువాయి భాగం...*

**నిన్ననె నంబిదె నీరజనయన ।**
**ఎన్న పాలిసో ఇందిర రమణ ॥**
**గౌతమ మునియ శాపదలి అహల్యెయు**
**పథదొళు శిలెయాగి మలగిరలు ।**
**పతితపావన నిన్న పాదసోకి సతియాగి ।**
**అతిశయది భక్తర కాయ్ద నెంబుదకేళి ॥**

గౌతమముని శాపమునకు లోనై దారిలో శిలయై పడియుండినది అహల్య. పతితపావనుడైన రామ! నీ పాదములు సోకిన వెంటనే ఆమె తిరిగి యథారూపమును పొందిన వృత్తాంతమును విని, ఆ రాముడే నీవని తలచి నిన్ను నమ్మితిని. హే నీరజనయన! నన్ను పాలింపుము ఓ ఇందిరా రమణ!

**బలవంత ఉత్థాన పాదారాయన మగన**
**మలతాయి నూకలు అడవి యోళగె**
**జలజాక్ష నిన్నను కురితు తపవిరలాగె**
**సులభదిందా తనిగె ధ్రువపదవిత్తెందు కేళి ॥**

(బలవంతుడైన ఉత్థానపాదరాజు కొడుకైన ధ్రువుని, ఆతని పినతల్లి నిష్ఠురోక్తులతో అడవికి పంపగా- అప్పుడు ఆతడు నిన్ను గూర్చి భక్తితో తపస్సు చేయగా, నీవతనికి ధ్రువపదవి నిచ్చిన వాసుదేవుడవు అని తెలుసుకొంటిని.)

**సురనరలోకదిపుణ్యద జనరన్ను**
**పొరెయబేకెందు వైకుంఠదింద**
**సిరిసహితదిబందు శేషాచలదినిందు**
**కరుణ శ్రీపురందర విఠల నెంబుదకేళి ॥**

(సుర నరలోకమునందలి పుణ్యాత్ములను కాపాడాలనే ఉద్దేశ్యంతో నీవు లక్ష్మీదేవితో కూడుకొని వైకుంఠమునుండి నేరుగా ఈ శేషపర్వతము పైకి మాపై కరుణతో వచ్చి నిలబడిన పురందరవిఠలుడవు అని తెలుసుకొంటిని.)

పురందరదాసులవారు శ్రీనివాసుని అనుగ్రహంతో పుట్టినవారు కావడం వలనను, స్వామియొక్క పూర్ణాను గ్రహమువలనను పరిపూర్ణమైన భక్తితో ఆ స్వామిని అయినప్పు డెల్ల పైపైన దర్శించుకొంటుండే వారనిపిస్తుంది. కారణాంతరము లచే గ్రామాంతరములలో నున్నప్పుడుకడు దూరమైన కొండల రాయని దర్శించుకోవడం దినములు గంటలు ఆలస్యమైతే విరహవేదనతో క్రుంగిపోయేవారు. ఆ స్వామిని చూచినప్పుడే నిజానందము. అది ఆలస్యమైతే పరితపించిపోయేవారు. చూడండి ఒకానొక సందర్భంలో స్వామిదర్శనార్థము పరితపిం చుచూ- భక్తుల నుద్దేశించి చెప్పినది -

**ఈ జీవవిద్దు ఫలవేను । చెలువ**
**రాజీవలోచనన నెనెయద (నోడద) పాపితను వినలి**

(కమలదళాయతాక్షుడైన వేంకటేశ్వరుని తలచని, చూడని ఈ పాపి శరీరమందు జీవముండి ప్రయోజనమేమి?)

**ఉరగాద్రియలి చంద్ర పుష్కరణి మొదలాద**
**పరిపరి తీర్థదలి ముణుగి ముణుగి**
**తిరువేంగళప్పసిరి పురందర విఠలన కణ్ణినలినోడ**
**లరియద పాపి కపటతను వినలి ॥**

(ఉరగాద్రియందున్న పుష్కరిణి మొదలైన శ్రేష్ఠతీర్థము లందు మునిగి స్నానము చేయక, అక్కడున్న తిరువేంగళాధీశు డైన శ్రీపురందరవిఠలుని కంటితో చూడని పాపి, కపడదేహము నందు జీవముండి ప్రయోజనమేమి?)

స్వామి దర్శనము కాకపోతే ఎంతగా తపించిపోయే వారో అంతే స్వామి దర్శనమయిన వెంటనే మైమరచి గంతులు వేసినారు. చూడండి.

**నిన్ననోడి ధన్యనాదెనో హే శ్రీనివాస ॥**
**నిన్న నోడి ధన్యనాదె ఎన్నమనో నయనకీగ**
**ఇన్ను దయమాడు సుప్రసన్న స్వామి శ్రీనివాస ॥**

(నిన్ను చూచి ధన్యుడనైతిని శ్రీనివాస, నా మనస్సుతో, నయనములతో (మనోనయనములతో) నిన్ను చూచి ధన్యుడ నైతిని నాపై దయచూపి కాపాడుము శ్రీనివాస.)

పక్షివాహన లక్ష్మీరమణ లక్ష్మి నిన్న వక్షదల్లి
రక్షక శిక్షక దక్ష పాండవ పక్ష కమ-
లాక్ష రక్షిసు కరుణిసు ॥

(పక్షివాహనుడవైన లక్ష్మీపతీ! నీ వక్షఃస్థలమునందలి లక్ష్మీదేవిని చూచితిని. రక్షకుడవు, శిక్షకుడవు, దక్షుడవు, పాండవ పక్షకుడవు, కమలాయతాక్షుడవు నీవయ్యా కరుణింపుము.)

దేశదేశ తిరుగినాను ఆశెబద్ధనాదె స్వామి
దాసనల్ల వేనో జగ దీశ శ్రీశ శ్రీనివాస ॥

(దేశదేశములు తిరిగి తిరిగి ఆశాబద్ధుడనైతి. స్వామి నేను నీ దాసుడను. హే జగదీశ! శ్రీశ! శ్రీనివాస కాపాడుము).

కంతు జనక కేళు ఎన్న అంతరంగద ఆసెయన్ను
అంతరవిల్లదె పాలిసయ్య। శ్రీకాంత శ్రీనివాస పురందర విఠల॥

(మన్మథ జనకా! నా అంతరంగ విన్నపమును ఆలకించి అంతరమును చూపక నన్నునుగ్రహించవయ్య శ్రీకాంత! శ్రీనివాస! పురందరవిఠల).

'స్నేహో భక్తి రితి ప్రోక్తః' జ్ఞానపూర్వకమైన స్నేహమే భక్తి అని అన్న మధ్వాచార్యుల సిద్ధాంత ప్రకారము శ్రీనివాసుని సఖ్య భక్తితో వ్యాజనిందా స్తుతిని కూడా ఇట్లు చేసియున్నారు.

తిరిదుంబదాసర కైలి కప్పవగొంబె
గరుడగమన నిన్ని చరియనరియె ।

వైకుంఠపాళి
:: 68 - సమాధానాలు ::

| | | | | | | | | |
|---|---|---|---|---|---|---|---|---|
| 1 సు | | 2 భ | య | | 3 కే | 4 శి | | 5 శ |
| కు | | ద్ర | | 6 సు | | ష్టి | | కుం |
| 7 మా | య | | 8 సు | మ | తి | | 9 తా | త |
| రి | | 10 త్రి | | తి | | 11 త | | ల |
| | 12 భూ | జ | ము | | 13 కో | ప | ము | |
| 14 మ | | ట | | 15 చం | | తి | | 16 వ |
| 17 న | ల | | 18 చం | డి | క | | 19 కు | రు |
| స్వి | | 20 అ | | క | | 21 కృ | | ణు |
| ని | | 22 ని | మి | | 23 ఖ్యా | తి | | డు |

ధోరె పురందర విఠల నిన్నన్ను నంబిదరె
తిరుపెయు హుట్టలొల్లిదు కేళొహరియె
ఆరుబదుకి దరయ్య హరినిన్న నంబి
తోరా ఈజగదొళగె ఒబ్బరనుకాణె ॥

(సర్వసంగ పరిత్యాగులై నీవె సర్వస్వమని భావించు కొన్న భక్తులు తాము జనులచే భిక్షమును పొందిన కానుకలను నీకు సమర్పిస్తే నీవు వాటిని గ్రహిస్తున్నావు. ఇంకా ఒక్కమాటలో చెప్పాలంటే నీవనుగ్రహించేవారి సంపదలను హరిస్తావు కదా. *(యస్యానుగ్రహమిచ్ఛామి తస్యవిత్తం హరామ్యహం)* కావున నిన్ను నమ్మి బ్రదికినవారు ఈ లోకములో ఎవ్వరును లేరు. ఉదాహరణమునకు తామ్రధ్వజుని తండ్రిని, భృగుమునిని, త్రిపురాసురుని భార్యలను, కర్ణుని, కౌరవులను, పూతనని ఎంత మాత్రము అనుగ్రహించినది తెలియదా).

'*నిన్న నంబలు తిరుపేయుహుట్టలొల్లిదుకేళొహరియే*' నిన్ను నమ్మిన తిరిపెము (భిక్షము) కూడ పుట్టదని అంటే మరొక కీర్తనలో '*నిన్న నంబలు ముద్దు పురందర విఠల చిన్నక్కెపుట ఇట్టంతె అహోదోరంగ*' నిన్ను నమ్మిన బంగారమునకు పుటము పెట్టినట్లగునని అంటారు.

"దణియనోడిదెనో వేంకటన । మన
దణియనోడిదెను । శిఖామణి తిరుమలన ॥

ధనవంతుడైన శ్రీమంతుడైన వేంకటేశ్వరుని మనసార చూచితిని. అతడు తిరుమల శిఖామణి. చరణములయందు గజ్జెలను ధరించినవాడు, పీతాంబరమును కట్టిదానికి ఒడ్డాణ మును పెట్టుకొన్నవాడు, బంగారుపతకములతో తూగాడే హారము లను ధరించినవాడు, కంఠమందు వైజయంతిమాలను ధరించిన వాడు, వ్రేళ్ళకు ఉంగరములను, భుజకీర్తులను ధరించి లేత తామర రేకుల లాంటి కన్నులను గలవాడును, ఉంగరాల జుట్టు, నవ్వు చిందించే ముఖముగలవాడును, శంఖచక్రములు ధరిం చినవారునూ, కంకణములను చేత ధరించిన వాడును, శంఖ ధ్వనిని చేయువాడును, భూవైకుంఠమిదే అని చేతితో చూపెట్టు వాడును, గట్టి బియ్యముతో చేసిన నైవేద్యమును స్వీకరించు వాడును, వడ్డికాసులను గ్రహించువాడును, వాద్యనాదములకు మురిసిపోవువాడును, గంధ కస్తూరి మిశ్రమమును లేపనము చేసుకొనువాడును, జరీ పీతాంబరధరుడును, వేటాడి వచ్చే వాడును, సృష్టీశుడైన పురందరవిఠలుడును అయిన శ్రీనివాసుని చూచితిని. *(ఇంకా ఉంది)*

మన మహర్షులు

# కర్దమమహర్షి

- సద్గురు డా॥ కె. శివానందమూర్తి

కృతయుగం ప్రారంభంలో మరొకసారి భూమి సంతాన హీనమయింది. కర్దముణ్ణి బ్రహ్మదేవుడు మళ్ళీ సంతానోత్పత్తి చెయ్యమని అడిగాడు. "ఈ భూమియందు జన సమ్మర్దం కావాలి. జనసమృద్ధి కావాలి" అని అడిగాడు.

అప్పుడు కర్దముడు, "నేను సంతానాన్ని కన్నాను. అన్నీ చూచాను. నేను మళ్ళీ సంసారంలో ప్రవేశించాలని బ్రహ్మదేవు డంటున్నాడు. సరే" అనుకుని తపస్సుకు వెళ్ళిపోయాడు. చిర కాలం తపస్సుచేసాడు. తపస్సులోంచి బయటికి వచ్చిన తరువాత హరిని స్మరించాడు.

ఆయనను హరి, "ఏ కోరికతో నీవు తపస్సులో నన్ను స్మరించావు? ఆ కోరిక నాకు చెప్పకుండానే సిద్ధించుగాక!" అన్నాడు.

శ్రీహరి కర్దముడితో ఇంకా ఇలా అన్నాడు "బ్రహ్మావర్త దేశపు రాజు నీ దగ్గరికి వస్తాడు. ఆయన కుమార్తెను నీవు వివాహం చేసుకో. మీకు తొమ్మిదిమంది కుమార్తెలు పుడతారు. ఆ కన్యలకు వివాహం తరువాత నీకు మునులు, తపస్యులు మనుమలుగా పుడతారు. ఆ తరువాత నేనే స్వయంగా నీకు కుమారుడిగా పుడతాను" అన్నాడు హరి.

హరి ఆజ్ఞ ప్రకారంగా కర్దముడు అలాగే చేసాడు. స్వాయంభూమనువు తన భార్య శతరూప, తమ కుమార్తె అయిన దేవహూతితో సహా వచ్చి కర్దముడితో, "నా కుమార్తె అయిన దేవహూతి నీ చరిత్ర అంతా విని నిన్ను తప్ప వేరెవరినీ వరించ నని ప్రతిజ్ఞ చేసింది. దీనికి ఏదో కారణము, దైవసంకల్పము ఉంటుంది. నీవు ఈమెను వివాహమాడు" అన్నాడు.

ఆయన స్వాయంభూమనువుతో "మంచిది! నీ కుమార్తెను నేను వివాహం చేసుకుంటాను. సంతానం కలుగగానే వెళ్ళిపోతాను. నీ కుమార్తెనడుగు. అందుకు సమ్మతిస్తేనే నేను వివాహం చేసుకుంటాను" అన్నాడు. అందుకు వాళ్ళు అంగీ కరించారు. దేవహూతి కర్దముల వివాహం జరిగింది. శతరూప, దేవహూతికి అనేక బోధలు చేసింది. దంపతులువెళ్ళారు.

వైవాహికజీవితంలో కర్దముడు దేవహూతిని పరీక్ష చేసాడు. ఆయన ఎప్పుడూ ఉదాసీన వైఖరిలో, ప్రవృత్తిలో ఉండేవాడు. ఆమెను స్వీకరించినట్లు కాదు, స్వీకరించనట్లు కాదు. ఆమె ఎప్పుడూ సేవచేస్తూ ఉండేది. చివరకు నిరాహారిగా ఉండి పోయింది. కుంగి కృశించిపోయింది. కృశించిన శరీరంలో శక్తిలేక ఉన్నా, యావచ్ఛక్తినీ కూడా ఆయన సేవకు ధారపోసింది.

అప్పటిదాకా ఆమెను పరీక్షించి ఆమెతో, "నాకు నీవు తపస్సులో సేవచేసావు. దీనికి నీకు ఫలం కలుగుతుంది. ఏమైనా కోరికలు కోరుకో నీకు సమస్తభోగాలు లభిస్తాయి. సుఖంగా ఉండు" అని చెప్పి భార్యకు ఆశీర్వచనం ఇచ్చాడు. ఆమె చేసిన సేవాకాలంలో ఆమెకుగాని, తనకుగాని, ఆహారం గాని, నిద్రకాని లేదు. ఇద్దరూకూడా కృశించిపోయారు. ఆయన వరప్రసాదంచేత తరువాత అనేక సంపదలు, ఆరోగ్యము,



బలము, యౌవనము ఆమెకు లభించాయి. ఒక దివ్యవిమానం, అనేక దివ్యభవనాలను సృష్టించాడు కర్దముడు. వాటన్నింటినీ సృష్టించిన తరువాత ఇవన్నీ నీకే అన్నాడు ఆమెతో! తనకేమీ కనబడటంలేదు అన్నదావిడ. అంటే ఆమె తపస్సుచేసే కాలంలో భౌతికమైనటువంటి జడపదార్థభావమును కోల్పోయింది అని అర్థంచేసుకోవాలి.

తన భార్య ఎంతటి తపస్సు చేసిందో ఆయన అప్పుడు గ్రహించాడు! ఆమెకు సృష్టే కనబడటం లేదు! ఆమెకు తను చేసిందంతా మాయాప్రభావం చేత చేసినవేనని అనిపించింది. అప్పుడు ఆయన, సమీపంలో కనబడుతున్న బిందుసరోవరంలో ఆమెను స్నానంచేసి రమ్మన్నాడు. ఆమె అందులో స్నానం చేసి బయటికి వచ్చేటప్పటికి అనేక వందలకొద్దీ దాసీజనం సేవ చెయ్యటము, తనకున్న ఐశ్వర్యము అంతా ఆమెకు కనబడింది. ఇద్దరూ కలిసి దేవవిమానం ఎక్కి సమస్తలోకాలు విహరించారు. వంద సంవత్సరాలు అలాగే సుఖంగా ఉన్నారు. ఆ తరువాత శ్రీహరి ఆజ్ఞ ప్రకారము ఆమెకు తొమ్మండుగురు కుమార్తెలు కలిగారు. తన పూర్వపు షరతుప్రకారం, కర్దముడు సంతానం కలుగగానే తను సన్యసించి వెళ్ళిపోతానన్నాడు ఆమెతో.

"మీరు వెళ్ళిపోతే ఈ కుమార్తెలకు పెళ్ళిళ్ళు ఎవరు చేస్తారు స్వామీ?" అన్నదామె. దాంతో ఆయన అప్పటికి సన్యాస ప్రయత్నం మానుకున్నాడు. ఆ తరువాత కొంతకాలానికి ఆమె మళ్ళీ గర్భం ధరించింది. కొడుకును కన్నది. ఆ పుట్టినవాడే శ్రీహరి అవతారమైన కపిలుడు. హరివంశంలోనే, విష్ణువు అంశలోనే పుట్టాడు. బ్రహ్మ చెప్పిన ప్రకారమే జరిగింది.

ఆ తరువాత తన తొమ్మండుగురు కుమార్తెలకు పెళ్ళిళ్ళు చేసాడు కర్దముడు. మరీచి మహర్షికి కళను; అత్రిమహర్షికి అనసూయను; అంగీరసుడికి శ్రద్ధను, పులస్త్యుడికి హవిర్భువును, పులహుడికి గతిని, క్రతువుకు క్రియను, భృగువుకు ఖ్యాతి అనే కుమార్తెను, వసిష్ఠుడికి అరుంధతిని, అథర్వుడికి శాంతిని ఇచ్చి– పెళ్ళిళ్ళు చేసి భర్తలతో వాళ్ళను పంపించాడు.

ఒకనాడు ఏకాంతంగా కుమారుడై పుట్టిన కపిలుడి దగ్గరికి వెళ్ళి నమస్కరించి, "నీవు విష్ణువువే కదా! నాకు మోక్షోపదేశం చెయ్యి, బోధ చెయ్యి. నీ పుట్టుకతో నేను ఋణవిముక్తుడిని అయ్యాను" అన్నాడు. కపిలుడు ఆయనకు సకలతత్త్వములు బోధించాడు.

అంతకుముందే కర్దముడు పరమవిరాగిగా ఉండటం చేత, తపోమహిమ చాలా ఉన్నవాడు కాబట్టి, ఇంద్రియము లను ఎప్పుడో నిగ్రహించిన వాడుకాబట్టి, అతడికి కపిలుడు ఇలా బోధించాడు: "సాంఖ్య, యోగ మార్గములు చెపుతున్నాను. నేను చెప్పే ఈ మార్గం మహోత్కృష్టమయినది. ఈ మార్గంలో నైతే నీకు ఎప్పుడూ విష్ణుదర్శనము, బ్రహ్మదర్శనము లాంటి బంధనహేతువులు ఏవీ రావు. పరంజ్యోతిగా నన్ను చూస్తావు" అని చెప్పాడు.

ఎందుచేతనంటే, ఎంతకాలం సగుణమైన స్వరూపం దర్శనమిస్తుందో, మన తపస్సుకు మనలో ఉండే వృత్తే అలా దర్శనమిస్తుంది కాని మనలోలేనిది దర్శనమివ్వదు. సమస్త యోగాలలో ఒక్క రహస్యమేమిటంటే, మనం పొందేటటువంటి దర్శనానికి హేతువు, బీజం సంస్కారరూపంలో కోరికరూపంలో మన దగ్గర మన లోపలే ఉంటుంది. అదే బయటికి వచ్చి ఒక రూపదర్శనం– ఒక రూపకల్పన చేసుకొని– దర్శనమిస్తుంది. తపస్సు మనదే! ఆ కనబడేటటువంటి రూపముకూడా మన లోంచి ఉత్పన్నమైనటువంటిదే! మనం అడిగే కోరికలు మనవే! దానిఫలం అనుభవించేది మనమే! లోపల పరతత్త్వం మాత్రం ఏమీకాదు. అది దేనికీ హేతువుకాదు. తటస్థంగా ఉండే వస్తువది.

అలా కపిలుడినుంచి కర్దముడు బోధపొందిన తరువాత, అతడికి ప్రదక్షిణం చేసి సాష్టాంగ ప్రణామం చేసాడు. కొడుకు రూపంలో ఉండే హరికి తను నమస్కరించాడంటే, అక్కడ హరి హరిగానే దర్శనమిచ్చాడంటే, అది ప్రవృత్తి. ఆయన బోధాంశలో వచ్చాడు కాబట్టి ఇక్కడ ముక్తి మార్గాన్ని చూపించాడు. కాబట్టి భగవంతుణ్ణి ముక్తి మార్గంకోసమే ఆశ్రయిస్తే, ఆయనే గురువుగా వస్తాడు. కోరికలు తీర్చుకోవటానికి ఆశ్రయిస్తే, పురాణంలో చెప్పిన రూపంలోనే వస్తాడు. ఆ కోరికలు తీరుస్తాడు. కానీ అదంతా బంధన హేతువు అవుతుంది కాని ముక్తి మార్గం కానేరదు. ముక్తిని కోరితేనే భగవంతుడు గురుస్వరూపుడై వస్తాడని దాని తాత్పర్యం.

ఆ తరువాత కర్దముడు లోకం అంతా వాసుదేవ మయంగా, పరంజ్యోతి మయంగా చూచాడు. చివరకు కర్ద ముడు మోక్షంతో లయం చెందాడని అంటారు. అంటే ఆయన ఇతర మునులవలెగాక, ఏ లోకంలోనూ ఉండకుండా వెళ్ళి పోయాడు.

# శ్రీకృష్ణామృతం

## శ్రీకృష్ణజననం

నా బాలకృష్ణుడు, జనియించె ఇల నేడు
బహుళాష్టమి ఈనాడు, భాగ్యములో లలన

నా బాలకృష్ణుడు చెరసాల పుట్టేడు
చెలిమితో మెలిగేడు చూడవే లలనా

నా బాలకృష్ణుడు దేవకీ గర్భజుడు
దైవాంశ సంభవుడు దైవమే లలనా

నా బాలకృష్ణుడు వసుదేవ నందనుడు
వనమాల ధారకుడు వినవోయి లలనా

నా బాలకృష్ణుడు మురళీ చేపట్టేడు
మువ్వల్లు కట్టేడు మురిపాల లలనా

నా బాలకృష్ణుడు ప్రియమార నవ్వేడు
పింఛము చుట్టేడు పసిడీ ఓ లలనా

నా బాలకృష్ణుడు యశోదకు పాపడు
యమునమ్మకు మాధవుడుయాదవుడో లలనా




నా బాలకృష్ణుడు నోట భువనంబు చూపాడు
నెలత వలువల్లు దోచాడు నిక్కముగా లలనా

నా బాలకృష్ణుడు వెన్నల్ల దోచేడు
వెనుతట్టి కాచేడు వయ్యారి లలనా

నా బాలకృష్ణుడు కాళీయుని అణచేడు
కంసుడిని దునిమేడు కాంచుము ఓ లలనా

నా బాలకృష్ణుడు గోవుల్ల కాచేడు
గోవర్ధన మెత్తేడు గారంపు లలనా

నా బాలకృష్ణుడు కుచేలుని స్నేహితుడు
కనకంబు రాశితడు కంటివా ఓ లలనా

నా బాలకృష్ణుడు మేఘాల వర్ణుడు
మనోజ్ఞరూపుడు మరువకే లలనా

నా బాలకృష్ణుడు సరోజ నేత్రుడు
సరసిజ గాత్రుడు సింగారి లలనా

నా బాలకృష్ణుడు చందన తిలకితుడు
చక్కాని చెలికాడు చూడవే లలనా

నా బాలకృష్ణుడు రాధమ్మ కిష్టుడు
రసరమ్య చెలికాడు రావోయి లలనా

నా బాలకృష్ణుడు విభవములు కూర్చేడు
వరములను ఇచ్చేడు వేడవే లలనా

నా బాలకృష్ణుడు నను బ్రోవగ వచ్చేడు
నను వీడక కాచేడు నీ వెరుగవో లలనా

నా బాలకృష్ణునికి మంగళములీనాడు
ముత్యాల హారతులు ముదముతో లలన

– "అనంత"
(కృష్ణసుందరి సత్తిరాజు)

శ్రీవేంకటేశ్వరలీలలు



# నమ్మశక్యంగాని 'అద్భుతం'

- శ్రీ కె.సి.లలిత

కోరినకోర్కెలు తీర్చే కొండంత దేవుడు శ్రీశ్రీనివాసుని భక్తురాలిని నేను. ఆ గోవిందుని అనుగ్రహంతో నా జీవితంలో ఎన్నో అద్భుతాలు జరిగాయి. అందులో ఒక నమ్మశక్యం కాని అద్భుతం జరిగింది.

నేను ఎప్పుడు తిరుమలకు వచ్చినా ఆ కలియుగదైవం దర్శనం సంతృప్తి కలిగించదు. ఆ భక్తవత్సలుని ముఖం దగ్గరగా చూసి తరించడం సామాన్యభక్తులకు సుదూరమే.

ఒకనాటి రాత్రివేళ "స్వామీ! నాలాంటి సామాన్య భక్తురాలికి నిన్ను దగ్గరగా చూసి తరించే భాగ్యమే లేదా" అని కలత చెందాను. ఇలా ఆలోచిస్తూ ఆనాటి రాత్రి ఎప్పుడు నిద్రించానో నాకే తెలియదు. చూస్తుండగానే మరుక్షణం తిరుమల ఆనందనిలయం బంగారు బావి ఉన్న ప్రాకారంలో ఉన్నాను. చుట్టూ చూస్తున్నాను, నాకు ఒక్కరు కూడా కనిపించ లేదు. ఎవరూ లేరేమిటి అనుకొంటూ, బంగారుగోపురం చూస్తూ అటువైపు వచ్చాను. అక్కడ కూడా ఎవ్వరూ లేరు. బంగారు గోపురం చూశాను. విమాన వేంకటేశ్వరస్వామి కనిపించారు. రెండు చేతులతో తాకి కళ్ళకు అద్దుకొన్నాను.

అంతే, ఏదో అలజడి వినిపించింది. అటు వైపు చూసాను. ఇద్దరు భక్తులు పెద్ద నామాలు పెట్టుకొని ఎదుట నిలిచి ఉన్నారు. వారితో బాటు ఇంకొందరు కూడా వారి వద్దకు వచ్చి నిలబడ్డారు. ఆనందనిలయ గోపురం మహిమ గురించి ఏదో మాట్లాడుకుంటున్నారు. నాకు చాలా భయం వేసింది. వీరిని దాటుకుని వెళ్ళడం ఎలా అనుకున్నాను. వాళ్ళు ఏమి అడుగుతారో అనుకుని, కిందకు చూసాను. గాలిలో ఉన్న నేను కిందకు దిగి నిలబడ్డాను. వీళ్ళను తప్పించు కోవడం ఎలా? ఆపదమొక్కులవాడా నన్ను రక్షించు అనుకుంటూ కళ్ళు మూసుకున్నాను. తిరిగి కళ్ళు తెరచి చూసే సరికి స్వామివారి ఎడమ వైపు నిలబడి ఉన్నాను. నిత్యకల్యాణచక్రవర్తి శోభాయమానంగా వెలిగిపోతుంటే ఆ సౌందర్యమూర్తిని చూడదానికి రెండుకళ్ళు చాలడం లేదు. అంతే! పరవశించిపోయాను. స్వామిని చూసి ముగ్ధురాలినయ్యాను. స్వామిని ఇంకాస్త పైకి చూసాను.

అఖిలాండ కోటి బ్రహ్మాండ నాయకుని నిజమూర్తి ముఖం సాక్షాత్కరిస్తూ కనిపించింది. కళ్ళవెంట ఆనంద బాష్పాలు రాలాయి. తరతరాల తిరువేంకటాద్రి విభునిరూపాన్ని చూసి, 'స్వామీ! నా కోరిక నెరవేర్చావా? ఏ పుణ్యం చేసుకున్నానో? నా జన్మధన్యమయిపోయింది.' అని తలచుకుంటూ ఉంటే, ఒక్కసారి మెలకువ వచ్చినట్లయింది.

చూడగా, స్వామివారి మూలవిరాట్టుకు దగ్గరగా ఒంటరిగా నిలుచుని ఉన్నాను. భయకంపితురాలయ్యాను. అంతే! 'అమ్మా భయంగా ఉంది. భయంగా ఉంది' అని నిద్రలో పెద్దగా అరుస్తున్నాను. అంతలో నిద్రలో లేచి కూర్చుని అరుస్తున్న నన్ను మా వారు "లలితా! ఏమయ్యింది, ఏమయ్యింది?" అని అడిగారు. నేను వణికి పోతూ, కళ్ళ వెంబడి నీరుకారుస్తూ 'దేవుడు, దేవుడు' అని అంటుంటే, మావారు స్వామివారి చిత్రపటాన్ని తెచ్చి 'ఈ దేవుని చిత్రపటాన్ని పట్టుకో' అనగా, నేను ఆశ్చర్యంగా 'దేవుని చూశానని అంటే, దేవుని పటాన్ని ఇస్తున్నారేమిటి?' అని పలుకగా, వారు 'కంగారుపడకు, నిదానంగా ఏమి జరిగిందో' చెప్పమన్నారు. నాకు జరిగిన అనుభూతిని అంతా వివరంగా చెప్పాను. ఇదంతా ఒక కలగా అనిపించ లేదు. ఇప్పటికీ, నాకు అర్థం కాని విషయం పెద్దనామాలు ధరించి నాకు అగుపించిన వారు ఎవరు? నేను స్వామిని దర్శించింది ఏ సమయంలో? ఈ అద్భుతం ఎప్పుడు జరిగిందో, కంగారులో గుర్తించలేకపోయాను.

అంతా విన్న మా వారు అవాక్కయ్యారు. 'ఎప్పుడూ స్వామిని నాకు దగ్గర నుండి చూసే అదృష్టం లేదంటూ ఉండే దానివి కదా? స్వామి నీమీద చూపిన అనుగ్రహమే ఈ అద్భుతం అన్నది నిజం, ఇది నమ్మశక్యం కాని వాస్తవం. నీ జన్మధన్యమైపోయింది. ఇక ఏడుకొండల వేంకటరమణుని రూపం ఎప్పటికి నీ కళ్ళల్లో మెదులుతూ ఉండే భాగ్యాన్ని వరంగా ప్రసాదించి, నిన్ను ధన్యురాలిని చేసారు' అని తెలిపారు.

కాబట్టి ఇటువంటి అనుభవాలు ఎంతోమంది శ్రీవేంకటేశ్వర స్వామి భక్తులకు తరచుగా కలగడం ఒక విశేషం.

ఆయుర్వేదం

# సంప్రదాయవైద్యంలో శొంఠి

- డా॥ చిట్టిభొట్ల మధుసూదనశర్మ

ప్రాచీనకాలం నుంచి వాడుకలో ఉన్న మన ఆరోగ్య పరిరక్షణకు వుపయోగపడే అద్వితీయ క్షేమదాయక భగవదత్త మైన ప్రకృతి సిద్ధ ఔషధం 'శొంఠి'.

మనకు సంభవించే అసంఖ్యాక వ్యాధులపై అమోఘ మైన ప్రభావాన్ని చూపగలగటం చేత 'విశ్వభేషజం', 'మహౌషధి' అని, కారపు రుచి గల దుంపలను కలిగి వుండటం చేత 'కటు గ్రంథి' అని, కఫ దోష ప్రకోపాన్ని తగ్గించుటచే 'కఫారి' అని సంస్కృతంలో దీనికి పేర్లు కలవు.

*జింజిబరేసి* అను వృక్ష కుటుంబానికి చెందిన దీని శాస్త్రీయ నామం *జింజిబర్ అఫీషనాలిస్*. ఆంగ్లంలో *డ్రై జింజర్* అంటారు.

అల్లం దుంపలను పై తోలు గీకేసి సున్నపు తేటలో ముంచి ఎండబెడితే తయారయ్యే ఔషధమే శొంఠి.

మనదైనందిక జీవితంలో ఎదుర్కొనే వివిధ అనారోగ్య సమస్యలు, వ్యాధులలో సంవత్సరమంతా లభ్యమయ్యే ఈ శొంఠిని ఎలా సద్వినియోగం చేసుకొని ఆరోగ్య భాగ్యాన్ని పొంద వచ్చో ప్రస్తుతం తెలుసుకుందాం.

**తరచు జలుబు చేస్తూ ఉంటే :** 15 గ్రాముల శొంఠి పొడి, 15 గ్రాముల మిరియాల పొడి కలిపి ఉంచుకొని రోజు రెండుసార్లు పూటకు ఒక గ్రాము పొడిని తగినంత తేనె కలిపి సేవిస్తు ఉంటే త్వరగా సమస్య తగ్గుతుంది.

**గ్యాస్ట్రిక్ ట్రబుల్ :** శొంఠి, సోంపు గింజలు, సునాముఖి, సైంధవలవణం, కరక్కాయ పెచ్చుల చూర్ణాలను ఒక్కొక్కటి 25 గ్రాముల చొప్పున కలిపి ఉంచుకొని రోజు రెండు పూటల పూటకు 2-3 గ్రాముల పొడిని 100 మి.లీ. గోరువెచ్చనినీటిలో కలిపి సేవిస్తు ఉంటే జీర్ణరసాలు బాగా ఉత్పత్తి అయి మంచి ఆకలి కలుగుతుంది. తిన్న ఆహారం చక్కగా జీర్ణమవుతుంది.

కడుపునొప్పి, కడుపు ఉబ్బరం, త్రేన్పులు రావడం లాంటి సమస్యలు తగ్గుతాయి. ప్రేగుల కదలికలు సజావుగా జరిగి మలబద్ధక దోషం లేకుండా సుఖవిరేచనం అవుతుంది.

"అజీర్ణే వినా న రోగం" అను శాస్త్ర వచననుసారం అజీర్ణం లేకుంటే ఎలాంటి వ్యాధులు మన దరిచేరవని ఆయుర్వేద శాస్త్రం నొక్కి వక్కాణిస్తోంది. కాబట్టి అజీర్ణ సమస్యలు చక్కదిద్దేందుకు, జీర్ణావయవాలకు శక్తిని ప్రసాదిం చేందుకు ఈ అద్భుత ఔషధం వుపయోగపడుతుంది.

**కీళ్ళ నొప్పులకు :** శొంఠి పొడి, నల్ల నువ్వులను వేయించి చేసిన పొడి, బెల్లంపొడి ఒక్కొక్కటి 50 గ్రాముల చొప్పున కలిపి ఉంచుకొని ఉదయం, సాయంత్రం పూటకు 2-3 గ్రాముల పొడిని 100 మి.లీ. గోరు వెచ్చని పాలలో లేదా నీళ్ళలో కలిపి సేవిస్తు వుంటే చక్కటి ఫలితం త్వరలోనే కలుగుతుంది.

ఈ ఔషధ సేవనం వల్ల భుజం నొప్పి, నడుము నొప్పి, మడిమ నొప్పులు, కాళ్ళ నొప్పులు లాంటి వివిధ రకాల వాత నొప్పులు కూడా తగ్గిపోతాయి.

**బహిష్టు సక్రమంగా వచ్చేందుకు :** 50 గ్రాముల శొంఠి పొడి, 50 గ్రాముల ఎండు ఖర్జురం పెచ్చుల పొడి కలిపి ఉంచుకొని ఉదయం పరగడుపున 100 మి.లీ. వేడి పాలు లేదా వేడి నీటిలో ఒక టీ స్పూను పొడి కలిపి సేవిస్తు ఉండాలి. బహిష్టు వచ్చిన పిదప ఆపెయ్యాలి. మరల బహిష్టు సమయానికి 10-15 రోజుల ముందు ఈ ఔషధ సేవనం ప్రారంభించి బహిష్టు వచ్చిన పిదప ఆపివేయాలి. ఇలా 3-4 బహిష్టులు ఈ ఔషధాన్ని సేవించటం వల్ల బహిష్టు క్రమబద్ధం అవుతుంది.



**బహు మూత్రానికి :** శొంఠి పొడి, మిరియాల పొడి, పటిక బెల్లం పొడి ఒక్కొక్కటి 30 గ్రాముల చొప్పున కలిపి ఉంచుకొని ఉదయం, సాయంత్రం పూటకు ఒకట్రెండు గ్రాముల పొడిని తగినంత స్వచ్ఛమైన నేతితో కలిపి సేవిస్తు ఉంటే మూత్రాశయ కండరాలు ధృఢత్వాన్ని సంతరించుకొని ఆ సమస్య తగ్గిపోతుంది.

**పొట్ట కరిగేందుకు :** 200 మి.లీ. ఆవ నూనెను బాగా వేడి చేసి దించి అందులో 25 గ్రాముల శొంఠి పొడి, 25 గ్రాముల ఇంగువ పొడి కలిపి చల్లారిన తర్వాత ఒక సీసాలో నిల్వ ఉంచుకొని రోజు ఒకసారి తగినంత నూనెను గోరువెచ్చగా చేసి పొట్టపై సున్నితంగా మర్దన చేసి గంటసేపు ఆగి గోరువెచ్చని నీటితో స్నానం చేస్తు ఉంటే పొట్టభాగంలో అధికంగా సంచితమైన క్రొవ్వు కరిగిపోతుంది.

**వివిధ రకాల విరేచనాలకు :** శొంఠి పొడి, జీలకర్రను వేయించి చేసిన పొడి, వామును వేయించి చేసిన పొడి, మిరియాల పొడి ఆయుర్వేద ఔషధవిక్రయశాలల్లో లభ్యమయ్యే కొడిశపాల గింజల పొడిని సమానంగా కలిపి ఉంచుకొని రోజు రెండు పూటల పూటకు 2-3 గ్రాముల పొడిని తగినంత వెన్నతో కలిపి సేవిస్తు ఉంటే చీము, బంక, జిగురు, రక్త విరేచనాలు వాసనతో కూడిన విరేచనాలు తగ్గిపోతాయి.

**సయాటికా నొప్పికి :** ఉదయం, సాయంత్రం పూటకు 50 మి.లీ. వేడి పాలలో 2 గ్రాముల శొంఠి పొడి, 5 మి.లీ. తేనె కలిపి సేవిస్తు ఉంటే ఈ సమస్య త్వరగా తగ్గిపోతుంది.

**ఎక్కిళ్ళకు :** రోజు 2,3 సార్లు పూటకు ఒకట్రెండు గ్రాముల శొంఠి పొడిని తగినంత తేనెతో కలిపి సేవిస్తు ఉంటే వెంటనే సుగుణం కనిపిస్తుంది.

ధం అనగా ధనం లేదా రోగం. రోగములను నివారించువాడే ధన్వంతరి. 'ధన్వనః తారతయే లోకాత్ తరతి ఇతి'- ఎవరి కీర్తి సముద్రమును దాటి లోకమంతటా వ్యాపించినదో అతడు ధన్వంతరి.

'ధన్వ' శబ్దమునకు 'ఎడారి' అని కూడా ఒక అర్థం. కాబట్టి ధన్వంతరి అంటే ఎడారిని దాటిన వాడని శాస్త్రాల్లో పేర్కొనబడింది.

ఇంతే కాక "ధనుః" శబ్దానికి ధన్వంతరి అనే కొందరి భావిస్తారు. దీని ప్రకారం "శల్య తస్య అంతం పారం ఇయర్తి గచ్ఛతీతి ధన్వంతరిః". 'ధనుః' అంటే శాస్త్రం. శల్యశాస్త్రం అంటే శస్త్ర చికిత్సకు సంబంధించిన విజ్ఞానం. దానిని పూర్తిగా తెలుసుకొన్నవాడు ధన్వంతరి. గొప్ప శస్త్రవైద్య నిపుణుడు.

'ధన్వం పాపం తరతి తారయతోతరానితి, ధన్వమితి పాపజో రోగాః' అని మరొక వ్యాఖ్య.

'ధన్వం' అనగా పాపకర్మలచే కలుగు వ్యాధులు. పూర్వజన్మలో చేసిన పాపములు వ్యాధిరూపంలో మరు జన్మలలో కూడ బాధిస్తున్నది. ఇటువంటి పాపాలకారణంగా కలిగే రోగాలను పరిహరించి రక్షించువాడు ధన్వంతరి.

'ధం ధనం నాశయతీతి ధనవో రోగః తేషాం
అంతం రాతి దదాతీతి ధన్వంతరిః రోగనాశకః'

భారతీయసాంస్కృతిక వైజ్ఞానికి నిజాలు, ధార్మిక క్షేత్రంలోనే అంకురించాయి. ఆయుర్వేదం, అత్యంత ప్రాచీనమైన వైద్యశాస్త్రంగా ప్రసిద్ధి చెందింది. బ్రహ్మ వేదములలో సృష్టించు సందర్భంలోనే అధర్వణవేదం, ఉపవేదంగా ఆయుర్వేదాన్ని సృష్టించాడు. శ్రీమహావిష్ణువు 24 అవతారాలలో 12వ అవతారమే ధన్వంతరి. సముద్రమథనం జరిగినప్పుడు అమృతకలశధారిగా ధన్వంతరి అవతరించాడు. శ్రీమహావిష్ణువు లక్ష్మిని చేపట్టి లక్ష్మీనారాయణుడయ్యాడు. ధన్వంతరి అత్యంత సుందరాకారుడని రామాయణం, మహాభారతం హరివంశం మున్నగు కావ్యాలలో వర్ణింపబడినాడు. ధన్వంతరి ప్రకాశవంతమైన కాంతితో కూడిన వాడు. అమృతమును స్రవింపచేయు పవిత్రకిరణాలతో జగత్తుకు జీవకళను ప్రసాదించేవాడు. యౌవనుడైన ధన్వంతరి శరీరము నీలమేఘ వర్ణముతో ముత్యాలహారాలతో రాజిల్లేవాడుగా పేర్కొంటారు..

వైద్యసమాజమేకాక, వైదికసముదాయం కూడా ధన్వంతరిని శ్రీమహావిష్ణువు అవతారంగా భావించారు.

# సంస్కృతం నేర్చుకుందాం..!!

పాఠం-11

రచన- కీ.శే. మహామహోపాధ్యాయ కాశీ కృష్ణాచార్య
నిర్వహణ- మహామహోపాధ్యాయ సముద్రాల లక్ష్మణయ్య

| | | | | | |
|---|---|---|---|---|---|
| बालकः | = పిల్లవాడు | ब्राह्मणः | = బ్రాహ్మణుడు | अनुजः | = తమ్ముడు |
| इव | = వలె | खलु | = కదా | अहो | = ఔర! |
| स्नानं | = స్నానము, ను | स्नानानि | = స్నానములు, లను | भोजनं | = భోజనము, ను |

అ) ఈ క్రింది వాటికి తెలుగులోకి అనువాదం చేయండి?

01) सर्वे ब्राह्मणाः तत्र भोजनं कुर्वन्ति?
02) वयं अत्र भोजनं कुर्मः।
03) यूयं कुत्र स्नानं कुरुथ?
04) सर्वे बालकाः तत्र न सन्ति?
05) अत्र एकः अपि भोजनं न करोति।
06) सः बालकः इवास्ति ?
07) एते स्नानं कुर्वन्ति खलु।
08) न कुर्वन्ति।
09) किमर्थम्?
10) ते बालकाः इव सन्ति।

ఆ) ఈ క్రింది వాటికి సంస్కృతంలోకి అనువాదం చేయండి?

01) బ్రాహ్మణులందరు నెక్కడ నుండిరి?
02) వారు స్నానము చేయుచున్నారు.
03) ఇవ్వేళ నిక్కడ నేమి?
04) ఏమియును లేదు.
05) కొందరు పిల్లలు అక్కడ భోజనములను చేయుచున్నారు.
06) మేమందరము ఇక్కడ స్నానము చేయుచున్నాము.
07) ఎందరు పిల్లలు ఇక్కడ నున్నారు?
08) పిల్లలందరును ఇక్కడనే యున్నారు.
09) మీరు స్నానము చేయుట లేదేమి?
10) మీరు పిల్లలవలె నక్కడ నెందుకు భోజనములను చేయుచున్నారు? ఔరా!


### అ) జవాబులు

01) అందరు బ్రాహ్మణులు అక్కడ భోజనం చేస్తున్నారు.
02) మేము ఇక్కడ భోజనం చేస్తున్నాము.
03) మీరు ఎక్కడ స్నానం చేస్తున్నారు?
04) అందరు బాలకులు(పిల్లవాళ్ళు) అక్కడ లేరు.
05) ఇక్కడ ఒక్కడు కూడ భోజనం చేయుట లేదు.
06) వాడు బాలకుని (పిల్లవాడి) వలెనున్నాడు.
07) వీరు స్నానం చేస్తున్నారు కదా.
08) చేయుట లేదు.
09) ఎందుకు?
10) వారు (పిల్లల) బాలులవలె నున్నారు.

### ఆ) జవాబులు

01) सर्वे ब्राह्मणाः कुत्रासन्?
02) ते स्नानं कुर्वन्ति।
03) अत्र अद्य किमस्ति?
04) किमपि नास्ति।
05) केचन बालकाः तत्र भोजनानि कुर्वन्ति।
06) वयं सर्वे अत्र स्नानं कुर्मः।
07) अत्र कति बालकाः सन्ति?
08) बालकाः सर्वे अत्रैव सन्ति।
09) यूयं स्नानं न कुरुथ किम्!
10) अहो! यूयं बालकवत् तत्र कुतः भोजनानि कुरुथ?

విశ్వదాభిరామం వేమన పద్యసూక్తి



# కలిమి - కరుణ

కలిమినాడు నరుడు కానడు మదమున;
లేమినాడు మొదలె లేదు పెట్ట;
కలిమి లేమి లేనికాలంబు గలుగునా?
విశ్వదాభిరామ! వినుర వేమ!

**అర్థాలు:** కలిమి= సంపద; నరుడు= మనిషి; మదము= దురహంకారము; లేమి= దారిద్ర్యం, పేదరికం.


**భావం:** మనిషి తనకు ధనం ఉన్నప్పుడు దురహంకారంతో ఈలోకాన్ని చూడడు. అనగా ఇతరులకేమీ పెట్టడాని కిష్టపడడు. ఏమీ లేనినాడు ఇతరులకు పెట్టటానికి తనవద్ద మొదలే ఏమీ ఉండదు. కాబట్టి సంపద ఉన్నా, లేకపోయినా, దానం చేయడం ఉండనే ఉండదు. ఇంక ఎప్పుడైనా, దానం చేయాలంటే దారిద్ర్యమూ, ఐశ్వర్యమూ రెండూ లేకుండా ఉండాలి. కాని అటువంటికాలం ఉండదు. మొత్తం మీద మనిషి ఎప్పుడూ దానం చేయడు.

**వివరణ:** మానవుడు ధనం ఉన్నపుడు అహంకరించ గూడదు. ఇతరులకు దానం చేస్తుండాలి. దరిద్ర స్థితిలో కూడా ఉన్నంతలో ఇతరులకు సహాయం చేయాలి. ఇతరులకు ఉపకారం చేయాలి అనే దయాబుద్ధి ముఖ్యం గానీ, ధనం ఉండడం, లేక పోవడం కా దని తాత్పర్యం.

- కీ.శే. విద్వాన్ కట్టా నరసింహులు

68

# వైకుంఠపాళి



**నిర్వహణ** శ్రీ కోగంటి వేంకట అప్పలాచార్యులు

## అడ్డం

2)కాలుని సోదరి(2); 3)ఈ రాక్షసుణ్ణి చంపుట వల్ల శ్రీకృష్ణుడు కేశవుడయ్యాడు(2); 7)హరిద్వారమునకు మరొకపేరు(2); 8)కల్కి తల్లి(3); 9)బ్రహ్మకు మరొక పేరు(2); 12)చెట్టు(3); 13)అరిషడ్వర్గాల్లో ఒకటి(3); 17)విభీషణుని కూతురు(2); 18)ఉద్దాలకుడను బ్రాహ్మణుని భార్య(3); 19)ఈ వంశంలోని వారు దుర్యోధనాదులు(2); 22)దత్తాత్రేయుని పుత్రుడు(2) 23)భృగువు భార్య(2)

## నిలువు

1)సృంజయుని కూతురు(4); 2)శ్రీకృష్ణుని అష్టభార్యలలో ఒకతె(2); 4)ధ్రువుని కుమారుడు(2); 5)దుష్యంతుని భార్య(4) 6)జనమేజయుని తండ్రి(3); 10)తన స్వప్నవృత్తాంతాన్ని సీతకు చెప్పి ఓదార్చిన రాక్షసి(3); 11)సూర్యుని కుమార్తె(3); 14)మృకండమహర్షి భార్య(4); 15)పార్వతి శరీరంనుండి పుట్టిన దేవి(3); 16)పశ్చిమ దిక్పాలకుడు(4); 20)యుద్ధం(2); 21)చ్యవనమహర్షి కొడుకు(2)

జవాబులు ఈ సంచికలోనే ఉన్నాయి. అన్వేషించి... సరిచూసుకోండి.

- ప్రధాన సంపాదకుడు



మనిషి ధనమున్నపుడు అహంకరించరాదు

బాలనీతి

# పెరట్లో పెన్నిధి

- శ్రీమతి ఎం. సత్యవతి

రామాపురంలో గోపన్న అనేవాడు ఉండేవాడు. అతనికి ఒక ఇల్లు, పెరట్లో కొంత ఖాళీ స్థలం, ఒక మామిడి చెట్టు, ఆ చెట్టుక్రింద ఒక పెద్ద బండరాయి ఉండేవి. అతనికి ధనవంతుడిని కావాలని చాలా కోరిక. అందుకని అతను చిన్న, చిన్నవ్యాపారాలు చేశాడు. కానీ అన్నింట్లోనూ నష్టమే వచ్చి, అప్పుల పాలయ్యాడు.

ఒకనాడు రాత్రి ఆ మామిడి చెట్టు క్రింద బండరాయి మీద పడుకుని, ఈ అప్పులన్నీ తీర్చడమెలాగా అని దిగులు పడుతూ నిద్రపోయాడు.

అప్పుడు అతనికి ఒక కల వచ్చింది. ఆ కలలో ఒక దేవత కనపడి, నీవు భోగాపురం వెళ్ళితే ధనవంతుడివి కాగలవు అని చెప్పింది. అతను పెద్దగా పట్టించుకోలేదు. రెండవ రాత్రి కూడా అతనికి అదే కల వచ్చింది. ఆ తరువాత కూడా అదే కల వచ్చింది. అతనికి ఇక పట్టించుకోక తప్పలేదు.

ఒకే కల పదే పదే వస్తుందంటే, ఇందులో ఏదో ఉందనుకుని ఆ భోగాపురం ఊరి గురించి అందరినీ అడిగి, ఎక్కడ ఉందో తెలుసుకుని, ఆ ఊరు బయల్దేరాడు. ఆ ఊరు చేరేసరికి రాత్రి అయింది. అక్కడ అతనికి ఎవరూ తెలియదు. ఒక భవంతి అరుగు మీద పడుకొని నిద్రపోయాడు.


ఒకరాత్రివేళ ఎవరో పరుగిడుతూన్నారు. వాళ్లని చూసి, అక్కడ ఉంటే ప్రమాదమనుకుని, తాను కూడా వారితోపాటు పరుగెత్తసాగాడు. నిజానికి వారు దొంగలు, రక్షకభటులు వెంట తరుముతుంటే పరుగెడుతున్నారు.

గోపన్న ఎంత చెప్పినా వినకుండా, రక్షకభటులు అతనిని కూడా దొంగలతో పాటు న్యాయాధికారి వద్దకు చేర్చారు, అప్పుడు అతను తాను దొంగని కాదనీ, అసలు ఆ ఊరువాడినే కాననీ మొరపెట్టు కున్నాడు. అందుకు న్యాయాధికారి ఆ ఊరు ఎందుకు వచ్చావని అడిగాడు. అందుకు అతను తన కల సంగతి చెప్పాడు.

ఆ న్యాయాధికారి విరగబడి నవ్వాడు. వెర్రివాడా! కలను నమ్ముకుని ఇంతదూరం వచ్చేవా, అలా అయితే నాకూ రోజూ ఒక కల వచ్చేది. "రామాపురం అనే ఊరిలో ఊరికి దూరంగా ఒక మామిడిచెట్టు క్రింద బండరాయిని తొలగిస్తే, ఎనలేని, నిధి లభిస్తుందని ఆ కల. అది వినగానే గోపన్నకి తన ఇల్లు, మామిడి చెట్టూ, బండరాయి గుర్తుకు వచ్చాయి. అప్పుడు ఆ న్యాయాధికారి ఇలా అన్నాడు, "కానీ, ఆ కల నమ్ముకుని నేను రామాపురం వెళ్లడానికి నాకు నీలాగా పిచ్చిలేదు. అందుకే నేను వెళ్ళలేదు" అన్నాడు.

అందుకు గోపన్న, "అవును స్వామీ! మీకు నాలాగా పిచ్చిలేదు. నేను కనుక కలను నమ్ముకుని ఇంతదూరం వచ్చాను" అన్నాడు.

అప్పుడు న్యాయాధికారి దయతలచి, అతనిని విడుదల చేశాడు. వెంటనే అతను తన ఊరు చేరాడు. పెరట్లో ఉన్న బండరాయిని తొలగించగానే, తళతళ మిలమిలా మెరుస్తున్న వెలలేని రాళ్ళూ, బంగారము ఉన్న నిధి అతనికి దొరికింది.



దానితో అతను సంపన్నుడయ్యాడు. మనమూ గోపన్న లాగే ప్రవర్తిస్తున్నాం. మన పెరట్లో ఉన్న నిధి గురించి మనకి తెలియక ఎక్కడో ఏదో లభిస్తుందన్న కలలు కని, ఆ దేశాలు వెళ్తున్నాం. నిజానికి తెలివైనవాళ్ళు మన దేశంలోనే, అవకాశాలు సృష్టించుకుని, అంతులేని సంపన్నులౌతున్నారు. అందుచేత 'మన పెరట్లోనే ఉన్నది అంతులేని పెన్నిధి' అన్న నీతిని గుర్తించాలి.

# చిత్ర కథ

# వామనుడు

కథ-డా॥ అల్లాడి సంధ్య
చిత్రాలు-కె. తులసీప్రసాద్




17 బలిచక్రవర్తి యాగాన్ని చేయడాన్ని గమనించిన వామనుడు, ఇంద్ర పదవి చేజిక్కించుకున్న చక్రవర్తి దగ్గరికి సరాసరి వెళ్ళారు.
18 వటువా! నీకు ఏమి కావాలో కోరుకో! అని అని అనగా
19 చక్రవర్తీ! వచ్చిన బాలుడు సామాన్యుడు కాదు! జాగ్రత్త!
20 చక్రవర్తి నేను బ్రహ్మచారిని! నాకేమి కావాలి! కేవలం నేను ఉండేదానికి నాకు, 'మూడు అడుగుల' భూమిని ఇవ్వు అన్నాడు
21 అట్లే ఇస్తాను అని జలపాత్రను తీశాడు చక్రవర్తి. కాని గురువైన శక్రుడు ఇది గమనించి జలపాత్రలో ప్రవేశించి జలము వచ్చే దారిని ఆపేశాడు!
22 కానీ, వామనుడు ఒక దర్భతో పాత్రలో నీరు వచ్చే మార్గన్ని ఛేదించాడు
23 బ్రహ్మచారి! పరిగ్రహించు! మూడు అడుగుల దానాన్ని అని పలికాడు
24 అప్పడు వామనుడు - ఒక పాదాన్ని భూమిపై, రెండవ పాదాన్న స్వర్గముపై మోపి..
25 చక్రవర్తి! మూడవ పాదాన్ని ఎక్కడ పెట్టాలి
26 బలిచక్రవర్తి- వచ్చినవాడు సాక్షాత్తు శ్రీమన్నారాయణుడిగా గుర్తించి..
27 స్వామీ! మూడవ పాదాన్ని నా తలపై మోపండి అని పలికాడు
28 అప్పడు అతని తలపై తన మూడవ అడుగును మోపి భగవానుడు చక్రవర్తిని పాతాళానికి పంపివేశాడు అతనిని ధన్యజీవిని చేశాడు.
29 దీనిని గమనించిన సమస్తలోకవాసులు 'వామనుని' వివిధరకాలుగా స్తోత్రం గావించారు.
30 ఎప్పడూ 'గర్వాన్ని త్యజించాలి' అని లోకానికి తెలియజేయడానికి భగవానుడు 'వామనావతారం' ఎత్తారని గ్రహించాలి.
స్వస్తి

# బాలవినోదం

పిల్లలూ... మీ మేధస్సుకు పదును పెట్టండి

నిర్వహణ: డా॥ అల్లాడి సంధ్య

## కదంబం

### దశగణపతులు

01) మహాగణాధిపతి
02) కుమారగణపతి
03) హేరంబగణపతి
04) నవనీతగణపతి
05) స్వర్ణగణపతి
06) సంతానగణపతి
07) హరిద్రాగణపతి
08) ఉచ్ఛిష్టగణపతి
09) ఊర్ధ్వగణపతి
10) లక్ష్మీగణపతి

## పిల్లలూ..జతచేయండి!!

| | | | |
|---|---|---|---|
| 1) | తిరుపతి | అ) | శ్రీవేదనారాయణస్వామి |
| 2) | వాయల్పాడు | ఆ) | శ్రీకల్యాణవేంకటేశ్వరస్వామి |
| 3) | నారాయణవనం | ఇ) | శ్రీవేణుగోపాలస్వామి |
| 4) | నాగలాపురం | ఈ) | శ్రీకోదండరామస్వామి |
| 5) | కార్వేటినగరం | ఉ) | శ్రీపట్టాభిరామస్వామి |

జవాబులు: 1-(ఈ); 2-(ఉ); 3-(ఆ); 4-(అ); 5-(ఇ)

## మీకు తెలుసా?

1) తిరుమలలో జరిగే పూజాదుల విధానం?
2) వరాహస్వామి వేంకటేశ్వరుడికి ఎన్ని అడుగుల తావు ఇచ్చాడు?
3) పద్మావతీదేవి సోదరుని పేరు?
4) కుబేరునిదగ్గర తన పెళ్లి ఖర్చుకుగాను శ్రీనివాసుడు అప్పుతీసుకొన్న సొమ్ము?
5) శ్రీనివాసుడు ఎంతకాలం దాకా వడ్డీ ఇస్తుంటానని అప్పు పత్రం రాసి ఇచ్చాడు?
6) తిరుమల శ్రీవారి ఆలయ రాజగోపురం మీద ఉన్న బంగారు కలశాల సంఖ్య?
7) తిరుమలలో శ్రీవారికి 'తోమాలసేవ'ను రోజుకు ఎన్నిసార్లు చేస్తారు?

జవాబులు:
1) వైఖానస ఆగమం
2) 100 అడుగులు
3) వసుదానుడు
4) 14 లక్షల రామముద్రికలు
5) కలియుగాంతం వరకు
6) ఏడు
7) రెండసార్లు

## కనుక్కోండి


ఈ అక్షరాలతో ఒక సూక్తి వస్తుంది...

గు న్ని ణా చిం లే
మా క్ష మిం ది దు

జవాబు:
క్షమాగుణాన్ని మించింది లేదు

## చిత్రలేఖనం

ఈ క్రింది బొమ్మకు రంగులు వేద్దామా...



ఈ పక్కన ఉన్న బొమ్మను క్రింది గడులలో గీయండి...

Printed by Sri P.Ramaraju, M.A., Special Officer (Press & Publications), T.T.D. Press, Tirupati and Published by Dr. K.Radharamana, M.A., M.Phil., Ph.D., on behalf of Tirumala Tirupati Devasthanams and Published at Tirupati - 517 507. Editor: Dr.V.G.Chokkalingam, M.A., Ph.D.

# తిరుమల తిరుపతి దేవస్థానములు



11-8-2021న తిరుమల తిరుపతి దేవస్థానముల అధ్యక్షులు గా శ్రీ వై.వి.సుబ్బారెడ్డి గారు ప్రమాణస్వీకారం చేస్తున్న దృశ్యం.
ఈ కార్యక్రమంలో తి.తి.దే. కార్యనిర్వహణాధికారి డా॥ కే.యస్. జవహర్ రెడ్డి, ఐ.ఏ.ఎస్.,
చంద్రగిరి శాసనసభ్యులు & తుడా ఛైర్మన్ డా॥ చెవిరెడ్డి భాస్కర్ రెడ్డి,
సంయుక్త కార్యనిర్వహణాధికారిణి శ్రీమతి సదా భార్గవి, ఐ.ఏ.ఎస్., గారలు పాల్గొన్నారు.



11-8-2021న తి.తి.దే. అధ్యక్షులుగా ప్రమాణం చేసిన అనంతరం శ్రీ వై.వి.సుబ్బారెడ్డి గారికి
స్వామివారి చిత్రపటం అందజేస్తున్న తి.తి.దే. కార్యనిర్వహణాధికారి డా॥ కే.యస్. జవహర్ రెడ్డి, ఐ.ఏ.ఎస్. గారు.
ఈ కార్యక్రమంలో తి.తి.దే. అదనపు కార్యనిర్వహణాధికారి శ్రీ ఏ.వి.ధర్మారెడ్డి, ఐ.డి.ఈ.ఎస్,
తి.తి.దే. ఓ.ఎస్.డి. శ్రీ శేషాద్రి గారలు పాల్గొన్నారు.



20-8-2021న తిరుచానూరు శ్రీపద్మావతి అమ్మవారి ఆలయంలో
శాస్త్రోక్తంగా జరిగిన శ్రీవరలక్ష్మీ వ్రతంలో పాల్గొన్న
తి.తి.దే. అధ్యక్షులు శ్రీ వై.వి.సుబ్బారెడ్డి దంపతులు మరియు
తి.తి.దే. కార్యనిర్వహణాధికారి డా॥ కే.యస్. జవహర్ రెడ్డి, ఐ.ఏ.ఎస్. గారలు



20-8-2021న తిరుచానూరు శ్రీపద్మావతి అమ్మవారి ఆలయంలో
'తులాభారం' ప్రారంభంలో పాల్గొన్న తి.తి.దే. అధ్యక్షులు శ్రీ వై.వి.సుబ్బారెడ్డి దంపతులు.
ఇందులో పాల్గొన్న తి.తి.దే. కార్యనిర్వహణాధికారి డా॥ కే.యస్. జవహర్ రెడ్డి, ఐ.ఏ.ఎస్., గారు
సంయుక్త కార్యనిర్వహణాధికారిణి శ్రీమతి సదా భార్గవి, ఐ.ఏ.ఎస్., గారు మరియు ఇతర అధికారులు.




30-8-2021న శ్రీకృష్ణాష్టమి పర్వదినాన్ని పురస్కరించుకుని
శ్రీవారికి 'నవనీత సేవ' ప్రారంభంలో భాగంగా వెన్న ఊరేగింపులో
పాల్గొన్న తి.తి.దే. అధ్యక్షులు శ్రీ వై.వి.సుబ్బారెడ్డి గారు.
ఇందులో కార్యనిర్వహణాధికారి డా॥ కే.యస్. జవహర్ రెడ్డి, ఐ.ఏ.ఎస్., గారు
మరియు ఇతర ఉన్నతాధికారులు పాల్గొన్నారు



30-8-2021న శ్రీకృష్ణాష్టమి పర్వదినాన్ని పురస్కరించుకుని
శ్రీవారికి 'నవనీత సేవ' ప్రారంభంలో వెన్నను చిలుకుతున్న
తి.తి.దే. అధ్యక్షులు శ్రీ వై.వి.సుబ్బారెడ్డి గారు.
ఈ కార్యక్రమాన్ని వీక్షిస్తున్న తి.తి.దే. కార్యనిర్వహణాధికారి
డా॥ కే.యస్. జవహర్ రెడ్డి, ఐ.ఏ.ఎస్., గారు మరియు ఇతర ఉన్నతాధికారులు

SAPTHAGIRI (TELUGU) ILLUSTRATED MONTHLY Published by Tirumala Tirupati Devasthanams printing on 25-08-2021 and posting at Tirupati RMS. Regd. with the Registrar of Newspapers for India under RNI No.21139/1970. Postal Regd.No.TRP/155/2021-2023 "Licenced to post without prepayment No.PMGK/RNP/WPP-04(1)/2021-2023" posting on 5th of Every Month.

